


www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక




Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 24 సోమవారం | ఫిబ్రవరి 2025 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 160
Navabhoomi daily fallows..
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur

## రేవంత్‌కు రాహుల్ ఫోన్

- ఎస్ఎల్బీసీ టన్నెల్ కూలిన ఘటనపై రాహుల్ కలత
- సీఎం రేవంత్‌కు ఫోన్ చేసి వివరాల ఆరా
- 20 నిమిషాల సేపు మాట్లాడుకున్న రాహుల్,రేవంత్
- ఎస్ఎల్బీసీ ఘటనపై ప్రభుత్వ చర్యలను రాహుల్ అభినందన

2

హైదరాబాద్-నవభూమిబ్యూరో
ఎస్ఎల్బీసీ సొరంగ మార్గంలో చిక్కుకున్న 8 మంది ఇంజినీర్, కార్మికులను కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం సహాయక ముమ్మరంగా కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో ఎస్ఎల్బీసీ వద్ద బాధితులను రక్షించేందుకు జరుగుతున్న సహాయక చర్యలపై కాంగ్రెస్



## అత్యంత విషమంగా పోప్ ఫ్రాన్సిస్ ఆరోగ్యం

◆ హైఫ్లో ఆక్సిజన్‌తో చికిత్స..వైద్యుల ప్రకటన



2

అమరావతి-నవభూమిబ్యూరో
ప్రముఖ క్రైస్తవ మత గురువు పోప్ ఫ్రాన్సిస్ ఆరోగ్యం మరింత విషమించినట్టు వైద్యులు ప్రకటించారు. ప్రస్తుతం ఆయన వయస్సు 88 ఏళ్లు. ఈ నెల 14వ తేదీన ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో రోమ్‌లోని గెమిల్లీ ఆసుపత్రిలో చేరారు పోప్ ఫ్రాన్సిస్. అయితే శ్వాస తీసుకోవడంలో శనివారం నాడు మరింతగా ఇబ్బంది పడ్డారని.. దీంతో హైఫ్లో ఆక్సిజన్ అందిస్తున్నట్లు డాక్టర్లు తెలిపారు. ఎనీమియా సంబంధిత సమస్యను గుర్తించిన వైద్యులు రక్తాన్ని కూడా మార్చని స్పష్టం చేశారు. పోప్ న్యూమోనియాతో పాటు తీవ్రమైన శ్వాసకోశ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతు న్నారని వైద్యులు చెబుతున్నారు. మరో వారం రోజులపాటు ఆసుపత్రి లో ఉండాల్సి వస్తుందని పేర్కొన్నారు. మరోవైపు ప్రమాదం నుంచి పోప్ ఇంకా బయటపడలేదని ఆయన వ్యక్తిగత ఫిజీషియన్ లూగీ కార్బోన్ తెలిపారు. చాలా సంవత్సరాల తర్వాత 100 రోజులు ఆడిన సినిమా అర్జెంటినా రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో 1936లో పోప్ ఫ్రాన్సిస్ జన్మించారు. ఆయన అసలు పేరు జార్జ్ మారియో బెర్గోగ్లియో.

## ఉగాండా జైల్లో భారత బిలియనీర్ కూతురి కష్టాలు

- కిడ్నాప్, హత్యా నేరంపై అరెస్టయిన వసుంధర ఓస్వాల్
- హత్యకు గురైనట్టుగా భావిస్తున్న వ్యక్తి టాంజానియాలో సజీవంగా ప్రత్యక్షం
- ఎట్టకేలకు జైలు నుంచి బయటికొచ్చిన వసుంధర

2

అమరావతి-నవభూమిబ్యూరో
ఆఫ్రికా దేశం ఉగాండాలో భారత సంతతి బిలియనీర్ పంకజ్ ఓస్వాల్ కుమార్తె వసుంధర ఓస్వాల్ అనూహ్య రీతిలో జైలుపాలయ్యారు. తన తండ్రి వద్ద పనిచేసిన ముఖేశ్ మెనారియా అనే మాజీ ఉద్యోగిని అపహరించి, హత్య చేసినట్టు 26 ఏళ్ల వసుంధర ఓస్వాల్ పై తీవ్ర అభియోగాలు మోపారు. ఆమెను గతేడాది అక్టోబరు 1న అరెస్ట్ చేశారు. ఆమెను మూడు వారాల పాటు రిమాండ్ లో ఉంచారు. అయితే, హత్యకు గురైనట్టు



## ఏపీ ఉద్యోగులకు శుభవార్త

- ఉద్యోగులను పోలీసులు అరెస్టు చేసే విషయంలో ఒక స్పష్టమైన విధానం
- రిజిస్ట్రేషన్ శాఖలో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు
- సచివాలయ సిబ్బందితో ఖాళీ పోస్టుల భర్తీ

2



అమరావతి-నవభూమిబ్యూరో
రిజిస్ట్రేషన్ల శాఖకు వీలైనంత త్వరగా కొత్త బిల్డింగుల నిర్మించి ఇస్తామని మంత్రి అనగాని సత్య ప్రసాద్ తెలిపారు. ఆదివారంఆంధ్రప్రదేశ్ సబ్ రిజిస్ట్రార్ల అసోసియేషన్, రిజిస్ట్రేషన్, స్టాంపులు శాఖ ఉద్యోగుల సంఘం సంయుక్త సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి అనగాని సత్య

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం
## రంగంలోకి హైడ్రా డీఆర్ఎఫ్ బృందాలు

- ఎస్ఎల్బిసి టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు
- సొరంగంలో చిక్కుకుపోయిన 8 మందిని రక్షించేందుకు యత్నాలు
- హైడ్రా ఆధ్వర్యంలో రంగంలోకి దిగిన సహాయ బృందాలు
- సీఎస్ ఆదేశాలతో హైడ్రా రెస్క్యూ టీం సహాయక చర్యలు
- మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి,కృష్ణారావు అక్కడే ఉండి పర్యవేక్షణ

2




**నాగర్‌కర్నూల్-నవభూమిబ్యూరో:** అచ్చంపేట మండలం దోమలపెంట వద్ద శ్రీశైలం ఎడమగట్టు కాలువ ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతు న్నాయి. సొరంగంలో చిక్కుకుపోయిన 8 మంది కార్మికులను రక్షించేందుకు అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కార్మికులను కాపాడేందుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆధ్వర్యంలో సహాయక బృందాలు సైతం రంగంలోకి దిగాయి.
ప్రమాదం జరిగిన ఎస్ఎల్బీసీ టన్నెల్ వద్దకు చేరుకున్న హైడ్రా డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలను ముమ్మరం చేశాయి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సీఎస్ శాంతి కుమారి ఆదేశాలతో హైడ్రా రెస్క్యూ టీమ్స్ సహాయక చర్యల్లో నిమగ్నం అయ్యాయి. సంఘటనా స్థలంలో ఇతర అధికారులతో కలిసి కమిషనర్ రంగనాథ్ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. మరోవైపు దోమలకుంట ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్దకు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి

## షేర్ మార్కెట్లో అల్లకల్లోలం

- 5 నెలలుగా దిగజారుతున్న స్టాక్ మార్కెట్
- 10,000 పాయింట్లకు పైగా లాభాలను కోల్పోయిన సెన్సెక్స్
- దాదాపు 4000 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ
- పెట్టుబడిదారుల్లో ఆందోళన పెంచుతున్న స్టాక్‌మార్కెట్
- ట్రంప్ యుఎస్ అధ్యక్షుడు అయ్యాకే స్టాక్‌మార్కెట్‌కు నష్టాలు

2



ముంబై-నవభూమిబ్యూరో
స్టాక్ మార్కెట్ ప్రస్తుతం చెడు దశలో ఉంది. దీనికి తోడు నిరంతరం ఒత్తిడిలో కొనసాగుతుం ది. అయితే పెట్టుబడిదారుల పోర్ట్‌ఫోలియోల వాల్యూ మాత్రం తగ్గుతోంది. గత సంవత్సరం చివరి నెలల నుండి బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సెన్సెక్స్ అండ్ నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ క్షీణతను ఎదుర్కొంటున్నాయి. మెల్లిమెల్లిగా పరిస్థితి మెరుగుపడటానికి బదులుగా మరింత దిగజారుతోంది. గత 5 నెలల్లో సెన్సెక్స్ 10,000 పాయింట్లకు పైగా లాభాలను కోల్పోయింది. నిఫ్టీ దాదాపు 4000 పాయింట్లు కోల్పోయింది. రేపటి సంకేతాలు ఏమిటి? గత వారం చివరి ట్రేడింగ్ రోజు అంటే శుక్రవారం మార్కెట్ నష్టాలతో ముగిసింది. ఈ కాలంలో నిఫ్టీ 22800 ముఖ్యమైన స్థాయి కంటే దిగువకు పడిపోయింది, ఇది పెట్టుబడిదారుల లో ఆందోళనలను పెంచింది. నిజానికి, నిఫ్టీ ఈ స్థాయి కంటే దిగువకు పడిపోతే క్షీణత మరింత విస్తరించవచ్చని ఇప్పటికే భయపడుతు న్నారు. ఇలాంటి పరిస్థితిలో సోమవారం షేర్ మార్కెట్ బాగా పనిచేస్తుందనే ఆశ చాలా తక్కువ. ఇది కాకుండా, అమెరికన్ షేర్ మార్కె ట్ కూడా శుక్రవారం క్షీణతను నమోదు చేసిం ది. ఈ వార్త సోమవారం భారత మార్కెట్‌ను ఒత్తిడిలో ఉంచే అవకాశం ఉంది. 'ఇవి మార్కెట్ మూడ్ ని చెడగొట్టాయి. సెప్టెంబర్ 2024లో సెన్సెక్స్ ఆల్ టైమ్ గరిష్ట స్థాయి 86,000ను తాకింది. అదే సమయంలో నిఫ్టీ 26,300ను తాకింది. ప్రస్తుతం సెన్సెక్స్ 75,311.06 స్థాయికి, నిఫ్టీ 22,795.90 స్థాయికి చేరుకున్నాయి. షేర్ మార్కెట్ ఈ

## ఆలయ స్వర్ణ విమాన గోపురం
## స్వామి వారికి అంకితం

- అంగరంగ వైభవంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలోని ప్రధాన ఆలయ స్వర్ణ విమాన గోపురం ప్రారంభోత్సవం
- దేశంలోనే అత్యంత ఎత్తయిన స్వర్ణ విమాన గోపురంగా రికార్డు
- సీఎం రేవంత్‌రెడ్డి దంపతులకు పూర్ణకుంభంతో స్వాగత సత్కారాలు



**యాదగిరిగుట్ట-నవభూమిబ్యూరో:** శ్రీ లక్ష్మీ నర సింహస్వామి క్షేత్రంలోని ప్రధాన ఆలయ స్వర్ణ విమాన గోపురం ప్రారంభోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 11: 36 గంటలకు మూల నక్షత్ర యుక్త వృషభ లగ్న పుష్కరాంశ సుముహూర్తాన సీఎం రేవంత్ రెడ్డి యాదగిరిగుట్ట లక్ష్మీనరసిం హ స్వామి వారి స్వర్ణ దివ్య విమాన గోపురాన్ని స్వామి వారికి అంకితం చేశారు.
శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలోని ప్రధాన ఆలయ స్వర్ణ విమాన గోపురం ప్రారంభోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 11: 36 గంటలకు మూల నక్షత్రయుక్త వృషభ లగ్న పుష్కరాంశ సుముహూర్తాన సీఎం రేవంత్ రెడ్డి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వారి స్వర్ణ దివ్య విమాన గోపురాన్ని స్వామి వారికి అంకితం చేశారు. దేశంలోనే అత్యంత ఎత్తయిన స్వర్ణ విమాన గోపురంగా రికార్డులకు ఎక్కింది. అంతకు ముందు యదాద్రి ఉత్తర రాజగోపురం నుండి ప్రధాన ఆలయంలోకి సీఎం రేవంత్ రెడ్డి దంప తులు ప్రవేశించారు. వారికి ఆలయ పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. తర్వాత స్వర్ణ దివ్య విమాన గోపురం వద్దకు సీఎం చేరుకున్నారు. ముఖ్యమంత్రి వెంట ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, కుంభం అనిల్ కుమార్ రెడ్డి,ఏట భాస్కరరావు తదితరులు ఉన్నారు.

## నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు




- అసెంబ్లీకి మాజీ సీఎం జగన్ రెడ్డి..
- సభ్యత్వాన్ని కాపాడుకోవడానికేనని అధికార పక్షం సంచలన వ్యాఖ్యలు
- గవర్నర్ ప్రసంగం తర్వాత సభ వాయిదా

2



**అమరావతి-నవభూమిబ్యూరో:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 24వ తేదీ నుంచి అంటే.. సోమవారం నుంచి ఈ సమావేశాలు ప్రారంభమవుతోన్నాయి. అయితే ఈ అసెంబ్లీ సమావేశాలకు వెళ్లాలని వైసీపీ నిర్ణయించింది. ఎమ్మెల్యే జగన్.. తన సభ్యులతో కలిసి సభకు వస్తోంది ప్రజా సమస్యలపై చర్చకు కాదు.. సభలో సభ్యత్వాన్ని కాపాడుకోవడానికి అంటూ అధికార పక్షం ఎద్దేవా చేస్తోంది.
60 రోజులు వరుస పని దినాల్లో అసెంబ్లీకి హాజరు కాకుంటే.. సభలో సభ్యత్వాన్ని రద్దు చేసే హక్కు ఉందంటూ నిబంధనలను అసెంబ్లీ స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఇప్పటికే ప్రకటించారు. ఆ క్రమంలో ఆర్టికల్ 101 క్లాజ్ 4 ప్రకారం వరుసగా 60 రోజులు సభకు రాకుంటే.. సభ్యత్వం రద్దు చేయొచ్చుంటూ నిబంధన చెబుతోందని వారు స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.
మరోవైపు అధికార టీడీపీ సభ్యులు అందరూ ఈసారి నేరుగా సభకు వచ్చే అవకాశముందని సమాచారం. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో ఈ సారి వెంకటపాలెంలోని వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ సీఎం ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ అధినేత, సీఎం చంద్రబాబుతోపాటు ఆ పార్టీ ఎమ్మెల్యేలంతా నివాళులు అర్పించే కార్యక్రమంపై తీవ్ర సంగ్దిగ్దత నెలకొంది. అయితే సోమవారం ఉదయం 9.45 గంటలకు సీఎం చంద్రబాబు

## 8 మంది ఐపీఎస్‌ల బదిలీ

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి
- గవర్నర్ ఏడీసీగా శ్రీకాంత్,జేసీగా జోయల్‌డేవిస్

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** 8 మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గవర్నర్ ఏడీసీగా శ్రీకాంత్, హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్‌గా జోయల్ డేవిస్, సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్‌గా గజారావు భూపాల్, హైదరాబాద్ క్రైమ్స్ అదనపు కమిషనర్‌గా విశ్వప్రసాద్, సీఐడీ ఎస్పీగా నవీన్ కుమార్, సీఐడీ ఏడీసీగా రామ్ రెడ్డి, ఇంటెలిజెన్స్ ఎస్పీగా శ్రీధర్, హైదరాబాద్ ఎస్బీ డీసీపీగా చైతన్య కుమార్‌లను నియమించారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

## ఇక కిక్కే కిక్కు.. తెలంగాణలో కొత్త లిక్కర్ బ్రాండ్లకు ఆహ్వానం

2

## పాకిస్తాన్‌పై టీమిండియా ఘన విజయం

- ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన కోహ్లీ
- కింగ్ కోహ్లీ మళ్లీ అద్భుతమైన సెంచరీ
- మెగాస్టార్ చిరంజీవి సందడి

2




**దుబాయ్-నవభూమిబ్యూరో:** దుబాయ్ వేదికగా జరిగిన అత్యంత ఆసక్తికర మ్యాచ్‌లో పాకిస్తాన్‌పై టీమిండియా ఘన విజయం సాధించింది. ఏకంగా 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. చాలా రోజుల తర్వాత కింగ్ కోహ్లీ మళ్లీ ముందుండి ఛేజింగ్‌ను విజయవంతంగా పూర్తి చేశాడు. అద్భుతమైన సెంచరీ సాధించాడు.
దుబాయ్ వేదికగా జరిగిన అత్యంత ఆసక్తికర మ్యాచ్‌లో పాకిస్తాన్‌పై టీమిండియా ఘన విజయం సాధించింది. ఆరు వికెట్ల తేడాతో పాకిస్తాన్‌ను ఓడించింది. చాలా రోజుల తర్వాత కింగ్ కోహ్లీ (100) మళ్లీ ముందుండి ఛేజింగ్‌ను విజయవంతంగా పూర్తి చేశాడు. తన కెరీర్‌లో 51వ సెంచరీ సాధించాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచాడు. అతడికి శ్రేయస్ అయ్యర్ (56), శుభ్‌మన్ గిల్ (46) సహకరించారు. రోహిత్ శర్మ (20), హార్దిక్ (8) త్వరగానే అవుట్ అయ్యారు. కోహ్లీ, గిల్, శ్రేయస్ పిచ్‌ను పూర్తిగా అర్థం చేసుకుని పరుగులు రాబట్టారు.కోహ్లీ, శ్రేయస్ పాక్ బౌలర్లకు ఎలాంటి అవకాశమూ ఇవ్వకుండా చక్కటి సమన్వయంతో ఆడారు. ముఖ్యంగా

## అమరావతి నిర్మాణంలో కీలక పరిణామం

- ప్రపంచ బ్యాంకు రుణం మంజూరు..
- మార్చి 15 నుంచి పనులు ప్రారంభించాలని ప్రభుత్వం ఆలోచన
- గతంలో స్థలాలు కేటాయించిన కేంద్ర సంస్థలకు రెన్యువల్స్
- ఓఆర్‌ఆర్ నిర్మాణంలో ప్రభుత్వం భూ సేకరణకు సిద్ధం

2




**అమరావతి-నవభూమిబ్యూరో:** అమరావతి నిర్మాణంలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే ప్రపంచ బ్యాంకు రుణం మంజూరు చేసింది. ఇటు టెండర్ల ప్రక్రియ తుది దశలో ఉంది. మార్చి 15 నుంచి పనులు ప్రారంభించాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ఇదే సమయంలో గతంలో స్థలాలు కేటాయించిన కేంద్ర సంస్థలకు వాటిని రెన్యువల్ చేస్తున్నారు. ఇక.. రాజధానికి కీలకంగా భావిస్తున్న ఓఆర్ఆర్ నిర్మాణంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ నిర్ణయం అమరావతి ఓఆర్ఆర్ నిర్మాణంలో ప్రభుత్వం భూ సేకరణకు సిద్ధమైంది. ఇందు కోసం ప్రత్యేకంగా అధికారులను నియమించిం ది. అమరావతి నుంచి ఓఆర్ఆర్ వెళ్లే అయిదు జిల్లాల్లో భూసేకరణ కు సంబంధించి ప్రభుత్వం వీరికి బాధ్యతలు అప్పగించింది. 23 మండలాలు, 121 గ్రామాల మీదుగా 189.9 కిలోమీటర్ల మేర ఈ రింగ్‌రోడ్డు నిర్మాణం కానుంది.ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, గుంటూరు, ఏలూరు జిల్లాల్లోని 23 మండలాలు, 121 గ్రామాల మీదుగా అమరావతి ఓఆర్ఆర్ వెళు తోంది. దీని మొత్తం పొడవు 189.9 కిలోమీటర్లుగా అధికారులు ఖరారు చేసారు. మూడు ఎలైన్ మెంట్లు ఎలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ ఇటీవల 189.9 కిలోమీటర్ల ఓఆర్ఆర్‌కు ఆమోదం తెలిపింది. కాగా, విజయవాడ తూర్పు బైపాస్ అవసరం లేదని తేల్చేసింది. దానికి ప్రత్యామ్నాయంగా రెండు లింక్ రోడ్లను నిర్మించేందుకు అవకాశం కల్పించింది. చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారిలో విజ యవాడ బైపాస్ మొదలయ్యే కాజ నుంచి తెనాలి సమీపంలోని నందివెలుగు వరకు 17 కిలోమీటర్ల మేర ఆరు వరుసల అనుసంధాన రహదారిని నిర్మించేందుకు ఆమోదం లభించింది. ఇప్పటికే ఎన్హెచ్ఏఐ ఈ ప్రతిపాదనలో భాగంగా 3ఎలైన్‌మెంట్లను ప్రభుత్వానికి సమర్పించింది. ప్రత్యేక అధికారులు ఓఆర్ఆర్ ఎలైన్‌మెంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపాక, వాటిని కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఆమోదం కోసం ప్రతిపాదించనున్నారు. అక్కడ ఆమోదం రాగానే ఓఆర్ఆర్ భూసేకరణకు సర్వే నంబర్ల వారీగా నోటిఫికేషన్ జారీచేస్తారు. అభ్యంతరాలన్నీ పరిష్కారమయ్యాక 3డీ నోటిఫికేషన్ జారీ చేస్తారు. అంటే ఆయా సర్వే

# రాజలింగమూర్తి హత్య కేసును ఛేదించిన పోలీసులు



**హైదరాబాద్-నవభూమి:** సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి హత్యకు ముందే ప్లాన్ చేసిన నిందితులు.. వరంగల్‌లోని కాశీబుగ్గలో కత్తులు, రాడ్లు కొనుగోలు చేసినట్లు భూపాలపల్లి పోలీసులు ఆధారాలు సేకరించారు. నిందితుల నుంచి 2 కత్తులు, 2 రాడ్లు, 5 బైక్‌లు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నలుగురు కలిసి హత్య చేయగా.. ఇద్దరు రెక్కీ నిర్వహించారు. మరో ముగ్గురు.. నిందితులకు సహాయం చేసినట్లు పోలీసులు తేల్చారు. రాజలింగమూర్తి హత్య కేసుకు సంబంధించి భూపాలపల్లి ఎస్పీ కిరణ్ కీలక విషయాలు వెల్లడించారు. రాజలింగమూర్తి హత్యకు భూవివాదమే కారణమని తెలిపారు. ఎకరం భూమి విషయంలో సంజీవ్, రాజలింగమూర్తి మధ్య కొన్నాళ్లుగా భూవివాదం కొనసాగుతుందని చెప్పారు. ప్లాన్ ప్రకారం కంట్లో కారం కొట్టి కత్తులతో పొడిచి రాజలింగమూర్తిని హత్య చేశారన్నారు ఎస్పీ కిరణ్. రాజలింగమూర్తి హత్యకు కొత్త హరిబాబు అనే వ్యక్తి ప్లాన్ చేసినట్లు గుర్తించామన్నారు ఎస్పీ కిరణ్. ప్రధాన నిందితుడు సంజీవ్‌కు హరిబాబు సపోర్ట్ చేశారని.. పరారీలో ఉన్న ఆయన కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. రాజలింగమూర్తి మర్డర్‌కు సంబంధించి ఇతర కోణాల్లోనూ దర్యాప్తు కొనసాగుతుందన్నారు ఎస్పీ కిరణ్. ఈ నెల 19న రాత్రి సుమారు 7 గంటల సమయంలో రాజలింగమూర్తి హత్యకు గురైన విషయం తెలిసిందే.



# అంగన్‌వాడీల్లో 14,236 పోస్టులతో కొలువుల జాతర..! ఏ జిల్లాలో ఎన్ని పోస్టులున్నాయంటే..




**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో భారీగా అంగన్‌వాడీ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయబోతోంది. మొత్తం 14,236 అంగన్‌వాడీ పోస్టులతో బిగ్ జాబ్ ఫెస్టివల్ సెలబ్రేట్ చేయబోతోంది. మొత్తం పోస్టుల్లో అంగన్‌వాడీ టీచర్ పోస్టులు 6,399, హెల్పర్ పోస్టులు 7,837 ఉన్నాయి. ఈ పోస్టుల భర్తీకి అనుమతి ఇస్తూ రాష్ట్ర మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క శనివారం సంతకం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల కోడ్ ముగియగానే జిల్లాస్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేయనున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత ఇంత భారీ సంఖ్యలో ఉద్యోగాలు భర్తీ చేయడం ఇదే తొలిసారి. రాష్ట్రంలని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించేందుకు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వప్రాథమిక విద్యను అందించేందుకు వీలుగా ఈ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేస్తుంది.కాగా రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 35,700 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో కేంద్రంలో ఒక టీచర్, హెల్పర్ తప్పనిసరి. గతంలో ఈ పోస్టులకు ఎంపికైన వారిలో పలువురు రాజీనామాలు చేయడం, ప్రస్తుతం ఉన్నవారిలో కొందరికీ సూపర్‌వైజర్లుగా పదోన్నతులు రావడంతో సిబ్బంది కొరత ఏర్పడింది. మరోవైపు దాదాపు 3,914 మంది 65 ఏళ్ల వయసు నిండి పదవీ విరమణ చేయనున్నారు. ఈ పోస్టులనూ నోటిఫికేషన్లో కలిపి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. గతంలో అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు పదో తరగతి పాసై ఉంటే సరిపోయేది. కానీ కేంద్రం జారీ చేసిన నూతన మార్గదర్శకాల మేరకు టీచర్‌తో పాటు హెల్పర్లకు కనీసం ఇంటర్ పాసై ఉండాలన్న నిబంధన పెట్టారు. అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి వయోపరిమితి 18 నుంచి 35 ఏళ్లు నిండిన వివాహిత మహిళలు మాత్రమే అర్హులు. అలాగే కేంద్రప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీలో 50 శాతం సహాయకులకు కేటాయించాలి. అయితే ప్రస్తుతం పనిచేస్తున్న సహాయకుల్లో ఇంటర్మీడియట్ పాసైన హెల్పర్లు 567 మంది మాత్రమే ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. వారందరికీ పదోన్నతులు లభించే అవకాశాలున్నాయి.

# టీచర్ మందలించాడనీ.. స్కూల్ బిల్డింగ్‌పై నుంచి దూకిన 8వ తరగతి విద్యార్థి!



**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్‌లో అలాంటి సంఘటనే జరిగింది. ఓ స్కూల్లో టీచర్ 8వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని టీచర్ చెంపపై కొట్టడంతో.. అదే స్కూల్ భవనంపై నుంచి కిందకి దూకి విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర కలకలం సృష్టించింది. అసలేం జరిగిందంటే.. హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లోని ద్వారకా నగర్‌కు చెందిన ధర్మారెడ్డి, సంగీత దంపతుల రెండవ కుమారుడు సంగారెడ్డి (14). ఉప్పల్‌లోని న్యూ భారత్ నగర్ లోని సాగర్ గ్రామర్ స్కూల్‌లో సంగారెడ్డి 8వ తరగతి చదువుతున్నాడు. చదువులో ఎంతో చురుకుగా ఉండే సంగారెడ్డిని శనివారం (ఫిబ్రవరి 22) ఓ విషయమై ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ క్లాస్‌లోని అందరి ముందు చెంపపై కొట్టాడు. దీంతో అవమానంగా భావించిన సంగారెడ్డి ఉపాధ్యాయుడి అనుమతి తీసుకుని టాయిలెట్‌కి వెళ్లాడు. అయితే సంగారెడ్డి నేరుగా స్కూల్ భవనం నాలుగో అంతస్తుకు చేరుకుని అక్కడి నుంచి కిందికి దూకేశాడు. ఈ సంఘటన ఉదయం 9.30 గంటల ప్రాంతంలో జరిగింది. తీవ్ర గాయాలపాలైన బాలుడిని హుటాహుటీన సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడి వైద్యులు బాలుడిని పరీక్షించి, అప్పటికే చనిపోయినట్లు ధృవీకరించారు. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది.విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు, విద్యార్థి సంఘాలు పాఠశాల వద్దకు చేరుకుని నిరసనకు దిగాయి. సంగారెడ్డి మరణానికి పాఠశాల సిబ్బంది, యాజమాన్యమే కారణమని వారు ఆరోపించారు. శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని గ్రహించిన పాఠశాల యాజమాన్యం విద్యార్థులను ఇంటికి పంపించారు. ఉప్పల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, నిరసనకారులను శాంతింపజేసి, ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయించారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం పరీక్ష కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. పీఈటీ టీచర్ బాలుడిని చెంపదెబ్బ కొట్టాడని కొంతమంది విద్యార్థులు మీడియాకు తెలిపారు. అంతేకాకుండా తాను చనిపోతున్నానని తల్లిదండ్రులకు రాసిన సూసైడ్ నోట్ విద్యార్థి నోట్‌బుక్‌లో లభ్యమైంది. దీంతో సదరు పీఈటీ టీచర్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు, తదుపరి దర్యాప్తు ప్రారంభించారు.

# మూడో తరగతి విద్యార్థిపై ఉపాధ్యాయుడి దాష్టీకం

**హైదరాబాద్-నవభూమి:** ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థిపై ఉపాధ్యాయుడు దాష్టీకానికి పాల్పడ్డాడు. విద్యార్థిపై సదరు ఉపాధ్యాయుడు విచక్షణరహితంగా దాడి చేశాడు. దీంతో విద్యార్థి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ దారుణమైన ఘటన మియాపూర్‌లోని మదీనగూడ ప్రభుత్వ పాఠశాలలో చోటు చేసుకుంది. విద్యార్థి ముఖంతోపాటు శరీరంపై తగిలిన గాయాలు కమిలిపోయాయి. దీంతో ఉపాధ్యాయుడిపై ప్రధానోపాధ్యాయుడికి విద్యార్థి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు.అలాగే తమ కుమారుడిపై దాడి చేసిన ఉపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో అతడి తల్లిదండ్రులు పిర్యాదు చేశారు. అయితే గతంలో సైతం విద్యార్థులపై సదరు ఉపాధ్యాయుడు ఇదే రీతిలో ఇష్టారాజ్యంగా కర్రతో దాడి చేసినట్లు ఆరోపణలు వినిపించాయి.మదీనగూడలోని ప్రభుత్వ పాఠశాలలో దేవీ ప్రసాద్ అనే విద్యార్థి 3వ తరగతి చదువుతోన్నాడు. శనివారం స్కూల్‌కు వచ్చిన విద్యార్థి లెక్కలు చేస్తున్నాడు. ఆ క్రమంలో లెక్క తప్పు చేసినందుకు అతడిపై ఉపాధ్యాయుడు తీవ్రంగా దాడి చేశాడు. ఒక తప్పునకు పది దెబ్బలు అన్నట్లుగా ఉపాధ్యాయుడు విద్యార్థి ముఖం, శరీరంపై విచక్షణా రహితంగా కొట్టాడు. దీంతో సదరు విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు.ఈ దెబ్బలు తాళలేక.. ఆ విద్యార్థి సమీపంలోని తన ఇంటికి వెళ్లాడు. ఈ దాడి విషయాన్ని అతడి తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో వారు ఆగమేఘాల మీద పాఠశాలకు చేరుకొని.. ఉపాధ్యాయుడిని నిలదీశారు. అనంతరం అతడిపై పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడికి ఫిర్యాదు చేశారు.

# ఇక కిక్కే కిక్కు.. తెలంగాణలో కొత్త లిక్కర్ బ్రాండ్లకు ఆహ్వానం



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. మద్యం బ్రాండ్ల కొత్త విధానానికి ఆమోదం తెలిపింది. ఈ మేరకు తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీబీసీఎల్) కొత్త కంపెనీల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. దీనికోసం రేవంత్ ప్రభుత్వం.. అదేశించిన రీతిలో కొత్త కంపెనీల మద్యం బ్రాండ్లకు అనుమతులు ఇవ్వనున్నారు. రాష్ట్రంలో రిజిస్టర్ కాని కొత్త సప్లయర్స్ నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో లేని విదేశీ, దేశీయ లిక్కర్, బీర్ కంపెనీలకు అవకాశం లభించనుంది.. అయితే.. అనుమతులకు ముందు నాణ్యత, ప్రమాణాలపై సెల్ఫ్ సర్టిఫికేషన్ తీసుకోనుంది. ఆయా కంపెనీలు.. ఇతర రాష్ట్రాల్లో ఎలాంటి ఆరోపణలు లేవని తెలుపుతూ దరఖాస్తుతో పాటు సెల్ఫ్ సర్టిఫికేషన్ జతపరచాలని టీజీబీసీఎల్ ప్రకటనలో తెలిపింది.అయితే.. నాణ్యత ప్రమాణాలను పరిశీలించిన తర్వాతే కొత్త కంపెనీలకు అనుమతులు ఇవ్వనున్నారు. ఇదిలాఉంటే.. గతంలో తెలంగాణలో పలు కొత్త కంపెనీలు తమ ఉత్పత్తులను అమ్మకోవడానికి టీజీ బీసీఎల్‌అనుమతులు ఇవ్వడం జరిగింది. అనుమతులు పొందిన సోమ్ డిస్టిలరీస్ పై పలు ఆరోపణలు రావడంతో ఈ కొత్త విధానానికి ప్రభుత్వం నాంది పలికింది. సోమ్ డిస్టిలరీస్ పై వచ్చిన ఆరోపణలతో రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిన కొత్త బ్రాండ్లను నిలిపివేసిన విషయం తెలిసిందే. కొత్తగా అనుమతులను ఆహ్వానించే ముందు బహిరంగ ప్రకటనలు ఇవ్వాలని ప్రభుత్వం టీజీబీసీఎల్ ను ఆదేశించింది.ఈ మేరకు బెవరీస్ కార్పోరేషన్ తెలంగాణలో టీజీబీసీఎల్ నందు రిజిస్టర్ కాని కొత్త సప్లయిర్స్ కు అనుమతులు ఇవ్వడానికి ప్రకటన జారీ చేసింది. కొత్త కంపెనీల నుంచి వచ్చిన దరఖాస్తులను పది రోజుల పాటు ఆన్‌లైన్‌లో పెట్టాలని నిర్ణయం తీసుకుంది. దరఖాస్తులపై వచ్చె అభ్యంతరాలపై విచారణ జరిపి అనుమతులపై నిర్ణయం తీసుకోనున్నారు. టీజీబీసీఎల్ లో రిజిస్టర్ కాబడి, సరఫరా చేస్తున్న సప్లయిర్స్ ప్రస్తుతం ఉన్న పద్దతుల్లోనే కొత్త బ్రాండ్లకు దరఖాస్తు చేసుకోవచ్చు.. తెలంగాణ బెవరీస్ కార్పోరేషన్ ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ.. కొత్త మద్యం బ్రాండ్లపై నిర్ణయం తీసుకోనున్నారు.

# మారిపోనున్న హైదరాబాద్ రూపురేఖలు.. కార్యరూపం దాల్చుతున్న ఫ్యూచర్ సిటీ మెట్రో..!



**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ వరుసలో నాలుగో సిటీగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికత దిశగా అడుగులు పడుతున్నాయి. ఇది కాలుష్యరహిత గ్రీన్ సిటీ గా ప్రపంచంలోనే అద్భుత నగరాల సరసన చేరాలన్నది ఆయన సంకల్పం. ఇందులో భాగంగా హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో రైల్ సంస్థ హెచ్ఎండీఏ, టీజీఐఐసీ లతో కలిసి మెట్రో రైల్ విస్తరణ ప్రణాళిక సిద్ధం చేస్తోంది.ఫ్యూచర్ సిటీకి అనువుగా గ్రీన్ కారిడార్లను అభివృద్ధి చేసి, అంతర్జాతీయ విమానాశ్రయం నుండి త్వరితగతిన సులభంగా ఫ్యూచర్ సిటీకి చేరుకునే ప్రణాళిక ఉండాలన్నది ముఖ్యమంత్రి అభిమతం. ఈ ఆలోచనలు వాస్తవ రూపం దాల్చేందుకు కసరత్తు చేస్తున్నామని, దాదాపు పదిహేను వేల ఎకరాలలో విస్తరించనున్న భవిష్యనగరిని కాలుష్యరహిత నగరంగా రూపొందించడంలో, దానికి అంతర్జాతీయ స్థాయి ప్రయాణ సౌకర్యాలు కల్పించడంలో మెట్రో రైలుతో కూడిన ఈ గ్రీన్ కారిడార్ ప్రముఖ పాత్ర వహిస్తుందని హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.మెట్రో కారిడార్ సర్వే పనులను మెట్రో ఎండీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎయిర్ పోర్ట్ నుండి మీర్ ఖాన్ పేట్ లో నిర్మాణంలో ఉన్న స్కిల్ యూనివర్సిటీ వరకు మెట్రో కారిడార్ డీపీఆర్ తయారీకి అనేక సూచనలు చేశారు. కొంగర కలాన్ దాటిన తరువాత ప్రస్తుతం రోడ్ లేకపోవడం వల్ల కాలినడకన కొండలు, గుట్టలు దాటుకుని ఆయన ఈ క్షేత్ర పర్యటన జరిపారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుండి ఫ్యూచర్ సిటీకి వెళ్లే మెట్రో మార్గం దాదాపు 40 కిలోమీటర్లు ఉంటుంది. ఎయిర్ పోర్ట్ టెర్మినల్ నుండి మొదలై, కొత్తగా ఏర్పరచబోయే మెట్రో రైల్ డిపో పక్క నుండి ఎయిర్ పోర్ట్ సరిహద్దు గోడ వెంబడి ఎలివేటెడ్ మార్గంగా మన్సాన్ పల్లి రోడ్డు గుండా 5 కిలోమీటర్లు ముందుకు సాగాక పెద్ద గొల్కొండ ఓఆర్ఆర్ ఎగ్జిట్ కి చేరుతుందని మెట్రో ఎండీ తెలిపారు. ముఖ్యమంత్రి సూచనలకు అనుగుణంగా బహదూర్ గుడా లో ఉన్న దాదాపు 1000 నుండి 1500 ఎకరాల ప్రభుత్వ భూమిని ఒక అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు తోడ్పడేలా బహదూర్ గుడా, పెద్ద గోల్కొండలలో రెండు మెట్రో స్టేషన్లను అత్యంత ఆకర్షణీయంగా అభివృద్ధి చేస్తామని ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. పెద్ద గోల్కొండ ఓఆర్ఆర్ ఎగ్జిట్ నుండి తుక్కుగూడ ఎగ్జిట్ మీదుగా రావిర్యాల్ ఎగ్జిట్ వరకు దాదాపు 14 కిలోమీటర్ల పొడవున ఈ మెట్రో మార్గాన్ని ఎలివేటెడ్ మెట్రో మార్గంగా ఓఆర్ఆర్ లో మెట్రో రైల్ కి కేటాయించిన భాగంలో తక్కువ ఎత్తులో నిర్మిస్తామని ఆయన తెలిపారు.రావిర్యాల్ ఎగ్జిట్ నుండి ఇప్పటికే నిర్మాణంలో ఉన్న స్కిల్ యూనివర్సిటీ వరకు దాదాపు 22 కిలోమీటర్లు కొంగరకలాన్, లేమూర్, తిమ్మాపూర్, రాచలూరు, గుమ్మడవెల్లి, పంజగుడా, మీర్ ఖాన్ పేట్ వరకు హెచ్ఎండీఏ 100 మీటర్లు ( 328 అడుగులు) వెడల్పున నిర్మించే గ్రీన్ ఫీల్డ్ రహదారి మధ్యలో 22 మీటర్లు (72 అడుగులు) మెట్రో రైల్ కి కేటాయించింది. ఈ కేటాయించిన రోడ్ మధ్య స్థలంలో మెట్రో రైల్ కారిడార్ 'ఎట్ గ్రేడ్' (భూ తలంపై) మెట్రోగా అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. ఈ విశాల మైన రోడ్ మధ్య లో అదే లెవెల్ లో మెట్రో రైల్ ఉంటే దానికి ఇరువైపులా మూడు లేన్ల ప్రధాన రహదారి ఉంటుందని, మెట్రోను, ప్రధాన రహదారిని విభజిస్తూ ఆకర్షణీయమైన చెట్లను, గ్రీనరీని అభివృద్ధి చేస్తామని, ప్రధాన రహదారి కి ఇరువైపులా మరల రెండు సర్వీస్ రోడ్లను ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు.తన గత అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ, డాక్టర్ వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఓఆర్ఆర్ నిర్మిస్తున్నప్పుడు ఓఆర్ఆర్ లో అంతర్భాగంగా భవిష్యత్ లో నిర్మించబోయే మెట్రో కి తగినంత స్థలాన్ని కేటాయించాలన్న అప్పటి తన ప్రతిపాదనను డాక్టర్ వైఎస్ఆర్ అంగీకరించి ఓఆర్ఆర్ లో 20 మీటర్లు మెట్రోకి కేటాయించడం జరిగిందని మెట్రో ఎండీ తెలిపారు. అప్పట్లో అనేక మంది ఓఆర్ఆర్, మెట్రో వంటి బృహత్ ప్రణాళికలు కేవలం కాగితాలకే పరిమితమవుతాయని, అవి ఆచరణ సాధ్యం కాదని అపహాస్యం చేసినా, ఈ రోజు ఓఆర్ఆర్, మెట్రో రెండూ కూడా కార్యరూపం దాల్చాయని అయన చెప్పారు. వీటివల్ల హైదరాబాద్ ఒక అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చెంది, ప్రపంచంలోని ప్రముఖ కంపెనీలను, పెట్టుబడులను ఆకర్షిస్తోందనిబీ ప్రస్తుత ప్రభుత్వం పెద్ద ఎత్తున అమలు చేస్తున్న మౌలిక వసతుల ప్రాజెక్టులతో హైద్రాబాద్ కు మరింత ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మెట్రో ఎండీ అన్నారు.ఏవిధంగా అయితే ప్రపంచంలో ప్రప్రథమంగా 22 వేల కోట్ల రూపాయలతో మెట్రో మొదటి దశను 69 కిలోమీటర్ల మేర పీపీపీ పద్ధతిన విజయవంతంగా పూర్తి చేశామో, అదే విధంగా ఈ ప్రణాళికలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికతతో కార్యరూపం దాల్చేలా హెచ్ఎండీఏ, టీజీఐఐసి, మెట్రో రైల్ సంస్థలు సంయుక్తంగా కృషి చేస్తాయని ఆయన అన్నారు. నార్త్ సిటీ లోని మేడ్చల్, శామీర్ పేట్ కారిడార్లతో పాటు, ఈ ఫ్యూచర్ సిటీ మెట్రో కారిడార్ డీపీఆర్ కూడా ఈ మార్చి నెలాఖరుకు పూర్తి చేసి, రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో కేంద్ర ప్రభుత్వానికి వీటిని సమర్పిస్తామని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.

# షేర్ మార్కెట్లో అల్లకల్లోలం

(1వపేజీ తరువాయి)పరిస్థితికి చాల అంశాలు కారణమవుతున్నాయి. ముఖ్యం గా డోనాల్డ్ ట్రంప్ సుంకాల విధానాలు భారత మార్కెట్‌ను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఇది కాకుండా, చాలా కంపెనీల త్రైమాసిక ఫలితాలు అంచనా లకు అనుగుణంగా లేవు. ఇది కూడా షేర్ మార్కెట్‌ను ఒత్తిడిలోకి నెట్టింది. అంతేకాకుండా పెరుగుతున్న ద్రవ్యోల్బణ ఆందోళనలు, లండన్ క్యాష్ గోల్డ్ కాంట్రాక్ట్ డిఫాల్ట్ భయం, ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించబోమని సూచించ డం, విదేశీ పెట్టుబడిదారులకు చైనా పట్ల ఉన్న ప్రేమ కూడా స్టాక్ మార్కెట్లో సునామికి ప్రధాన కారణాలు. వార్తల సుడిగుండంలో షేర్ మార్కెట్ పై ఇలాంటి వార్తలు ఒకదాని తర్వాత ఒకటి నిరంతరం వస్తున్నాయి, దీనివల్ల స్టాక్ మార్కెట్ క్షీణత నుండి బయటపడటానికి అవకాశం లేదు. డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి బలహీనత గురించి రోజురోజుకూ వార్తలు వస్తూనే ఉన్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దాదాపు ప్రతిరోజూ సుంకాలకు సంబంధించి ఏదో ఒక ప్రకటన చేస్తూ ఉన్నారు. అలాగే విదేశీ పెట్టుబడిదారులు అమ్మకందారులుగా కొనసాగుతున్నారు. ఈ నెలలో ఇప్పటివరకు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారత ఈక్విటీ మార్కెట్ల నుండి రూ.23,710 కోట్లు ఉపసంహరిం చుకున్నారు. నిజానికి, భారతదేశం నుండి డబ్బును ఉపసంహరించు కుని చైనాలో పెట్టుబడి పెడుతున్నారు, కాబట్టి డోనాల్డ్ ట్రంప్ సుంకాల కారణంగా చైనా మార్కెట్‌కు ఎలాంటి నష్టం జరగలేదు. దీనికి విరుద్ధంగా భారతదేశ మార్కెట్ బలహీనపడుతోంది. పరిస్థితి ఎప్పుడు మెరుగుపడుతుంది? షేర్ మార్కెట్ ఎంతటి స్థితికి చేరుకుందంటే, దాని ఖచ్చితమైన అంచనా చాలా కష్టమైంది. ప్రధాని మోదీ అమెరికా పర్యటన తర్వాత మార్కెట్‌లో బూమ్ ఉంటుందని అంచనా వేశారు, కానీ ఆలా జరగలేదు. అయితే, రాబోయే కొద్ది రోజుల్లో షేర్ మార్కెట్ తిరిగి ట్రాక్‌లోకి రాగలదని నిపుణులు విశ్వసిస్తున్నారు. కానీ ప్రస్తుతానికి ఆలా స్పీడ్'తో నడిచే అవకాశం లేదు. అయితే భయాందోళనలో లేదా తొందరపడి షేర్స్ అమ్మకుండా ఉండాలని కూడా ఆయన అంటున్నారు.

### అమరావతి నిర్మాణంలో కీలక పరిణామం

(1వపేజీ తరువాయి)నంబర్లలో భూములు కేంద్రం అధీనంలోకి వెళ్లినట్లు గుర్తిస్తారు. పరిహారం చెల్లింపు.. భూముల బదలాయింపు తరువాత పూర్తి స్థాయిలో ఈ భూములు ఓఆర్ఆర్ నిర్మాణం కోసి వినియోగించనున్నారు.

# ఉగాండా జైల్లో భారత బిలియనీర్ కూతురి కష్టాలు

(1వపేజీ తరువాయి)భావించిన మాజీ ఉద్యోగి కొన్ని రోజుల తర్వాత టాంజానియాలో సజీవంగా ప్రత్యక్షం కావడంతో ఈ కేసు వీగిపోయింది. ఈ వ్యవహారంపై వసుంధర తాజాగా స్పందించారు. తనను అన్యాయంగా జైల్లో ఉంచారని, తన విషయంలో మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందని ఆమె ఆక్రోశించారు. "జైల్లో నేను నరకాన్ని అనుభవించాను. తొలుత అరెస్ట్ చేసి ఐదు రోజుల పాటు నిర్బంధించారు. రెండు వారాల పాటు జైల్లో ఉండాల్సి వచ్చింది. స్నానం చేసేందుకు కూడా అవకాశం ఇవ్వలేదు. ఆహారం, నీళ్లు ఇవ్వకుండా వేధించారు. జైల్లో నా కనీస అవసరాలు తీర్చేందుకు మా అమ్మానాన్న పోలీసు అధికారులకు లంచం ఇవ్వాల్సి వచ్చింది. ఓ దశలో వాష్ రూమ్ కు కూడా వెళ్లనివ్వలేదు. ఎందుకు పంపించరు అని అడిగితే.. నీకు ఇదే శిక్ష అన్నారు. ఆ రోజు తప్పుడు ఆరోపణలతో మా ఇంట్లో సోదాలు చేశారు. వారెంట్ ఉందా అని అడిగితే... ఇది మా ఉగాండా.... మేం ఏమైనా చేస్తాం... నువ్వు ఉన్నదేమీ యూరప్ కాదు అని దురుసుగా జవాబిచ్చారు. ఓ పురుష పోలీసాఫీసర్ ఎంతో మొరటుగా ప్రవర్తించాడు. నన్ను పోలీస్ వ్యాన్ లోకి తోసేశాడు. పోలీస్ బాండ్ కింద రూ.26 లక్షలు కట్టించుకున్నారు... నా పాస్ పోర్టును లాగేసుకున్నారు. క్రిమినల్ న్యాయవాది లేకుండానే బలవంతంగా వాంగ్మూలం తీసుకున్నారు. బెయిల్ వచ్చినప్పటికీ 72 గంటల పాటు అక్రమంగా నిర్బంధించారు. మాజీ ఉద్యోగి ముఖేశ్ మెనారియా బతికే ఉన్నాడని తెలిసిన తర్వాత కూడా నాపై కేసును తొలగించేందుకు ఉగాండా పోలీసులు ససేమిరా అన్నారు. అతడ్ని కిడ్నాప్ చేసి, హత్య చేసేందుకు ప్రయత్నించింది అంటూ కేసును మార్చేందుకు యత్నించారు. మొదట నన్ను సాధారణ నేరస్తులు ఉండే జైల్లో ఉంచారు. ఆ తర్వాత హత్య కేసుల్లో శిక్షలు అనుభవిస్తున్నవారు, మానవ అక్రమరవాణాదారులు ఉండే నకసొంగోలా జైలుకు తరలించారు. ఆ జైల్లో ప్రాణభయంతో రెండు వారాల పాటు నరకం చవిచూశాను. న్యాయపోరాటాల అనంతరం అక్టోబరు 21న కోర్టు నాకు బెయిల్ మంజూరు చేసింది. అయినప్పటికీ డిసెంబరు 10వ తేదీ నాడు నా పాస్ పోర్టు అప్పగించారు. చివరికి డిసెంబరు 19వ తేదీన నాపై కేసును కొట్టివేశారు. ఉగండా పోలీసు అధికారులు డబ్బు కోసం ఒత్తిడి చేశారు. మెనారియా బతికున్నాడని తెలిసి కూడా అవినీతికి పాల్పడ్డారు" అని వసుంధర ఓస్వాల్ వివరించారు.

# రేవంత్‌కు రాహుల్ ఫోన్

(1వపేజీ తరువాయి)అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఫోన్ చేసి ఆరా తీశారు. ఇద్దరు నేతలు దాదాపు 20 నిమిషాలపాటు మాట్లాడుకున్నారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ వద్ద ప్రమాదం జరిగిన వెంటనే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఘటనా స్థలానికి వెళ్లారని రాహుల్ కు సీఎం రేవంత్ తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ టీంలు వెళ్లాయని చెప్పారు. క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఎల్బీసీ ఘటనపై ప్రభుత్వ చర్యలను రాహుల్ అభినందించారు. సొరంగంలో చిక్కుకున్నవారిని సురక్షితంగా బయటకు తీసేందుకు అన్ని చర్యలూ చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డికి రాహుల్ సూచించారు. ఇది ఇలావుండగా, ప్రధాని నరేంద్ర మోడీ శనివారం సీఎం రేవంత్ రెడ్డికి ఫోన్ చేసి ఎస్ఎల్బీసీ ప్రమాద ఘటనపై ఆరా తీసిన విషయం తెలిసిందే. ఘటనపై పూర్తి వివరాలను ప్రధానికి తెలిపారు సీఎం రేవంత్ రెడ్డి. ఎస్ఎల్బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న 8 మందిని కాపాడేందుకు సహాయక చర్యలు ప్రారంభించినట్లు ప్రధానికి తెలిపారు. ఎస్ఎల్బీసీ టన్నెల్‌లో చిక్కుకున్నవారిని కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వానికి అన్ని విధాలా సాయం చేస్తామని ప్రధాని నరేంద్ర మోడీ ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి హామీ ఇచ్చారు. సహాయక చర్యలను మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారని ప్రధానికి సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. సహాయక చర్యల కోసం వెంటనే ఎన్డీఆర్ఎఫ్ టీంను పంపిస్తామని సీఎంకు ప్రధాని మోడీ చెప్పారు. పూర్తిస్థాయి సహకారం అందించేందుకు కేంద్రప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రధాని నరేంద్ర హామీ ఇచ్చారు. కాగా, ఎస్ఎల్బీసీ ప్రమాద ఘటనా స్థలానికి శనివారం రాత్రి చేరుకున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి.

# రంగంలోకి హైడ్రా డీఆర్ఎఫ్ బృందాలు

(1వపేజీ తరువాయి)కృష్ణారావు చేరుకున్నారు. ఆదివారం ఉదయం బేగంపేట నుంచి దోమలపెంటకు హెలికాప్టర్‌లో బయలుదేరిన మంత్రులు ఘటనా స్థలానికి చేరుకున్నారు.
సహాయక చర్యలను పర్యవేక్షించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సహాయక చర్యలపై దిశానిర్దేశం చేశారు. కార్మికులను కాపాడేం దుకు టన్నెల్‌లో సహాయక చర్యలు శనివారం నుంచీ కొనసాగుతున్నాయని మంత్రి జూపల్లి వెల్లడించారు. రెస్క్యూ టీమ్‌లు రాత్రి నుంచి అక్కడే పని చేస్తున్నాయని చెప్పారు. సొరంగం లోపలికి ఆక్సిజన్ పంపుతున్నామని, వాటర్ తోడేసే పనులు నిరంతరం సాగుతున్నాయని మంత్రి వెల్లడించారు. ఇప్పటికే టన్నెల్ బోర్ మిషన్ (%డీవీ%) వరకూ సహాయక బృందాలు చేరుకున్నాయని, మరికొన్ని గంటల్లో కార్మికులను రక్షిస్తామని మంత్రి జూపల్లి ధీమా వ్యక్తం చేశారు.

# అత్యంత విషమంగా పోప్ ఫ్రాన్సిస్ ఆరోగ్యం

(1వపేజీ తరువాయి)2013లో నాటి పోప్ బెనెడిక్ట్-16 రాజీనామా చేయడంతో ఫ్రాన్సిస్ కేథలిక్ చర్చి అధిపతి అయ్యారు. కాగా దక్షిణార్ధ గోళం నుంచి పోప్ అయిన తొలి వ్యక్తిగా ఆయన రికార్డులకెక్కారు. ఈ సమయంలో ఏమీ చెప్పలేమని వాటికన్ విడుదల చేసిన ప్రకటన వెల్లడించింది.

# పాకిస్తాన్‌పై టీమిండియా ఘన విజయం

(1వపేజీ తరువాయి)కోహ్లీ చాలా రోజుల తర్వాత తన ట్రేడ్ మార్క్ షాట్లతో అలరించాడు. అద్భుతమైన కవర్‌డ్రైవ్‌లతో ఎంతో ఆత్మవిశ్వాసంగా ఆడాడు. పాక్ ఫీల్డర్లు క్యాచ్ వదిలేయడం కూడా కోహ్లీకి కలిసి వచ్చింది. మరోవైపు శ్రేయస్ కూడా సాధికారికంగా ఆడాడు. అనవసర షాట్లు కొట్టకుండా సమయోచితంగా రాణించాడు. 56 పరుగులు చేసి చివర్లో అవుట్ అయ్యాడు. పాక్ బౌలర్లు పెద్దగా ప్రభావం చూపించలేకపోయారు. దీంతో భారత్ 42.3 ఓవర్లలోనే పాకిస్తాన్ నిర్దేశించిన టార్గెట్‌ను చేరుకుంది.
అంతకు ముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్తాన్ 49.4 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ రిజ్వాన్ (77 బంతుల్లో 46), షకీల్ (76 బంతుల్లో 62) చెప్పుకోదగ్గ స్కోర్లు సాధించారు. కుల్‌దీప్ మూడు వికెట్లు పడగొట్టాడు. హార్దిక్ పాండ్యా రెండు వికెట్లు దక్కించుకున్నారు. హర్షిత్ రాణా, జడేజా, అక్షర్ పటేల్ ఒక్కో వికెట్ పడగొట్టారు. అక్షర్ పటేల్ అద్భుత ఫీల్డింగ్ చేసి ఇద్దరిని రనౌట్ చేశాడు. ఈ టోర్నీలో భారత్ తన తర్వాతి మ్యాచ్‌ను న్యూజిలాండ్‌తో మార్చి 2వ తేదీన ఆడబోతోంది.

# ఏపీ ఉద్యోగులకు శుభవార్త

(1వపేజీ తరువాయి)ప్రసాద్ పాల్గొని డైరీ ఆవిష్కరించారు. సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు రద్దు, ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేసినందుకు ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ ఉద్యోగులు కృతజ్ఞతలు తెపారు.ప్రజలతో మమేకమై మంచి సేవలు అందించి ప్రభుత్వానికి పేరు తీసుకురావాలని ఉద్యోగులను మంత్రి అనగాని సత్య ప్రసాద్ కోరారు. ఉద్యోగులను పోలీసులు అరెస్టు చేసే విషయంలో ఒక స్పష్టమైన విధానాన్ని తీసుకువస్తానని మంత్రి అనగాని సత్య ప్రసాద్ హామీ ఇచ్చారు. రిజిస్ట్రేషన్ శాఖలో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని, ఆ పోస్టులను సచివాలయ సిబ్బందితో భర్తీ చేయిస్తామని మంత్రి అనగాని సత్య ప్రసాద్ హామీ ఇచ్చారు.

# నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

(1వపేజీ తరువాయి)అసెంబ్లీకి చేరుకోనున్నారు.
ఉభయసభల నుద్దేశించి గవర్నర్‌కు గార్డ్ ఆఫ్ ఆనర్ అనంతరం సీఎం చంద్రబాబు ఆయనకు స్వయంగా స్వాగతం పలకనున్నారు. సీఎంతో పాటు శాసన మండలి చైర్మన్, అసెంబ్లీ స్పీకర్ సైతం గవర్నర్‌కు అసెంబ్లీ వద్ద స్వాగతం పలక నున్నారు. ఆ తర్వాత అసెంబ్లీలో ఉభయసభలనుద్దేశించి గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ సందేశం చదివి వినిపించనున్నారు. అనంతరం ఏపీ అసెంబ్లీ వాయిదా పడనుంది.
ఈ అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మార్చి 28వ తేదీన రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సభలో ప్రవేశపెట్టనున్నారు. అదే రోజు.. వ్యవసాయ బడ్జెట్‌ను ఆ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు ప్రవేశపెట్టనున్నారు. అందుకు తగిన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. ఇక అసలు అయితే రాష్ట్ర బడ్జెట్‌ను మార్చి 4వ తేదీన సభలో ప్రవేశపెట్టాలంటూ గతంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కానీ ఫిబ్రవరి 28వ తేదీనే సభలో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే అసెంబ్లీకి వస్తున్న వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్.. అసెంబ్లీ సమావేశాలు అన్నింటికి హాజరువుతారా? లేకుంటే.. తొలి రోజు వచ్చి.. అటెండెన్స్ వేయించుకొని వెళ్లి పోతారా? అనేది సందేహమనే ఓ చర్చ సైతం సాగుతోంది. ఎందుకంటే.. ప్రతిపక్ష హోదా నాయకుడిగా తనకు హోదా కేటాయిస్తానే అసెంబ్లీకి హాజరవుతానంటూ గతంలో ఏపీ అసెంబ్లీ స్పీకర్ సిహెచ్ అయ్యన్నపాత్రుడికి వైఎస్ జగన్ లేఖ రాశారు.

# 'వికసిత్ భారత్'లో కార్మికులది కీలకపాత్ర

**న్యూఢిల్లీ-నవభూమి:** అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో వికసిత్ భారత్ 2047 కలను సాకారం చేసేలా అన్ని రంగాల్లో దేశాన్ని ఆత్మ నిర్భర్ భారత్ దిశగా శరవేగంగా అడుగులు వేసేందుకు కార్మికుల భాగస్వామ్యం అవసరమన్నారు. శనివారం భువనేశ్వర్‌లో నిర్వహించిన భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) అనుబంధ పారిశ్రామిక విభాగానికి చెందిన పబ్లిక్ సెక్టార్ ఎంప్లాయిస్ నేషనల్ కాన్ఫెడరేషన్ సమావేశాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేసేందుకు కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన ఈ శ్రమ్ పోర్టల్‌లో ఇప్పటి వరకు 30 కోట్ల మంది కార్మికులు పేర్లు నమోదు చేసుకున్నారని చెప్పారు. 70 ఏళ్లుగా శ్రామికులు, కార్మికుల పక్షాన ఉంటూ, వారి కోసం పనిచేస్తున్న ప్రపంచంలోనే అతిపెద్ద కార్మిక సంస్థ బీఎంఎస్ అన్నారు.

## కాంగ్రెస్‌తో విభేదాలపై శశిథరూర్ ఆసక్తికర వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ-నవభూమి:** కాంగ్రెస్ లో మరోసారి విభేదాలు తలెత్తాయా? పార్టీ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ కు, అధిష్టానానికి మధ్య విభేధాలు నడుస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. దీనిపై శశిథరూర్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆసక్తికరమైన పోస్ట్ పెట్టారు. 18వ శతాబ్దం నాటి ఆంగ్ల కవి థామస్ గ్రే కవితలోని పదాలను ఆయన షేర్ చేశారు. "అజ్ఞానం ఆనందంగా ఉన్న చోట తెలివిగా ఉండటం మూర?త్వం" అనే అర్థం వచ్చేలా ఈ కవిత సాగింది. శశిథరూర్ ఇటీవల ఒక ఆర్టికల్‌లో కేరళ ప్రభుత్వ విధానాలను ప్రశంసించారు. ప్రధానమంత్రి అమెరికా పర్యటనపై సైతం ప్రశంసలు కురిపించారు. వీటిపై కాంగ్రెస్ పార్టీ గుర్రుమంటోందనే ప్రచారం జరుగుతోంది. దీనిపై థరూర్ ఒక మీడియా సంస్థతో మాట్లాడుతూ, తాను 16 సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉన్నానని, ప్రభుత్వంలో తమ పార్టీ ప్రభుత్వం ఉన్నా, ఇతర పార్టీ ప్రభుత్వం ఉన్నా మంచి పనులు చేస్తే ప్రశంసించడం, తప్పు చేస్తే నిలదీయడం తన నైజమని చెప్పారు. కేరళలోని ప్రస్తుత లెఫ్ట్ హయాంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు వృద్ధి గురించి ఒక ఆర్టికల్‌లో చెప్పానే కానీ ప్రభుత్వం గురించి కాదని వివరించారు. ప్రభుత్వం చేయాల్సిందే చాలానే ఉందని అన్నారు. గ్లోబల్ స్టార్టప్ ఎకోసిస్టమ్ రిపోర్ట్ 2024 ఆధారంగా వాస్తవ నిజాలు, లెక్కలను తన ఆర్టికల్‌లో ప్రస్తావించానని తెలిపారు. ఆర్టికల్ మొత్తం చదవి మాట్లాడాలే కానీ ఏదో ఒక లైను ఆధారంగా చేసుకుని కామెంట్ చేయడం సరికాదని ఆయన అన్నారు. అందులో పార్టీ రాజకీయాల గురించి ఎక్కడా ప్రస్తావించలేదని, ఆర్థిక దివాళా నుంచి రాష్ట్రం బయటపడాల్సిన అవసరాన్ని తన 16 ఏళ్ల రాజకీయ జీవితంలో పదేపదే చెబుతూ వస్తున్నానని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో తన పాత్ర ఏమిటనే విషయంలో క్లారిటీ లేకపోవడంతో శశిథరూర్ అసంతృప్తితో ఉన్నారనే వార్తలు కొద్దికాలంగా వినిపిస్తున్నాయి. పార్లమెంటులో కీలక డిబేట్‌లలో పాల్గొనే అవకాశం ఇవ్వడం లేదని, సమస్యను పరిష్కరించడంలో రాహుల్ గాంధీ విఫలమయ్యారని ఆయన అసంతృప్తితో ఉన్నట్టు చెబుతున్నారు.

**రాహుల్‌ను కలిసిన శశిథరూర్**

కాగా, శశిథరూర్ రాసిన ఆర్టికల్‌పై కేరళ కాంగ్రెస్ యూనిట్ విమర్శలు గుప్పించిందన్న వార్తల నేపథ్యంలో రాహుల్ గాంధీని గత మంగళవారంనాడు శశిథరూర్ కలుసుకున్నారు. రాహుల్‌తో చక్కటి సంభాషణ జరిగిందని సమావేశానంతరం శశిథరూర్ తెలిపారు. సమావేశంలో ఏ అంశాలు చర్చకు వచ్చాయనే వివరాలను ఆయన దాటవేశారు. పార్టీ తనను పక్కకు పెట్టడంతో అసంతృప్తిగా ఉన్నారా అని అడిగినప్పుడు.. తాను ఎప్పుడూ ఎవరైనా ఫిర్యాదు చేయలేదని ఆయన క్లుప్తంగా సమాధానమిచ్చారు.

## ఆప్ విపక్ష నేతగా అతిషి.. ఈ పదవికి తొలి మహిళగా రికార్డు



**న్యూఢిల్లీ-నవభూమి:** అసెంబ్లీలో అమ్ ఆద్మీ పార్టీ విపక్ష నేతగా మాజీ ముఖ్యమంత్రి అతిషి పేరు ఖరారైంది. ఆదివారం మధ్యాహ్నం ఆప్ లెజిస్లేటివ్ పార్టీ సభ్యుల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీ తొలి సమావేశంలో లేవనెత్తాల్సిన అంశాలపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. ఆప్ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈ సమావేశానికి హాజరయ్యారు. సమావేశానంతరం ఆప్ నేత గోపాల్ రాయ్ మీడియాతో మాట్లాడుతూ, లెజిస్లేచర్ పార్టీ సమావేశంలో అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా అతిషిని ఏకగ్రీవంగా నిర్ణయించామని, పార్టీ క్లిష్ట కాలంలో ఢిల్లీ సీఎంగా ఆమె సేవలందించారని ప్రశంసించారు. ఆరోగ్యకరమైన ప్రతిపక్షంగా ఆప్ తన బాధ్యతలను నెరవేరుస్తుందని చెప్పారు.

అతిషి మాట్లాడుతూ, ప్రజలు ఆప్‌కు ప్రతిపక్ష పాత్ర ఇచ్చారని, బలమైన ప్రతిపక్షం ఎలా పనిచేస్తుందో తాము చూపిస్తామని తెలిపారు. అసెంబ్లీ తొలి సమావేశాల్లోనే మహిళలకు ఆర్థిక సాయం అంశాన్ని ఆమోదించి మార్చి 8న నాటికి వారి అకౌంట్లలో రూ. 2,500 వేస్తామని మోదీ హామీ ఇచ్చినట్టు గుర్తు చేశారు. ఈ హామీని అమలయ్యేలా చూడం తమ బాధ్యత అని అతిషి చెప్పారు. ఎన్నికలకు ముందే తాము కాగ్ నివేదికను స్పీకర్‌కు పంపామని, దానిని ఆయన ప్రెజెంట్ చేసినట్టు వాళ్లు (బీజేపీ) గందరగోళం సృష్టించారని తెలిపారు.

కాగా, ఢిల్లీ అసెంబ్లీ సమావేశాలు ఫిబ్రవరి 24న ప్రారంభం కానున్నాయి. తొలిరోజు ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం, కొత్త స్పీకర్ ఎన్నిక ఉంటుంది. బీజేపీ నేత విజేంద్ర గుప్తాను స్పీకర్‌గా నామినేట్ చేశారు. ప్రొటెం స్పీకర్‌గా అరవింద్ సింగ్ లవ్లీని ఎల్జీ నియమించారు. 25వ తేదీన గత ఆప్ ప్రభుత్వం అవినీతి, అవకతవకలపై కాగ్ ఇచ్చిన నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెడతారు.

## సినిమా స్కూల్‌కు త్రిష కుమార్తెతో కలిసి వెళతా..



**చెన్నై- నవభూమి:** సినిమా అనే స్కూల్‌కు హీరోయిన్ త్రిషతోనే కాదు ఆమె కుమార్తెతో కూడా కలిసి వెళతానని అగ్రనటుడు, మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) అధ్యక్షుడు కమల్ హాసన్ సరదాగా వ్యాఖ్యానించారు. నగరంలో తాజాగా జరిగిన ఓ కార్యక్రమంలో కమల హాసన్‌తో కలిసి త్రిష కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'థగ్‌లైఫ్' మూవీలో కమల్‌తో కలిసి నటించిన అనుభవంపై త్రిష స్పందిస్తూ.. "థగ్‌లైఫ్' చిత్రంలో నటించడం గొప్ప అనుభవంగా భావిస్తున్నాను. ఆయన వద్ద అనేక విషయాలు నేర్చుకున్నాను. కమల్‌తో కలిసి ఒక పాఠశాలకు వెళ్ళిన అనుభూతిని పొందాను. ఆ స్కూల్‌లో అనేక విషయాలు తెలుసుకున్నాను' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమల్ స్పందిస్తూ.. 'నిజమే.. నేను త్రిషతో కలిసి స్కూల్‌కు వెళ్ళాను. అక్కడ అనేక విషయాలు నేర్చుకున్నాం. గురుస్థానం అనేది నాకొద్దు. అది దివంగత కె.బాలచందర్‌తోనే ఉండిపోనివ్వండి.

%నేను ఎల్లవేళలా ఒక విద్యార్థిగానే ఉండేందుకు ఇష్టపడతాను. త్రిషతో కలిసి స్కూలుకు వెళ్ళా ను. ఆ తరువాత ఆమె కుమార్తెతో కూడా పాఠశాలకు వెళతాను. సినిమా అనేది చాలా పెద్దది. నేను 5వ తరగతి వరకు మాత్రమే నేర్పించగలను. పీహెచ్‌డీ స్థాయికి నేను నేర్పించలేను. సినిమా అనేది అనేక విషయాల సమ్మేళనం' అని పేర్కొన్నారు.

# భార్యను భర్త కట్నం డిమాండ్ చేయడం క్రూరత్వం కాదు.. సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ-నవభూమి:** ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా భార్యాబాధితుల కేసుల్లో వేధింపులు, ఒత్తిడి తట్టుకోలేక భర్తలు ఆత్మహత్యలు చేసుకుంటున్న సంఘటనలు పెరిగిపోతూ ఉన్నాయి. అయితే సామాన్యులే కాకుండా సెలబ్రిటీలు కూడా బలవన్మరణానికి పాల్పడుతుండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. మొన్నటికి మొన్న ఒడిశాకు చెందిన ఓ ఫేమస్ ర్యాపర్.. భార్య వేధింపులు తట్టుకోలేక ప్రాణాలు తీసుకున్న సంఘటన తీవ్ర దుమారం రేగిన విషయం తెలిసిందే. అంతకుముందు బెంగళూరు టెకీ అతుల్ సుభాష్ ఘటనతో దేశం మొత్తం ఒక్కసారిగా ఈ భార్యా బాధితుల సంఘటనతో ఉలిక్కిపడింది. ఈ నేపథ్యంలోనే భార్యా బాధితులు.. సోషల్ మీడియా వేదికగా ఇలాంటివి అరికట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా మహిళలకు ఉన్న ప్రత్యేక చట్టాలను అడ్డు పెట్టుకుని.. భార్యలు భర్తలు, అతని కుటుంబ సభ్యులపై పగ తీర్చుకుంటున్నారనే వాదనలు ఎక్కువ అవుతున్నాయి. ఇలాంటి సమయంలోనే తాజాగా ఓ కేసు విచారణ సందర్భంగా.. సుప్రీంకోర్టు ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. కట్నం డిమాండ్ చేయడం క్రూరత్వం కాదని వెల్లడించింది. భార్య నుంచి భర్త కట్నం డిమాండ్ చేయడాన్ని క్రూరత్వంగా పరిగణించలేమని అత్యున్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. భర్త, అత్తమామల నుంచి పెళ్లి అయిన మహిళలకు రక్షణ కల్పించేందుకు 1983లో అప్పటి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఐపీసీ సెక్షన్ 498ఏ ప్రకారం.. కట్నం డిమాండ్ క్రూరమైన నేరం కాదని స్పష్టం చేసింది. సెక్షన్ ప్రకారం 498ఏ ప్రకారం క్రూరత్వం అనేపదానికి విస్తృతమైన అర్థం ఉందని సుప్రీంకోర్టు వ్యాఖ్యలు చేసింది.

కట్నం కింద భార్య కుటుంబానికి సంబంధించిన ఆస్తులు గానీ.. విలువైన వస్తువులు గానీ ఇవ్వాలని డిమాండ్ చేయడం చట్టవిరుద్ధమేనని సుప్రీంకోర్టు తెలిపింది. అయితే కట్నం కోసం మహిళను శారీరకంగా, మానసికంగా వేధించడం మాత్రం క్రూరత్వం అవుతుందని స్పష్టం చేసింది. కేవలం భార్యను భర్త కట్నం డిమాండ్ చేశారనే ఆరోపణలతో 498ఏ సెక్షన్ కింద కేసు పెట్టకూడదని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రసన్న బి.వరాలీలతో కూడిన ఇద్దరు సభ్యుల ధర్మాసనం గత ఏడాది డిసెంబర్ 12వ తేదీన ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. 498ఏ సెక్షన్‌ను ఉపయోగించుకుని.. భర్త, అత్తమామలు, అత్తింటివారిపై కొందరు మహిళలు.. దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

# ఆప్‌లో చేరిన నటి సోనియా మాన్



**చండీగఢ్-నవభూమి:** పంజాబీ నటి కీర్తి కిసాన్ యూనియన్ నేత బల్‌దేవ్ సింగ్ కుమార్తె సోనియా మాన్ ఆమ్ ఆద్మీ పార్టీ లో చేరారు. పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సమక్షంలో ఆదివారంనాడు ఆమె ఆప్‌లో చేరారు. ఆమెను కేజ్రీవాల్ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించినట్టు ఆప్ పంజాబ్ విభాగం ఒక ట్వీట్‌లో తెలిపింది.

**ఎవరీ సోనియా మాన్..?**

పంజాబీ చిత్రాల్లోనే కాకుండా వివిధ భాషా చిత్రాల్లోనూ సోనియా మాన్ నటించారు. మలయాళం, హిందీ, తెలుగు, మరాఠీ భాషల్లో ఆమె నటించారు. "హెడ్ ఎన్ సీక్" అనే మలయాళ చిత్రంలో సినీరంగప్రవేశం చేసిన ఆమె 2014లో 'కహీ హై మేరా ప్యార్' అనే చిత్రంతో హిందీలోకి అడుగుపెట్టారు. 2020లో 'హ్యాపీ హార్డీ అండ్ హీర్'లో నటించారు. నటిగానే కాకుండా గాయనిగా కూడా ఆమె దివంగత పంజాబీ సింగర్ సిద్ధూ మూసేవాలాతో 2018లో పనిచేశారు. ఆమె తండ్రి బల్‌దేవ్ సింగ్ రైతు నాయకుడు, యాక్టివిస్ట్‌గా పనిచేశారు. 1980లో ఆయనను ఖలిస్థానీ ఉగ్రవాదులు హతమార్చారు.

**పంజాబ్‌పై కేజ్రీవాల్ దృష్టి**

ఇటీవల జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 'ఆప్' అధికారం కోల్పోవడంతో ఆప్ 'పంజాబ్' యూనిట్‌పై ప్రస్తుతం కేజ్రీవాల్ ప్రధానంగా దృష్టి సారిస్తున్నారు. 2027లో పంజాబ్ ఎన్నికలు జరగాల్సి ఉండటంతో ఈ రెండేళ్లలో పార్టీని అన్నివిధిలా పటిష్టం చేసేందుకు పావులు కదుపుతున్నారు. ఇటీవల జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ నేత పర్వేష్ వర్మ చేతిలో కేజ్రీవాల్ ఓటమి చవిచూశారు. 13 ఏళ్ల పాటు హస్తినను పాలించిన ఆప్ అధికారం కోల్పోయింది.

## సర్కార్ కీలక నిర్ణయం.. ఇక ఆ ఉద్యోగులకు

# 60 రోజుల సెలవులు, జీతం కూడా ఇస్తారు



**న్యూఢిల్లీ-నవభూమి:** హిమాచల్ ప్రదేశ్‌లో అధికారంలో ఉన్న సుఖ్వీందర్ సుఖు నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు అండగా ఉండేందుకు మరో సంచలన నిర్ణయానికి తెరతీసింది. ఇప్పటినుంచి మహిళా ఉద్యోగులకు 60 రోజుల స్పెషల్ మెటర్నిటీ లీవులు మంజూరు చేయనుంది. అయితే ఈ సెలవులు అందరు మహిళా ఉద్యోగులకు మాత్రం కాదని హిమాచల్ ప్రదేశ్ సర్కార్ తేల్చి చెప్పింది. గర్భిణీలకు డెలివరీ సమయంలో పుట్టిన బిడ్డ చనిపోవడం లేదా డెలివరీ తర్వాత బిడ్డను కోల్పోయిన ప్రభుత్వ మహిళ ఉద్యోగులకు ఈ 60 రోజుల ప్రత్యేక ప్రసూతి సెలవును ఉంటుందని స్పష్టం చేసింది. దీనికి సంబంధించి తాజాగా సుఖ్వీందర్ సింగ్ సుఖు సర్కార్ ఉత్తర్వులు వెలువరించింది. అయితే హిమాచల్ ప్రదేశ్‌లో ఒకరు లేదా ఇద్దరు పిల్లలు ఉన్న మహిళా ఉద్యోగులకు ఇప్పటివరకు 180 రోజులు (6 నెలలు) ప్రసూతి సెలవులు ఇస్తున్నారు. అయితే ఈ ప్రసూతి సెలవులకు ఎలాంటి అర్హతలు ఉండాలో.. కొత్తగా ప్రకటించిన ప్రత్యేక ప్రసూతి సెలవులకు కూడా అవే అర్హతలు అని హిమాచల్ సర్కార్ వెల్లడించింది. కానీ ఈ ప్రత్యేక ప్రసూతి సెలవులు మాత్రం డెలివరీ సమయంలో లేదా ఆ తర్వాత పుట్టిన శిశువు చనిపోయిన వారికి మాత్రమే వర్తిస్తుందని తెలిపింది. అయితే గుర్తింపు పొందిన ఆస్పత్రుల్లో డెలివరీలు చేసుకున్న ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు మాత్రమే ఈ ప్రత్యేక ప్రసూతి సెలవులు వర్తిస్తాయని పేర్కొంది.

9 నెలల పాటు కడుపులో మోసిన బిడ్డ.. కళ్లు తెరిచే సమయంలో, తెరిచిన తర్వాత ప్రాణాలు కోల్పోవడం అంటే ఆ తల్లికి.. అంతకుమించిన శోకం ఇంకోటి ఉండదని హిమాచల్ ప్రభుత్వం తెలిపింది. అందుకే అలాంటి తీవ్ర విషాదకరమైన పరిస్థితుల కారణంగా వారికి కలిగే శారీరక, మానసిక బాధ నుంచి బయటికి వచ్చేందుకు ఈ 60 రోజుల స్పెషల్ మెటర్నిటీ లీవ్స్ ఉపయోగపడుతాయని పేర్కొంది.

ఈ నిర్ణయం వల్ల ఉద్యోగుల సంక్షేమం, ఉద్యోగ భద్రతకు ప్రభుత్వం భరోసా కల్పించినట్లు అవుతుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అంతేకాకుండా మహిళల ఆరోగ్యం, వారి శ్రామిక శక్తిని ఉపయోగించడంలో ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను చెబుతుందని తెలిపాయి. ఇక ఇలాంటి విధానాన్ని తీసుకురావడం ద్వారా మంచి పాలనకు హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు అవుతుందని వెల్లడించాయి. ఉద్యోగుల శ్రేయస్సుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తుందని.. వారికి కష్ట సమయాల్లో మద్దతును అందిస్తుందని స్పష్టం చేశాయి. ఇదే కాకుండా మరో కీలక నిర్ణయాన్ని కూడా హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంది. ఎంబీబీఎస్ పూర్తి చేసి.. మన దేశంలోనే కాకుండా ఇతర దేశాల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు చేస్తున్న వారికి పూర్తి జీతాన్ని మంజూరు చేయడం ద్వారా హెల్త్‌కేర్ సెక్టార్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఒక కీలకమైన ముందడుగు వేసిందని హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది.

## జైలుకెళ్లిన గ్యాంగ్‌స్టర్, లేడీడాన్‌గా చక్రం తిప్పుతున్న భార్య..

# భారీ డ్రగ్స్‌తో అడ్డంగా దొరికింది



**న్యూఢిల్లీ-నవభూమి:** భారీగా డ్రగ్స్ తరలిస్తూ ఓ మహిళ పట్టుబడింది. అయితే ఆ మహిళ ఎవరు అని పోలీసులు ఆరా తీయగా సంచలన లింకులు బయటపడ్డాయి. డ్రగ్ డీలర్, పేరు మోసిన గ్యాంగ్‌స్టర్ హాషీం బాబా భార్య జోయా ఖాన్ అని తేలింది. ఇక భర్త హాషీం బాబా జైలులో ఉండగా.. బయట భార్య జోయా ఖాన్ లేడీ డాన్‌గా ముఠాను నడిపిస్తూ.. గత కొన్నేళ్లుగా పోలీసులకు తప్పించుకుని తిరుగుతోంది. ఇక వీరి గ్యాంగ్‌కు బిష్ణోయ్ గ్యాంగ్‌తో సత్సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. దేశ రాజధాని ఢిల్లీలో పోలీసులు.. డ్రగ్స్, గ్యాంగ్‌స్టర్ల ముఠా ఆట కట్టించారు. గత కొన్ని సంవత్సరాలుగా పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న లేడీ డాన్ జోయా ఖాన్(33) ఎట్టకేలకు పోలీసులకు చిక్కింది. అయితే ఆ సమయంలో రూ.కోటి విలువైన 270 గ్రాముల హెరాయిన్ కూడా లభ్యం కావడం గమనార్హం. అయితే ఢిల్లీలో కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ అయిన హాషీం బాబా భార్యనే ఈ జోయా ఖాన్. హత్యలు, దోపిడీ, ఆయుధాల అక్రమ రవాణా సహా పదుల సంఖ్యలో కేసుల్లో నిందితుడిగా ఉన్న హాషీం బాబా జైలుకు వెళ్లగా.. బయట అతడి నేర సామ్రాజ్యాన్ని, గ్యాంగ్‌ను నడిపిస్తూ జోయా ఖాన్ లేడీ డాన్‌గా మారింది. అయితే హాషీం బాబాకు మూడో భార్యనే ఈ జోయా ఖాన్. ఆమెకు అంతకుముందే పెళ్లి అయి విడాకులు తీసుకుంది. ఆ తర్వాత హాషీం బాబా, జోయా ఖాన్.. ఈశాన్య ఢిల్లీలో ప్రేమించి 2017లో పెళ్లి చేసుకున్నారు. ఇక అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం సోదరి హసీనా పార్కర్‌తో కూడా జోయా ఖాన్‌కు సంబంధాలు ఉన్నట్లు ఢిల్లీ పోలీసులు గుర్తించారు. దోపిడీలు, డ్రగ్స్ అక్రమ రవాణాలో కూడా జోయా ఖాన్ పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఈ జోయా ఖాన్.. హై ప్రొఫైల్ పార్టీలకు హాజరవుతుందని.. ఖరీదైన దుస్తులు ధరించి, ఖరీదైన కార్లతో తిరుగుతూ.. ఎప్పుడూ లగ్జరీ బ్రాండ్లతో లైఫ్ ఎంజాయ్ చేస్తూ ఉంటుందని పోలీసుల విచారణలో తేలింది. వీటన్నింటినీ మించి ఈ జోయా ఖాన్‌కు సోషల్ మీడియాలో భారీగా ఫాలోయింగ్ ఉన్నట్లు సమాచారం.

అయితే తీహార్ జైలులో ఉన్న తన భర్త హాషీం బాబాను కలుస్తూ.. వారిద్దరూ కోడ్ భాషలో మాట్లాడుకుంటారని ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఇక జోయా ఖాన్‌ను పట్టుకునేందుకు ఢిల్లీ పోలీసులు, క్రైం బ్రాంచ్ అధికారులు ఎన్నో ఏళ్లుగా ఎన్నో ఆపరేషన్లు చేపట్టినా దొరకలేదు. అయితే తాజాగా పక్కా సమాచారంతో ఈశాన్య ఢిల్లీలోని వెల్‌కమ్ ప్రాంతంలో ఢిల్లీ పోలీసులు జోయా ఖాన్‌ను అరెస్ట్ చేశారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ నుంచి ఢిల్లీకి భారీగా హెరాయిన్ తరలిస్తుండగా.. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇక ఢిల్లీలో జిమ్ ట్రైనర్ నాదిర్ షాను హత్య చేసిన వారికి జోయా ఖాన్ ఆశ్రయం కల్పించినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జోయా ఖాన్ మాత్రమే కాకుండా ఆమె తల్లిదండ్రులది కూడా నేర సామ్రాజ్యమే అని పోలీసులు వెల్లడించారు. ఇక జోయా ఖాన్ తల్లి సెక్స్ రాకెట్ కేసులో జైలుకు వెళ్లి వచ్చింది. ఆమె తండ్రికి డ్రగ్స్ అక్రమ రవాణా నెట్‌వర్క్‌తో సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. వారికి లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో కూడా మంచి సంబంధాలు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఇక తీహార్ జైలులో ఉన్న గ్యాంగ్‌స్టర్లు లారెన్స్ బిష్ణోయ్, హాషీం బాబాలకు సంబంధాలు కుదిరినట్లు తెలుస్తోంది.

## కుంభమేళా యాత్రికులకు ప్రమాదం, ముగ్గురు మృతి.. అధికారుల సూచన



**న్యూఢిల్లీ-నవభూమి:** మరికొన్ని రోజుల్లో మహా కుంభమేళా ముగియనుంది. ఈ క్రమంలో ఇప్పటికే అనేక మంది మేళాకు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ నేపథ్యంలో వాహనాల్లో వస్తున్న వారికి అనేక చోట్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా కుంభమేళాకు వెళ్లి తిరిగి వస్తున్న ఓ స్కార్పియో వాహనం వేగంగా వచ్చి ఆగి ఉన్న కంటైనర్ ట్రక్కును ఢీ కొట్టింది. దీంతో స్కార్పియోలో ప్రయాణిస్తున్న మహిళతో సహా ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు. అదే సమయంలో మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బీహార్ కైమూర్ జిల్లాలోని కుద్రా పోలీస్ స్టేషన్ పరిధిలోని చిల్బిలి సమీపంలో చోటుచేసుకుంది. 19పై ఆగి ఉన్న కంటైనర్ ట్రక్కును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులందరినీ చికిత్స కోసం కుద్రా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడి నుంచి అందరినీ సదర్ హాస్పిటల్ భభువాకు రిఫర్ చేశారు. మృతుల్లో ఒకరిని నారాయణ్ మండల్ భార్య మీరా దేవి (50)గా గుర్తించారు. ఇది లఖిసరాయ్ జిల్లా ఎటాహ్ గ్రామానికి చెందినది. మృతుల్లో మరో ఇద్దరిని ఇంకా గుర్తించలేదు. గాయపడిన వారిలో ధన్‌బాద్‌లోని సిక్రీ గ్రామానికి చెందిన సుభాష్ కుమార్ భార్య సుస్థి దేవి (55), స్కార్పియో డ్రైవర్ జముయి నివాసి మహ్మద్ కౌశల్ (52), ధన్‌బాద్‌లోని సిక్రీ గ్రామానికి చెందిన రంజిత్ పాశ్వాన్ భార్య సుధాదేవి (35), నారాయణ్‌సరా గ్రామానికి చెందిన నారాయణ్‌సారి గ్రామానికి చెందిన కుమార్తె సోని కుమారి (22) ఉన్నారు. ఈ ఘటన అనంతరం పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అధికారుల సూచన..ఆదివారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటన నేపథ్యంలో ఆ ప్రాంతంలో పెద్ద శబ్దం రావడంతో స్థానికులు భయాందోళ చెందారు. మరోవైపు ఈ ప్రమాదం ఎలా జరిగిందని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ నిద్రమత్తులో డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదం జరిగిందా లేదా అతి వేగం కారణంగా యాక్సిడెంట్ అయ్యిందా అనే కోణంలో కూడా విచారణ జరుపుతున్నారు. ఈ ప్రమాదం నేపథ్యంలో కుంభమేళా నుంచి వాహనాల్లో తిరిగి వచ్చే భక్తులు జాగ్రత్తగా రావాలని అధికారులు సూచిస్తున్నారు. రద్దీ ఎక్కువగా ఉంటుంది కాబట్టి, ఆయా ప్రాంతాలలో పరిమితికి మించి వేగంగా రాకూడదని అంటున్నారు. గతంలో కూడా కుంభమేళా నుంచి వచ్చే క్రమంలో మధ్యప్రదేశ్ సహా పలు ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగాయి.

## రైతులకు పండగలాంటి వార్త.. మళ్లీ ఖాతాల్లో డబ్బులు



**న్యూఢిల్లీ-నవభూమి:** రైతులకు పెట్టబడి సాయం అందించే లక్ష్యంతో పీఎం కిసాన్ పథకాన్ని కేంద్రం అమలు చేస్తోంది. అందులోభాగంగా 19వ విడత నిధులు విడుదలకు తేదీని ప్రభుత్వం ఖరారు చేసింది. రేపు అంటే.. ఫిబ్రవరి 24వ తేదీన రూ. 2 వేలు చొప్పున రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనుంది. బిహార్‌లోని భాగల్పూర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. ఈ విడతలో 9.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం కలగనుందని ఉన్నతాధికారులు వెల్లడించారు. పీఎం కిసాన్ నిధులు అందుకోవాలంటే అర్హులైన రైతులు ఎన్‌పీసీఐ, ఆధార్‌తో అనుసంధానించిన బ్యాంకు అకౌంట్ కలిగి ఉండాల్సి ఉంది. అలాగే, ఇ-కేవైసీ సైతం చేసి ఉండాల్సి ఉంటుంది. మరోవైపు పీఎం కిసాన్ పథకానికి సంబంధించిన స్టేటస్ తెలుసుకోవాలనుకొన్నా.. పీఎం కిసాన్ జాబితాలో మీ పేరు ఉందో, లేదో చూడాలనుకొన్న తొలుత %https://pmkisan.gov.in%/లోకి వెళ్లి చెక్ చేసుకోవచ్చు. ఆయా వివరాలు పొందడానికి రిజిస్టర్డ్ మొబైల్ నంబర్/ ఆధార్ నంబర్ ఎంటర్ చేయాల్సి ఉంటుంది. పీఎం కిసాన్ మొబైల్ యాప్ కూడా అందుబాటులో ఉందన్న సంగతి అందరికి తెలిసిందే. గత విడుత అంటే..18వ విడత, 2023, అక్టోబర్ 5వ తేదీన మహారాష్ట్రలోని వాషిమ్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేసిన విషయం విధితమే. ఈ విడతలో దాదాపు 9 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ. 20 వేల కోట్ల నగదును జమ చేశారు.

రైతులకు పెట్టబడి, ఆర్థిక సాయంతోపాటు వారి జీవనోపాధిని మెరుగు పరచడమే లక్ష్యంగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని 2019లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం కింద అర్హులైన రైతులకు ఏడాదికి రూ. 6 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందిస్తోంది. ఈ మొత్తం ఏడాదిలో మూడు విడతలుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ. 2,000 చొప్పున జమ చేస్తుంది. ఈ పథకం ప్రారంభం నాటి నుంచి ఇప్పటి వరకు 18 విడతలుగా దాదాపు రూ. 2 లక్షల కోట్లకు పైగా రైతుల ఖాతాలకు నగదు జమ చేశారు.



## పంజాబ్‌లో లేని శాఖకు మంత్రిగారు!

**చండీగఢ్-నవభూమి:** పంజాబ్‌లో ఉనికిలో లేని ఓ శాఖకు ఓ మంత్రి బాధ్యతలు నిర్వహించారు. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర ప్రభుత్వం 20 నెలలు తరువాత గుర్తించింది. దానిని సవరించేందుకు ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌తో ఆ విషయం వెల్లడయింది. పంజాబ్‌లో 2022, మార్చిలో భగవంత్ మాన్ నేతృత్వంలో ఏర్పడిన ఆప్ ప్రభుత్వం... మే, 2023లో మంత్రి వర్గ పునర్వ్యవస్థీకరణ చేసింది. ఆ క్రమంలో అప్పటి వరకూ వ్యవసాయం, రైతు సంక్షేమం శాఖలను నిర్వహించిన కుల్‌దీప్ సింగ్ ధలివాల్‌కు ఎన్ఆర్ఐ వ్యవహారాలు, అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ డిపార్ట్‌మెంట్ బాధ్యతలను అప్పగించింది. ఇందులో అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ శాఖ ప్రభుత్వంలో లేదు.విశ్వసనీయ వర్గాల కథనం మేరకు తనకు కేటాయించిన శాఖకు కార్యదర్శి లేకపోవడంతో ధలివాల్ ప్రభుత్వాన్ని వివరణ కూడా కోరినట్లు తెలిసింది. అయితే తాజాగా ఫిబ్రవరి 7న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గెజిట్ విడుదల చేశారు. దీనిపై బీజేపీ విమర్శలకు దిగింది. 'పంజాబ్‌లో పాలనను ఆప్ జోక్‌గా మార్చింది. ఉనికిలో లేని శాఖకు 20 నెలలుగా ఆ మంత్రి బాధ్యతలు నిర్వర్తించారు. ఈ విషయం సీఎంకు కూడా తెలియదంటే పరిస్థితి ఎలా ఉందో ఆలోచించుకోండి' అని ఎద్దేవా చేసింది.



## కాబోయే ఎమ్మెల్సీలు, ఎదురుచూస్తున్న సమస్యలు !

తెలంగాణలో అధికశాతం జిల్లాల్లో వ్యాపించి ఉన్న రెండు ఉపాధ్యాయ నియోజకవర్గాల శాసనమండలి సభ్యుల ఎన్నిక ఈ నెల 27వ తేదీన జరుగుతోంది. కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద-మెదక్, నల్లగొండ-వరంగల్-ఖమ్మం నియోజకవర్గాల శాసనమండలి సభ్యులు దృష్టి సారించేందుకు అనేక విద్యారంగ, ఉపాధ్యాయవర్గ సమస్యలు వేచిచూస్తున్నాయి. విద్యారంగంలో నెలకొన్న సందిగ్ధ పరిస్థితులకు పరిష్కారాన్ని కాబోయే శాసనమండలి సభ్యులు చూపగలరన్న విశ్వాసంతో ఉపాధ్యాయ లోకం ఎన్నికల వైపు చూస్తోంది.విద్య, ఉపాధ్యాయ రంగాలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలు మూడు కేటగిరీలు: వ్యవస్థాపరమైన సమస్యలు, విద్యారంగ సమస్యలు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు. వ్యవస్థాపరమైన సమస్యల్లో ప్రధానమైనది కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం. ఈ విధానం పోవాలని ఉపాధ్యాయులతో పాటు వివిధ శాఖల ఉద్యోగులు కూడా కోరుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం వేతన సవరణ నివేదికను తెప్పించుకుని అమలు చేయాలని కూడా ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆశిస్తున్నారు.

ఇక విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యల్లో ప్రధానమైనది మానిటరింగ్ అధికారులు లేకపోవడం. మానిటరింగ్ వ్యవస్థలో అత్యంత కీలకంగా వ్యవహరించేది మండల విద్యాధికారులు. రాష్ట్రం మొత్తమ్మీద రెగ్యులర్‌గా మండల విద్యాధికారులుగా పనిచేస్తున్నవారి సంఖ్యను వేళ్లమీద లెక్కించవచ్చు. మిగతా స్థానాలన్నీ ఖాళీగా ఉన్నాయి. గతంలో మండల నోడల్ అధికారులుగా పని చేసిన ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ స్థానాల్లో మండల విద్యాధికారులుగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు మానిటరింగ్ బాధ్యతలు ఉన్నప్పటికీ తమ పాఠశాల వ్యవహారాలను పర్యవేక్షిస్తూ పూర్తికాలం మానిటరింగ్‌పై దృష్టి పెట్టడం కష్ట సాధ్యం. విద్యా డివిజన్ స్థాయిలో గతంలో ఉప విద్యాధికారుల వ్యవస్థ ఉండేది. కొత్త జిల్లాల ఏర్పాటు వల్ల జిల్లాల పరిధి తగ్గడంతో ఈ పోస్టులను రద్దు చేశారు. ఈ బాధ్యతలను కూడా జిల్లా విద్యాధికారులకి అప్పజెప్పారు. మండల విద్యాధికారులు అదనపు బాధ్యతలపై ఉండడం, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మానిటరింగ్‌పై పూర్తికాలం దృష్టి పెట్టలేకపోవడం, ఉప విద్యాధికారుల పోస్టుల రద్దు, జిల్లా విద్యాధికారులకు పని ఒత్తిడి వల్ల సమయం చిక్కకపోవడం, ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించకపోవడం మొదలైన కారణాల వల్ల క్షేత్ర స్థాయిలో ఉపాధ్యాయులకు ఏదైనా విషయంలో సందేహాలు ఏర్పడితే వాటిని నివృత్తి చేసేవారే కరువయ్యారు. కాబట్టి సర్వీస్ రూల్స్‌ని ఒక కొలిక్కి తెచ్చి, మండల విద్యాధికారుల పోస్టులను భర్తీ చేయాలి. ఉప విద్యాధికారుల వ్యవస్థను పునరుద్ధరించాలి.

తెలంగాణ రాష్ట్రంలోని జిల్లా విద్యా శిక్షణా సంస్థలు ఒక్కోదానిలో పాతిక దాకా అధ్యాపకులు ఉండాల్సి ఉండగా కేవలం ఒకరిద్దరితోనే నిర్వహించడం జరుగుతోంది. దాని వల్ల ఉపాధ్యాయులు కాగోరేవారికి పూర్తి స్థాయిలో వృత్తి పూర్వ శిక్షణ అందడం లేదు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కూడా బోధనా సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ఈ సమస్యలను నివారించాలంటే ఏకీకృత సర్వీసుల సాధన తప్పనిసరి. ఇదిగో అదిగో అంటూ ఏళ్లకేళ్లు గడుస్తున్నాయే తప్ప ఈ దిశగా పురోగతి లేదు. యాజమాన్యాల వారీగా పదోన్నతులు, బదిలీలు చేయడం గుడ్డిలో మెల్ల. కానీ ఇవే శాశ్వత పరిష్కారాలు కావు. అనేక పీటముడుల కారణంగా మండల విద్యాధికారుల పోస్టులు, డైట్ అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. జూనియర్ లెక్చరర్ పోస్టులకు ఉపాధ్యాయులకు అవకాశం లేకపోయినా క్లర్కులుగా పనిచేసేవారు ఆ పోస్టుల్లోకి పదోన్నతి పొందుతున్నారు. ఉన్నత విద్యార్హతలు, సుదీర్ఘ అనుభవం కలిగిన ఎందరో ఉపాధ్యాయులు ఆ పోస్టుల్లోకి పదోన్నతి లేకుండానే పదవీవిరమణ చెందుతున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని ఏకీకృత సర్వీసు నిబంధనలకు మోక్షం కలిగిస్తుందనే ఆశలో ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ నిబంధనలకు మోక్షం లభిస్తే ఉపాధ్యాయులకు మాత్రమే గాక విద్యార్థులకు కూడా ప్రయోజనం చేకూరుతుంది. విశ్వవిద్యాలయ స్థాయిలోనూ మానవ వనరుల లేమి విశ్వవిద్యాలయాల పరిస్థితిని దిగజారుస్తోంది.సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు అనేక సమస్యలున్నాయి. 'ఎంకి పెళ్ళి సుబ్బి చావుకొచ్చింద'న్నట్టు ముందే సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న ఉపాధ్యాయ లోకాన్ని కొత్త జిల్లాలు, మల్టీ జోన్ల ఏర్పాటు మరిన్ని సమస్యల్లో ముంచెత్తింది. స్థానికతే ప్రధాన మంత్రంగా ఏర్పాటైన తెలంగాణలో స్థానికతకు చెక్ పెట్టింది 317 జీవో. పర్యవసానంగా వందలాదిమంది తమ స్థానిక ప్రాంతానికి దూరంగా బదిలీపై వెళ్ళవలసి వచ్చింది. 317 జీవో వల్ల జరిగిన నష్టాన్ని సరిదిద్దేందుకు ప్రస్తుత ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకోవడం హర్షణీయం. అయితే ఇంకా బాధితులెందరో న్యాయం కోసం ఎదురుచూస్తున్నారు. రెండేళ్ల కిందట 2023 జనవరి 23న వెలువడ్డ మూడో నెంబరు జీవో ప్రకారం అప్పటి ప్రభుత్వం గెజిటెడ్ ప్రధానోపాధ్యాయ పోస్టులను మల్టీ జోనల్ పరిధిలోకి తెచ్చింది. ఈ జీవో ప్రకారం తెలంగాణ రాష్ట్రాన్ని రెండు మల్టీ జోన్లుగా విభజించారు. మల్టీ జోన్1 కిందికి కాళేశ్వరం, బాసర, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి జోన్లనుబీ మల్టీజోన్ 2 కిందికి యాదాద్రి, చార్మినార్, జోగులాంబ జోన్లను తెచ్చారు. హైదరాబాదు నగరం పక్కనే ఉండే మెదక్, సిద్దిపేట జిల్లాలను చార్మినార్ కింద ఉంచకుండా రాజన్న-సిరిసిల్ల జోన్ కిందికి తీసుకురావడం, జిల్లా స్థాయిలో ఉండే ప్రధానోపాధ్యాయులను మల్టీ జోన్ స్థాయికి తీసుకురావడం కొత్త జోనల్ వ్యవస్థలో విశేషాలు. మల్టీ జోన్ స్థాయికి వచ్చేసరికి మెదక్, సిద్దిపేట జిల్లాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు ఆదిలాబాద్, ఖమ్మం మొదలైన సుదూర ప్రాంతాలకు కూడా వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడింది. మల్టీ జోన్ పరిధిలో పదోన్నతుల కారణంగా అధిక శాతం జిల్లాల ఉపాధ్యాయులు నష్టపోయారు. ఇతర జిల్లాల వారు హైదరాబాదు పరిసర జిల్లాలకు రావడం వల్ల ఆయా జిల్లాల్లో పదోన్నతి పొందవలసినవారు తీవ్రంగా నష్టపోయి, నిరాశలో కూరుకుపోయారు. మరికొందరు తప్పనిసరి పరిస్థితుల్లో కుటుంబాలకు దూరంగా దూర ప్రాంతాలకు కూడా వెళ్ళవలసివచ్చింది. ఉమ్మడి జిల్లా పరిధిని జోనల్ స్థాయిగా భావించి, ఆ స్థాయిలోనే ప్రధానోపాధ్యాయ పోస్టుకు పదోన్నతులు, బదిలీలు నిర్వహించాలని ఉపాధ్యాయులు కోరుకుంటున్నారు. మూడో నెంబరు జీవో వల్ల నష్టపోయిన జిల్లాలకు న్యాయం చేయాలని సూచిస్తున్నారు.విద్యారంగం, ఉపాధ్యాయులు, విద్యార్థులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్న ఈ తరుణంలో జరుగుతున్న ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు అత్యంత కీలకమైనవి. ఆయా సమస్యలను పరిష్కరించవలసిన బాధ్యత ఇప్పుడు ఎన్నికయ్యే మండలి సభ్యులపై ఉంటుంది. విద్యారంగంలోని సమస్యల పరిష్కారానికి పెద్దల సభ సభ్యులు కృషి చేస్తారన్న ఆశావహదృక్పథంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఉన్నారు.

# ఉక్రెయిన్ భవిష్యత్తు ఏమిటి?



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మధ్య మాటలయుద్ధం చూస్తుంటే ఉక్రెయిన్‌ను అమెరికా పూర్తిగా ఒంటరి చేసేలా కనిపిస్తున్నది. యురోపియన్ యూనియన్ దేశాలు ఉక్రెయిన్‌కు మద్దతుగా ఎన్ని ఉపన్యాసాలు ఇచ్చినా, ఆ దేశాలు ప్రస్తుతానికి అమెరికాపైనే ఆధారపడి ఉన్నాయి. ఉక్రెయిన్ యుద్ధం ఇప్పుడు నాలుగుదారుల కూడలిలోకి చేరుకుంది. ఏ యుద్ధం అయినా ఏదో ఒకరోజు ముగియవలసిందే. అయితే, మొదలుపెట్టిన వారికి అనుకూలంగానే యుద్ధం ముగియాలని గ్యారెంటీ ఏమీ లేదు. కానీ కీలకమైన యుద్ధాల ముగింపు ప్రపంచ బలాబలాలలో మార్పులు తెస్తాయి. నూతన కూటములు, నూతన అధికార క్రమాలు మొదలవుతాయి.

2021 ఆగస్టులో అమెరికా తనను నమ్ముకున్న వారిని నట్టేట ముంచి, మంచి మంచి ఆయుధాలను వదిలిపెట్టి, ఆఫ్ఘనిస్తాన్ నుండి పలాయనం చిత్తగించింది. ఈ పరిణామం రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ధైర్యాన్నిచ్చింది. రష్యా%-%ఉక్రెయిన్ మధ్య ఎప్పటినుండో రగులుతున్న ఘర్షణలను సైనికంగా పరిష్కరించాలనుకున్నాడు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఉక్రెయిన్‌ను నాటోలో చేర్చుకోబోతున్నట్లుగా ప్రకటనలు ఇవ్వడం, నాటో కూడా ప్రయత్నాలు మొదలుపెట్టడంతో పుతిన్‌కు ఇది సాకుగా ఉపకరించింది. రష్యా భద్రతకు ప్రమాదం ఏర్పడబోతున్నదనే పేరుతో 2022 ఫిబ్రవరి 14న ఉక్రెయిన్‌పై పుతిన్ యుద్ధం మొదలుపెట్టాడు. పుతిన్ 2014లో ఉక్రెయిన్ ఆధీనంలో ఉన్న క్రిమియాను తిరిగి రష్యాలో విలీనం చేసినప్పటినుండే, నాటో ఉక్రెయిన్‌ను సైనికంగా బలోపేతం చేస్తూ వస్తున్నది. ప్రపంచాధిపత్య పోరులో భాగంగా రష్యాను కట్టడి చేయడం కొరకు ఉక్రెయిన్ సైనిక శక్తిని పెంచడం అమెరికాకు అవసరం కూడా. ప్రత్యర్థులను తక్కువగా అంచనా వేసి యుద్ధానికి దిగడంతో ప్రారంభంలో రష్యాకు తీవ్రనష్టాలు ఎదురైనాయి. యుద్ధం ప్రారంభంలో, జెలెన్‌స్కీ దేశం విడిచిపోయేందుకు అమెరికా సహకరిస్తుందని ప్రకటించిన జో బైడెన్, రష్యాకు జరిగిన నష్టాలను చూసిన తర్వాత ఉక్రెయిన్‌కు పెద్ద ఎత్తున ఆర్థిక, ఆయుధ సహాయం చేయడం మొదలుపెట్టాడు. రష్యాపైన అంతా పెద్దఎత్తున ఆంక్షలు విధించారు. మొదట్లో సమస్య పరిష్కారం కొరకు ఒకటి రెండు సమావేశాలు జరిగినా, యుద్ధక్షేత్రంలో రష్యాకు గట్టిజవాబు చెప్పగలమని నాటో దేశాలు విశ్వసించాయి.

అమెరికా, నాటోదేశాలు ఉక్రెయిన్‌కు అన్ని రకాల ఆయుధసాయం చేశాయి. ఉపగ్రహ సమాచారాన్ని, ఆధునిక డ్రోన్లను ఇచ్చాయి. అయితే పాశ్చాత్య మీడియా ప్రచారం చేసినట్లుగా రష్యా శక్తి అంతరించిపోలేదు. కాకపోతే 2022 ఆగస్టులో నాటో ఆయుధాలతో ఉక్రెయిన్ చేసిన బలమైన ఎదురుదాడితో యుద్ధస్థితిలో ప్రతిష్టంభన ఏర్పడింది. అక్కడి నుండి ఈ యుద్ధం మన పౌరాణిక సినిమాలలో చూపినట్టు-ఒకరు నిప్పుల బాణాలు వేస్తే మరొకరు నీళ్ల బాణాలు వేసినట్లు- సాగింది. ఉక్రెయిన్ సైన్యాలు నాటో అందించిన కొత్త ఆయుధాలను ఉపయోగించినప్పుడల్లా రష్యా కొద్దిగా వెనక్కు తగ్గేది. వాటి గురించి అర్థం కాగానే ఎదురు దెబ్బతీసేది. అమెరికన్ అబ్రాం ట్యాంకులు, జర్మన్ లెపర్డ్ ట్యాంకులకు ఎదురే లేదని నాటో చెప్పుకుంది కానీ, వాటినీ రష్యా ధ్వంసం చేసింది. అన్ని రకాల క్షిపణులను రష్యన్ సైన్యాలు కూల్చివేశాయి. ఆధునిక ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను అధిగమించి ఉక్రెయిన్ నగరాలపై రష్యా బాంబులు కురిపిస్తూ పోయింది. ఒకదశలో నాటో సైనిక సలహాదారులు రూపొందించిన ప్రణాళిక ప్రకారం ఉక్రెయిన్ సైన్యాలు అకస్మాత్తుగా, ప్రధాన యుద్ధ రంగానికి దూరంగా రష్యాకు చెందిన కురుస్క్ ప్రాంతంలో కొంత భాగాన్ని ఆక్రమించుకున్నాయి. కురుస్క్‌ను రక్షించుకోవడం కొరకు ప్రధాన యుద్ధరంగం నుండి కొంత సైన్యాన్ని రష్యా ఉపసంహరించుకొని అక్కడకు పంపుతుందని నాటో ఆశించింది. కానీ, ఈ పురాతన ఎత్తుగడను సైతం రష్యా సులువుగా తిప్పికొట్టింది. ఉక్రెయిన్ సైన్యాన్ని కురుస్క్ నుండి వెళ్లగొట్టడానికి రష్యన్ సైనికులకు తోడుగా నార్త్ కొరియా సైనికులు కూడా వచ్చారు.

ఇంతలోగా అమెరికా ఎన్నికలు ముంచుకొచ్చి ఉక్రెయిన్ పరిస్థితి మూలిగే నక్క మీద తాటిపండు పడినట్లు అయింది. ట్రంప్ వస్తే ఉక్రెయిన్‌కు అమెరికా సహాయం ఆగిపోవచ్చునని అందరూ ఊహించినదే. పదవి చేపట్టడంతోనే ఆయన ఈ యుద్ధం ముగింపు కొరకు రష్యాతో చర్చల కార్యక్రమాన్ని ప్రారంభించాడు. ఈయూ, ఉక్రెయిన్‌కు ఈ చర్చలలో స్థానం లేకుండా చేశాడు. ఉక్రెయిన్ యుద్ధం ఆగిపోతుంది కాని దాని పాత సరిహద్దులు మారిపోవచ్చు అని ట్రంప్ అంటున్నారు. అంటే రష్యా ఆక్రమించుకున్న ఉక్రెయిన్ తూర్పు ప్రాంతం రష్యాకే పోతుందని అర్థం. అలాగే ఉక్రెయిన్ రక్షణ గ్యారంటీలో అమెరికా సైన్యం ఉండదట. యుద్ధానికి మూలకారణమైన నాటో సభ్యత్వం ఉక్రెయిన్‌కు ఇవ్వడం సాధ్యమయ్యే పని కాదని కూడా ట్రంప్ తెగేసి చెప్పారు. అమెరికా వైఖరితో దిగ్భ్రాంతిచెందిన ఈయూ దేశాలు చర్చల్లో తమనూ, ఉక్రెయిన్‌ను భాగం చేయనందుకు అమెరికాను విమర్శిస్తున్నాయి.

యుద్ధం ముగింపు కొరకు జరుగుతున్న చర్చల క్రమాన్ని, ఈయూ, అమెరికా మధ్య పెరుగుతున్న అపనమ్మకాన్ని, అమెరికా రష్యాల మధ్య చిగురిస్తున్న స్నేహాన్ని చూసినప్పుడు కొత్తకూటముల ఉదయమేదో జరగబోతున్నట్లు కనిపిస్తున్నది. రష్యాకు అమెరికా స్నేహహస్తాన్ని అందిస్తూనే మరోవైపు చైనాతో కఠినంగా వ్యవహరిస్తున్నది. ఇప్పుడు అమెరికాకు ప్రధాన శత్రువు చైనానే. చైనా నాయకత్వంలోని బ్రిక్స్‌తోనే అమెరికాకు ప్రమాదం. రష్యా చైనాలను ఒకేసారి ఎదుర్కోవడం సాధ్యం కాదని ఉక్రెయిన్ యుద్ధంతో తేలిపోయింది. ఉక్రెయిన్ యుద్ధాన్ని రష్యాకు అనుకూలంగా పరిష్కరించి రష్యాను మంచి చేసుకుని చైనాను ఒంటరి చేయాలనేది అమెరికా ఆలోచన కావచ్చు. 1970లలో రష్యాను ఒంటరి చేయడానికి కిసింజర్ దౌత్యనీతితో చైనాను అమెరికా దగ్గరికి తీసుకున్నది. అప్పటివరకు తైవాన్ ప్రత్యేక అస్తిత్వాన్ని గుర్తించిన అమెరికా, చైనాతో దోస్తీ కొరకు తైవాన్‌ను చైనా అంతర్భాగంగా గుర్తించింది. అదే అమెరికా వారం క్రితమే తైవాన్ స్వాతంత్ర్యాన్ని గుర్తించే విధంగా తన వెబ్‌సైట్‌లో మార్పులు చేసింది. రష్యా దోస్తీ కొరకు ఉక్రెయిన్ తూర్పు ప్రాంతాన్ని రష్యాలో భాగమే అని కూడా అమెరికా అనవచ్చు. ఈ నేపథ్యంలో యూరప్ దేశాలు కొన్ని చైనాకు దగ్గర కావచ్చు, కొన్ని అమెరికా వైపు ఉండవచ్చు. ఉక్రెయిన్ యుద్ధం ముగింపులో నూతన కూటములు ఏర్పడే క్రమం కూడా ఉంది. అలాగే, అమెరికా కొత్త కూటమికి అనుకూలంగా ఉక్రెయిన్ యుద్ధం పరిష్కారమవుతుందనీ అనుకోవచ్చు.

# పంచాయతీరాజ్ సార్థకమయ్యేది ఎలా?

73, 74వ రాజ్యాంగ సవరణ జరిగి 30 సంవత్సరాలు అయినా, పంచాయతీరాజ్, పట్టణ సంస్థల 29 అంశాలకు సంబంధించిన నిధులు, విధులు, సిబ్బంది నియామకం జరగలేదు. పంచాయతీరాజ్‌లో అదనంగా జడ్పీటీసీలు, ఎంపీటీసీల వ్యవస్థ ప్రవేశపెట్టడం పలు వివాదాలకు దారితీసింది. గతంలో పంచాయతీలు, మండల పరిషత్‌లకుబీ మండల పరిషత్, జిల్లా పరిషత్‌కు అనుసంధానం ఉండేది. నేడు అది కరువైంది. 2002లో నాటి ప్రభుత్వం రెవెన్యూ అధికారులను కూడా పంచాయతీలకు అప్పగించి గ్రామపంచాయతీలను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంది. దీన్ని పంచాయతీరాజ్ ప్రజాప్రతినిధులు, ప్రజలు స్వాగతించారు. కానీ 2007లో ప్రభుత్వం మారగానే రెవెన్యూ వ్యవస్థను తిరిగి పంచాయతీల నుంచి విడగొట్టారు. దీంతో గౌరవ వేతనం మీద రెవెన్యూ శాఖలో పార్ట్ టైంగా పని చేసినవారు 2002లో పంచాయతీ కార్యదర్శులుగా శాశ్వత ఉద్యోగిగా లబ్ధి పొందారు. కానీ తిరిగి రెవెన్యూ శాఖకు వెళ్లిపోయారు. ఇది పంచాయతీరాజ్ శాఖలోని ఉద్యోగులకు కాకుండా రెవెన్యూ శాఖ సిబ్బందికి ఉపయోగపడింది.

2019లో రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ పరిపాలన బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పి, గ్రామ సచివాలయం వ్యవస్థను ప్రవేశపెట్టి, అందులో సుమారు లక్షా పాతికవేల మందిని నియమించారు. అంతేగాక సుమారు రెండు లక్షల మంది వాలంటీర్లను కూడా నియమించారు. కానీ, సదరు గ్రామ సచివాలయాన్ని పంచాయతీరాజ్ శాఖ నుంచి విడగొట్టి వేరొక శాఖ ఏర్పాటు చేశారు. అంటే ప్రజా సంక్షేమం గ్రామ పంచాయతీల ద్వారా కాకుండా వేరొక శాఖ ద్వారా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇది చాలా బాధాకరం.నేటి కూటమి ప్రభుత్వం పంచాయతీ వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చి బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆలోచించడం సముచితమే. ఈ సందర్భంలో పంచాయతీరాజ్ వ్యవస్థలో అటు పరిపాలనాపరంగా, వ్యవస్థాపరంగా జరగవలసిన మార్పులేమిటో చూద్దాం.నేడు జిల్లా పరిషత్, మండల పరిషత్ ద్వారా




గ్రామీణ వ్యవస్థకు సంబంధించిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగే కలెక్టర్, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ పరిపాలన వ్యవస్థ కొనసాగుతోంది. ఈ రెండు వ్యవస్థలు కూడా పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఏర్పాటయినవే. రాజ్యాంగ సవరణ ప్రకారం 29 శాఖలకు సంబంధించిన సిబ్బందిని కూడా పంచాయతీరాజ్ సంస్థల పరిధిలోకి తేవాల్సిన సందర్భంలో పటిష్ఠమైన అధికార వ్యవస్థ ఉండాలి. అందుకు గ్రామ, మండల, డివిజనల్, జిల్లా, రాష్ట్ర శాఖలో ఏ విధంగా మార్పులు చేస్తే బాగుంటుందో పరిశీలిద్దాం.గ్రామపంచాయతీ కార్యదర్శి పేరును కార్యనిర్వహణ అధికారిగా గతంలో ఉన్నట్టుగానే పునరుద్ధరించాలి. పంచాయతీ కార్యదర్శి గ్రేడ్‌లోని ఆరు వ్యవస్థలను మూడుగా కుదించాలి. గతంలోని గ్రేడ్%-%1, గ్రేడ్%-%2 పంచాయతీ కార్యదర్శిలను ఒక గ్రేడ్‌గాను (జోనల్ స్థాయి రిక్రూట్‌మెంట్)బీ మూడు, నాలుగు గ్రేడ్లను రెండో గ్రేడ్‌గానుబీ ఐదు ఆరు గ్రేడ్‌లను మూడో గ్రేడు (జిల్లా గ్రేడ్లుగా)గా మార్పు చేయాలి.మండల స్థాయిలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి పేరును మండల ముఖ్య కార్యనిర్వహణాధికారిగా మార్పు చేయాలి. ప్రతి మండలంలో సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించడానికి ఒక మండల విస్తరణ అధికారి పోస్టు మంజూరు చేసి, దానికి మండల పంచాయతీరాజ్ సంక్షేమ అధికారిగా పేరు పెట్టాలి. అలాగే నేడున్న విస్తరణాధికారి పేరును మండల పంచాయతీ అభివృద్ధి అధికారిగా మార్పు చేయాలి. ఈ మండల పంచాయతీ అభివృద్ధి అధికారులు డివిజనల్ పంచాయతీ అధికారి ఆధీనంలో పనిచేయాలి.

ఇక డివిజనల్ స్థాయిలో ఏర్పాటు చేసిన డివిజనల్ అభివృద్ధి అధికారికి గ్రామ సచివాలయం, గ్రామపంచాయతీ, మండల పరిషత్ కార్యక్రమాల విధులను పరిరక్షించే బాధ్యతను అప్పగించాలి. నేడున్న డివిజనల్ అభివృద్ధి అధికారి పోస్టును మండల పరిషత్ అధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారుల ద్వారా 1:1 శాతంతో భర్తీ చేయాలి.అలాగే జిల్లా స్థాయిలోని జిల్లా పంచాయతీ అధికారి హోదాను జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి హోదాతో సమానం చేయాలి. జిల్లా పంచాయతీ అధికారి పేరును కూడా జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా మార్పు చేయాలి. జిల్లా పరిషత్‌లో గల జిల్లా కార్యనిర్వాహణాధికారి, జిల్లా పంచాయతీ కార్యనిర్వహణాధికారి పోస్టులను డివిజనల్ అభివృద్ధి అధికారులతో భర్తీ చేయాలి. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి, జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి పోస్టులను పరస్పరం బదిలీ చేసే విధంగా నిర్ణయం తీసుకోవాలి. జిల్లా ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి పోస్టులను కూడా డివిజనల్ అభివృద్ధి అధికారులతో పరస్పర బదిలీ విధానంగా ఏర్పాటు చేయాలి. ప్రతి జిల్లా పరిషత్‌లోను జిల్లా పంచాయతీ కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో గణాంక అధికారి పోస్టులను మంజూరు చేయాలి. జిల్లా పరిషత్‌లోని గణాంక అధికారి, జిల్లా పంచాయతీ కార్యాలయం అధికారులను పరస్పరం బదిలీ చేసే విధానం ఏర్పాటు చేయాలి.రాష్ట్రస్థాయిలోకి వచ్చేసరికి కమిషనర్ పంచాయతీరాజ్ కార్యాలయంలోని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి కార్యాలయంలో నేడున్న ద్వంద్వ పరిపాలన విధానాన్ని తొలగించి, ఒకే గూడు కింద పరిపాలన తీసుకురావాలి. కమిషనర్ కార్యాలయంలో కమిషనర్‌కు పంచాయతీరాజ్ విభాగం నుంచి సహకారం అందించడానికి ఒక అదనపు కమిషనర్, అలాగే గ్రామీణ అభివృద్ధి విషయాలలో సహకారం అందించటానికి మరొక అదనపు కమిషనర్‌ను ఏర్పాటు చేయాలి. గ్రామీణాభివృద్ధి విభాగంలో రెండు జాయింట్ కమిషనర్ పోస్టులు, 4 ఉప కమిషనర్లు, 8 సహాయక కమిషనర్లతో పాటు 12 సెక్షన్లు ఏర్పాటు చేయాలి. అలాగే పంచాయతీ విభాగంలో ఇద్దరు జాయింట్ కమిషనర్ల పోస్టులు, నాలుగు ఉప కమిషనర్లు, 8 సహాయక కమిషనర్లతో పాటు 12 సెక్షన్లను ఏర్పాటు చేయాలి. ఈ పోస్టులను క్రింది స్థాయి అధికారులతో భర్తీ చేయాలి. ప్రతి సెక్షన్‌కు ఒక పరిపాలన అధికారి, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, ఒక కంప్యూటర్ ఆపరేటర్ ఉండాలి. అలాగే అదనంగా 12 డాటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులను కూడా ఏర్పాటుచేసి వారి సేవలను ఉపయోగించుకోవాలి.

కమిషనర్ కార్యాలయంలో ఒక ఫైనాన్షియల్ కమిషనర్ పోస్టును ఏర్పాటు చేయాలి. ఈ పోస్టును ఐఎఎస్ హోదా అధికారి ద్వారా భర్తీ చేయాలి. రెండు ముఖ్య గణాంక అధికారుల పోస్టులు ఏర్పాటు చేయాలి. వారిలో ఒకరు పంచాయతీరాజ్ లెక్కలు, మరొకరు గ్రామీణాభివృద్ధిలో గణాంక విషయాలు చూడాలి.నేడున్న గ్రామపంచాయతీలను కూడా మూడు గ్రేడ్లుగా విభజించాలి. మొదటిది- 5వేలు లోపల జనాభా, రెండోది- ఐదు-పదివేల మధ్యన జనాభా, మూడోది- పదివేల పైబడి జనాభా కలిగిన పంచాయతీలుగా విభజించాలి. పదివేలు పైబడిన జనాభా కలిగిన పంచాయతీల్లో గ్రేడ్ వన్ కార్యదర్శులను (నేడున్న ఒకటి, రెండు గ్రేడ్లు కలిపి), 5-10వేల మధ్య కలిగిన జనాభాలో పంచాయతీలో గ్రేడ్-2 (నేడున్న మూడు, నాలుగు గ్రేడ్లు కలిపి), ఐదు వేల కంటే తక్కువ జనాభా కలిగిన పంచాయతీల్లో గ్రేడ్-3 (నేడున్న 5, 6 గ్రేడ్లు కలిపి) పంచాయతీ కార్యదర్శులను నియమించాలి.ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థను రద్దు చేయాలి. సర్పంచులు మండల పరిషత్ అధ్యక్షుడిని, మండల పరిషత్ అధ్యక్షులు జిల్లా పరిషత్ చైర్మన్‌ను ఎన్నుకొనేటట్లుగా మార్పులు తీసుకురావాలి. అలాగే శాసనపరమైన అంశాలపైన ప్రజాప్రతినిధులు చేసుకునే అప్పీళ్లను పరిశీలించడానికి ఒక ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలి. 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం సంబంధిత నిధులు, విధులు, సిబ్బంది బదలాయింపునకు చర్యలు తీసుకోవాలి. కమిషనర్ పంచాయతీరాజ్ కార్యాలయంలో ఒక విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఏర్పాటు చేయాలి. అందులో ఒక ఎస్పీ స్థాయి అధికారిని నియమించాలి.ఇలా తగు చర్యలు తీసుకుంటే పంచాయతీరాజ్ సంస్థల మధ్యన సమన్వయం ఏర్పడి, సమర్థంగా పరిపాలన సాగడమే కాకుండా పంచాయతీరాజ్ సంస్థలు ఆర్థికంగా కూడా నిలదొక్కుకోవడానికి, పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడానికి అవకాశం ఉంటుంది. తద్వారా మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం

## దేవుడు నీలోనే ఉన్నాడు

భక్తి



'కులాలు, మతాలు అనేవి కేవలం మానవుల సృష్టే. భగవంతుడికి వాటితో ఎలాంటి సంబంధం లేదు. ప్రతి ఒక్కరిలో ఈ అవగాహన కల్పించి, సరైన పరివర్తన తీసుకు రాగలిగితే... నవ సమాజం, వసుధైక కుటుంబం, సర్వమానవ సౌభ్రాతృత్వం, ద్వేషరహితమైన, ప్రేమపూరితమైన ప్రపంచం ఏర్పడతాయి" అని ప్రకటించడమే కాదు, అది సాధ్యమేనని సహజయోగ ధ్యాన పద్ధతిద్వారా నిరూపించారు శ్రీమాతాజీ నిర్మలాదేవి. మిమ్మల్ని సృష్టించిన శక్తితో మీరు అనుసంధానం కానంతవరకూ... మీ జీవిత పరమార్థం ఏమిటనేది తెలుసుకోలేరని ఆమె స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక గురువుగా... తను నమ్మిన సత్యాన్ని, ధర్మాన్ని ఆమె స్వయంగా ఆచరించి చూపారు.

అదే శివుడి ఇచ్ఛాశక్తి...

తన స్వీయ తపోశక్తితో 1970 మే 5న సహజయోగను శ్రీమాతాజీ నిర్మలాదేవి ఆవిష్కరించారు. తనలో నిద్రాణమైన స్థితిలో ఉన్న కుండలినీ శక్తిని జాగృతం చేసి, బాహ్యపరంగా ఉన్న పరమాత్మ ప్రేమైక శక్తి అయిన పరమ చైతన్యంతో దాన్ని అనుసంధానం చేయడం ద్వారా.. ఆత్మ సాక్షాత్కార అనుభూతిని సాధించారు. దీనితో ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్రలో ఒక కొత్త అధ్యాయం ప్రారంభమయింది. 'సహ' అంటే 'మనతో', 'జ' అంటే 'జన్మించిన శక్తి'... 'యోగ' అంటే 'బాహ్యపరంగా ఉన్న శక్తితో కలవడం' అని అర్థం. ఈ విధంగా మనలోని కుండలినీ శక్తి విశ్వవ్యాపితమైన భగవత్ శక్తితో ఏకీకరణ పొందినప్పుడు... మనం కూడా ఆ దివ్య శక్తిలో ఒక కణంగా, భాగంగా మారిపోతాం. పరమ చైతన్యం లేదా బ్రహ్మ చైతన్యం అంటే విశ్వవ్యాపితమైన పరమాత్మ ప్రేమ శక్తి. విశ్వాన్ని, సకల చరాచర జీవులను నడిపించే ఆ భగవత్ శక్తి మానవుల మేధస్సుకు అతీతమైనది. సదాశివుని అర్ధాంగి అయిన ఆదిశక్తి... ఆయన చుట్టూ ఒక చల్లని మేఘంలా ఆవరించి ఉంటుంది. అదే బ్రహ్మ చైతన్యం. పరమ చైతన్య శక్తిగా పిలిచే ఆ శక్తే... పరమాత్మ అయిన శివుడి ఇచ్ఛాశక్తి. ఆ శక్తే విశ్వాన్ని సృష్టించింది. భూమి మీద ఉన్న జీవజాలం మీద తన పరమ చైతన్య శక్తిని వెదజల్లుతోంది. మనల్ని అంతర్గతంగా బలోపేతం చేస్తోంది. మనలో ప్రేమ శక్తిగా అంకురిస్తోంది. అందుకే ఆత్మ సాక్షాత్కారాన్ని పొంది, సహజయోగ సాధన చేస్తున్నవారందరూ ఆ భగవంతుడి ప్రేమ శక్తిని తమ చుట్టూ ఉన్నవారికి పంచడానికి కృషి చేస్తారు. ఈ సాధన చేస్తున్నవారిలో సహస్రార చక్రం పూర్తిగా వికసిస్తుంది. అంతర్గత సూక్ష్మ శరీర వ్యవస్థలో ఉన్న ఏడు చక్రాలు తెరుచుకుంటాయి. బ్రహ్మచైతన్యంలో అంతర్భాగాలైన అధిష్టాన దేవతలు మేలుకొని, వారికి ఆశీస్సులు అందజేస్తారు. కుల, సహజయోగను మత, జాతి, ప్రాంత, వయసు, లింగ భేదాలకు అతీతంగా ఎవరైనా, ఎప్పుడైనా అతి సునాయాసంగా ఆచరించవచ్చు. ఇది దైనందిన జీవితంలో మానవులు ఎదుర్కొనే శారీరక, మానసిక, భౌతిక, ఆధ్యాత్మిక సమస్యలన్నిటికీ చక్కటి పరిష్కారం.

## మీరు వంటల్లో వాడే కారం పొడి అసలైనదేనా?



వంటలో అత్యంత సాధారణంగా ఉపయోగించే పదార్థాలలో మిర్చీ కారం పొడి ఒకటి. కారం పొడి వేయడం వల్ల వంటకం రుచిగా, ఘాటుగా ఉంటుంది. అయితే మార్కెట్లో రకరకాల కారం పొడులు లభ్యమవుతున్నాయి. కొందరు అధిక లాభాల కోసం కల్తీ కారం పొడులు విక్రయిస్తున్నారు. వీటిని ఆహారంలో వాడటం వల్ల రకరకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.

వంటలో అత్యంత సాధారణంగా ఉపయోగించే పదార్థాలలో మిర్చీ కారం పొడి ఒకటి. కారం పొడి వేయడం వల్ల వంటకం రుచిగా, ఘాటుగా ఉంటుంది. అయితే మార్కెట్లో రకరకాల కారం పొడులు లభ్యమవుతున్నాయి. కొందరు అధిక లాభాల కోసం కల్తీ కారం పొడులు విక్రయిస్తున్నారు.

వీటిని ఆహారంలో వాడటం వల్ల రకరకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.కల్తీ కారం వంటకానికి ఆకర్షణీయమైన రంగును జోడిస్తుంది. ఘాటు కూడా సాధారణ కారం కంటే కాస్త ఎక్కువగానే ఉంటుంది. మీరు మార్కెట్లో కొనుగోలు చేసిన కారం పొడి అసలైనదా లేదా నకిలీదా అని ఇంట్లో కొన్ని పరీక్షలు చేయడం ద్వారా సులభంగా గుర్తించవచ్చు. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం..

కల్తీ కారం వంటకానికి ఆకర్షణీయమైన రంగును జోడిస్తుంది. ఘాటు కూడా సాధారణ కారం కంటే కాస్త ఎక్కువగానే ఉంటుంది. మీరు మార్కెట్లో కొనుగోలు చేసిన కారం పొడి అసలైనదా లేదా నకిలీదా అని ఇంట్లో కొన్ని పరీక్షలు చేయడం ద్వారా సులభంగా గుర్తించవచ్చు. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం..

## ఒక కప్పు బ్లాక్ కాఫీతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు..! తెలిస్తే షాక్ అవుతారు..!



బ్లాక్ కాఫీ గుండె ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు, టైప్-2 డయాబెటిస్ ముప్పును తగ్గించడంలో సహాయపడుతుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు ఉండటంతో కణాల రక్షణకు తోడ్పడుతుంది. పార్కిన్సన్స్, అల్జీమర్స్ వంటి నాడీ సంబంధిత వ్యాధులను నివారించేందుకు కూడా బ్లాక్ కాఫీ ఉపయోగపడుతుంది. ఇలా చాలానే ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.

**శరీరానికి లాభాలు**

బ్లాక్ కాఫీలో ఉండే క్యాఫిన్ శరీరంలో శక్తిని పెంచుతుంది. దీనివల్ల మేల్కొలిపిన భావన ఏర్పడుతుంది. కొంతమందికి తరచూ వచ్చే తలనొప్పిని తగ్గించడంలో ఇది సహాయపడుతుంది. అంతేకాదు దృష్టిని మెరుగుపరిచే శక్తిని కూడా అందిస్తుంది.

**అధిక బరువు**

నిత్యం బ్లాక్ కాఫీ తాగడం శరీర బరువును నియంత్రించడంలో ఉపయోగపడుతుంది. ఇది మెటాబోలిజం వేగాన్ని పెంచడంతో పాటు కొవ్వును త్వరగా కరిగించేందుకు సహాయపడుతుంది.

**దీర్ఘాయువు**

కొన్ని అధ్యయనాల ప్రకారం ప్రతిరోజు ఉదయం బ్లాక్ కాఫీ సేవించడం మన జీవిత కాలాన్ని పెంచే అవకాశం ఉంది. ఇది శరీర కణాలను ఉత్తేజపరచి వార్ధక్య లక్షణాలను ఆలస్యంగా ప్రదర్శించేందుకు సహాయపడుతుంది.

**అధిక ఒత్తిడి**

బ్లాక్ కాఫీ సేవించడం శరీర శక్తిని పెంచడమే కాకుండా ఒత్తిడిని తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. దీని వల్ల మానసిక ప్రశాంతత పెరిగి రోజువారీ పనులను ఉత్సాహంగా చేయగలుగుతారు.

**టైప్ 2 డయాబెటిస్**

కొన్ని పరిశోధనాల ప్రకారం బ్లాక్ కాఫీ తాగడం వల్ల టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశం తగ్గుతుందని చెబుతున్నారు. క్యాఫిన్ వల్ల ఇన్సులిన్ సున్నితత్వం మెరుగుపడుతుంది.

**మెదడు పనితీరు**

బ్లాక్ కాఫీ తాగడం మెమరీని మెరుగుపరిచే అవకాశం ఉంది. ఇది మెదడు పనితీరును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. కొన్ని అధ్యయనాల ప్రకారం బ్లాక్ కాఫీ మానసిక క్షీణతను నివారించేందుకు ఉపయోగపడొచ్చు.

**కాలేయ ఆరోగ్యం**

ఫ్యాటి లివర్, సిర్రోసిస్ వంటి కాలేయ సంబంధిత సమస్యల నుంచి శరీరాన్ని రక్షించగలదు. దీనివల్ల కాలేయ ఆరోగ్యం మెరుగుపడే అవకాశం ఉంది.

**మానసిక ఆరోగ్యం**

కాఫీలోని క్యాఫిన్ డోపమైన్ స్థాయిని పెంచుతుంది. ఇది మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచి మూడ్‌ను ఉత్తేజపరచడంలో సహాయపడుతుంది.

## రోజంతా ఏసీలోనే ఉంటున్నారా.. మీకు ఈ వ్యాధులు వచ్చే ప్రమాదం

గత కొన్ని రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు వాతావరణాన్ని ఒక్కసారిగా మార్చేశాయి. ఈ కారణంగా ఎయిర్ కండిషనర్ల వాడకం చాలా పెరిగింది. ఇప్పటికే ఏసీల వాడకం అలవాటు ఉన్నవారు ఇవి లేకుండా ఒక్క క్షణం ఉండలేని పరిస్థితి. ఇంట్లో ఉన్నా కారులో ప్రయాణించినా కొందరికీ ఏసీ కచ్చితంగా ఉండాల్సిందే. ఇక అప్పుడే పుట్టిన పిల్లలు కూడా ఏసీ వాతావరణానికి అలవాటు పడితే ఆ తరవాత అది లేకుండా ఉండలేరు. ఇలా ప్రతి ఒకప్పుడు ఉన్నత వర్గాలు మాత్రమే దీనిని వాడేవారు. ఇప్పుడు ప్రతి ఒక్కరి ఇంట్లో కూలర్ల కన్నా ఏసీలే దర్శనమిస్తున్నాయి. అయితే, ఎంత ఎండాకాలమైనా ఏసీలను లిమిట్ వరకే వాడాలంటున్నారు నిపుణులు. లేదంటే వీటి కారణంగా తీవ్రమైన అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదముందని అంటున్నారు.

రోజంతా ఏసీలోనే ఉంటున్నారా.. మీకు ఈ వ్యాధులు వచ్చే ప్రమాదం ఎక్కువ

ఏసీ గాలిని నిరంతరం పీల్చడం మీ ఆరోగ్యానికి చాలా ప్రమాదకరమని కొన్ని సర్వేల్లో వెల్లడైంది. ఇవి తీవ్రమైన ప్రాణాంతక వ్యాధుల బారిన పడేలా చేస్తాయంటున్నారు. ఏసీని మితంగా వాడితేనే మంచిదని హెచ్చరిస్తున్నారు. వీటి కారణంగా ఈ వ్యాధులు రాకుండా చూసుకోవాలంటున్నారు. ఏసీ ఆన్ చేసినప్పుడు గదిలోని తలుపులు, కిటికీలతో పాటు మిగిలిన అన్ని ఓపెనింగ్‌లను పూర్తిగా మూసివేయాలి. ఏసీ మెరుగ్గా పనిచేయడానికి, మీ గది వేగంగా చల్లబడటానికి, ఫిల్టర్‌లను తరచూ శుభ్రం చేయాలి. గది తగినంతగా చల్లబడటం లేదని మీరు భావిస్తే, వెంటనే ఫిల్టర్లను శుభ్రం చేయాలి. ఫ్యాన్‌ని కూడా లోస్పీడ్ లో ఉంచడం మంచిది. కూలింగ్ గది మొత్తం త్వరగా విస్తరించడానికి ఇది సాయంపడుతుంది. ఏసీ గది చల్లగా ఉండటానికి లైట్లను ఆఫ్ చేయాలి. ఎగ్జాస్ట్ ఫ్యాన్ వంటివి ఉన్నా వెంటనే వాటిని కూడా ఆఫ్ చేయాలి. పెద్ద గదిలో తక్కువ సామర్థ్యం ఉన్న ఏసీలను ఉంచితే కూడా కూలింగ్ అంత మెరుగ్గా ఉండదు.

సైడ్ ఎఫెక్ట్స్ ఇలా ఉంటాయి..

ఎయిర్ కండిషనర్ వాడటం వల్ల మీ ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా మీ చర్మం కూడా దెబ్బతింటుంది. కాబట్టి, మీ ఇంటిని చల్లగా ఉంచుకోవడానికి ఏసీ కి బదులుగా సహజ పద్ధతులను ఉపయోగించాలి. ఏసీ వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి తెలుసుకుంటే వెంటనే మీరు దీని వాడకాన్ని తగ్గించేస్తారు.

**ఆస్తమా..**

ఏసీ కారణంగా, ఆస్తమా వంటి తీవ్రమైన ప్రాణాంతక వ్యాధి వచ్చే అవకాశం చాలా వరకు పెరుగుతుంది. మీరు ఆస్తమా బాధితులైతే ఎక్కువసేపు ఏసీలో ఉండకుండా ఉండాలి.

**డీహైడ్రేషన్**

ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఎక్కువసేపు ఏసీలో కూర్చోవడం వల్ల కూడా డీహైడ్రేషన్ వస్తుంది. వేసవిలో ఈ సమస్య నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోవడం చాలా ముఖ్యం.

**అలెర్జీ రినైటిస్**

అలెర్జీ రినైటిస్‌కు ప్రధాన కారణం ఏసీలో ఎక్కువ సమయం గడపడం అని మీకు తెలుసా.. అందుకే ఏసీలో ఎక్కువసేపు కూర్చోకుండా ఇతర మార్గాల ద్వారా ఇంటిని చల్లబరుచుకోవాలి.

**ఇన్ఫెక్షన్ ప్రమాదం**

ఎయిర్ కండిషనర్‌లో ఎక్కువసేపు కూర్చోవడం వల్ల ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. ఈ గాలి శ్వాసనాళాల ద్వారా ఊపిరితిత్తుల్లో చేరి సమస్యలు తేగలదు.


తలనొప్పి

ఏసీ వాడకం మరీ ఎక్కువైతే కొందరిలో తలతిరగడం, వాంతులు లేదా తలనొప్పి వంటి సమస్యలను ఎదుర్కోవలసి రావచ్చు.

పొడి చర్మం..ఏసీ గాలి మీ చర్మ ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తుంది. నిజానికి, ఎక్కువసేపు ఎయిర్ కండిషనర్‌లో కూర్చోవడం వల్ల చర్మం పొడిబారుతుంది. ఇలాంటి సమస్యలను నివారించడానికి, మీరు ఏసీ కి బదులుగా ఇండోర్-అవుట్‌డోర్ మొక్కలు, కర్టెన్లను ఉపయోగించాలి. ఇది మీ గది ఇంటికి సహజ చల్లదనాన్ని అందిస్తుంది. అలాగే, ఒక నిర్దిష్ట వ్యవధి తర్వాత ఏసీ ని స్విచ్ ఆఫ్ చేయడం అలవాటు చేసుకోండి.



## ఈగలను తరిమికొట్టండి ఇలా...




ఇంటి తలుపులు, కిటికీలు తెరచి ఉంచాలి. ఒక వెడల్పాటి గిన్నె లేదా మట్టి ప్రమిదను తీసుకుని అందులో అయిదు బిర్యానీ ఆకులు, రెండు చెంచాల వేప లేదా ఆవ నూనె, అయిదు కర్పూరం బిళ్లలు వేసి వెలిగించాలి. ఈ ప్రమిదని ప్రతి గదిలో కొంచెంసేపు ఉంచాలి. ఇందులో నుంచి వచ్చే పొగ వాసనకు ఈగలన్నీ బయటికిపోతాయి.

వంటగది సింక్ లోపల, చెత్తబుట్ట చుట్టూ బేకింగ్ సోడా చల్లి దానిపై నిమ్మ రసాన్ని చుక్కలుగా పిండాలి. నిమ్మకాయ వాసనవల్ల ఈగలు దూరంగా వెళ్లిపోతాయి.

ఒక పళ్లెంలో అయిదు మిరియాలు, నాలుగు వెల్లుల్లి రెబ్బలు వేసి మెత్తగా నూరాలి. ఈ పేస్టుని ఒక స్ప్రే బాటిల్‌లో వేసి నిండుగా నీళ్లు పోయాలి. వంటగది కిటికీల దగ్గర, తలుపుల మీద, సింక్‌లో ఈ నీళ్లు పిచికారీ చేస్తే ఈగలు రావు.

ఒక స్ప్రే బాటిల్‌లో ఉప్పు లేదా కర్పూరం పొడి కలిపిన నీళ్లు పోసి ఈగలు వాలే చోట పిచికారీ చేయాలి. ఈ నీళ్లతో ఇల్లంతా తుడిచినా మంచి ఫలితం కనిపిస్తుంది.



## ద్రాక్షపండ్లను ఇలా తినాలి...

బజారు నుంచి ద్రాక్షపండ్లు తెచ్చాక వాటిని సరైన పద్ధతిలో కడిగిన తరవాతనే తినాలని నిపుణులు సూచిస్తున్నారు. వాటిపై ఉండే పురుగుమందుల అవశేషాల వల్ల ఆరోగ్యానికి హాని కలిగే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

**ద్రాక్షపండ్లను ఇలా తినాలి...**

ముందుగా ద్రాక్షపండ్లను గుత్తినుంచి వేరు చేయాలి. మెత్తగా ఉండి చెడిపోయినవాటిని, సగానికి కోసుకుపోయినవాటిని ఏరివేయాలి.

వెడల్పాటి గిన్నెలో సగానికిపైగా గోరువెచ్చని నీళ్లు పోయాలి. ఇందులో రెండు చెంచాల ఉప్పు, ఒక చెంచా పసుపు, ఒక చెంచా వంటసోడా వేసి బాగా కలపాలి. తరవాత ద్రాక్షపండ్లు వేసి మెల్లగా రుద్దుతూ కడగాలి. రెండు నిమిషాలు అలాగే ఉంచాలి. తరవాత ఈ నీళ్లు తీసివేసి మంచినీళు పోసి మరోసారి కడగాలి. పలుచని గుడ్డమీద ద్రాక్షపండ్లు వేసి తడి ఆరనివ్వాలి. తరవాత ఫ్రిజ్‌లో నిల్వ ఉంచుకోవచ్చు.

పెద్ద గిన్నెలో సగం వరకు నీళ్లు పోసి మూడు చెంచాల వెనిగర్ వేసి బాగా కలపాలి. ఇందులో ద్రాక్షపండ్లు వేసి రెండు నిమిషాలు ఉంచాలి. తరవాత వీటిని మంచినీళ్లతో మరోసారి కడిగి ఆరబెట్టాలి.

ఇలా శుభ్రం చేసిన తరవాతనే ద్రాక్షపండ్లను పిల్లలకు, పెద్దలకు తినిపించాలి.

## భాగ్యనగరానికి అందాల సోయగాలు!

ఈసారి ప్రపంచ సుందరి పోటీలకు భాగ్యనగరం వేదిక కానుంది. మే 7 నుంచి 31 వరకు జరిగే ఈ అందాల పండుగపై అప్పుడే అందరిలోనూ ఆసక్తి నెలకొంది. ప్రపంచ సుందరి పోటీలను రత్‌లో నిర్వహించటం ఇది మూడవసారి. తెలుగు రాష్ట్రాలలో జరగటం ఇదే మొదటిసారి. ఈ పోటీల్లో 120 దేశాలకు చెందిన అందగత్తెలు పాల్గొంటారు. కాగా 1997లో హైదరాబాద్ అమ్మాయి దయానా డెన్ ఈ కిరీటాన్ని దక్కించుకుంది.

పోటీల ప్రస్థానం

ప్రపంచ సుందరి పోటీలు మొదటిసారి 1951లో ఇంగ్లండ్‌లో ప్రారంభమయ్యాయి. ఇంగ్లండ్‌కు చెందిన 'ఎరిక్ మోర్లీ' ఈ పోటీల సృష్టికర్త. 2000 సంవత్సరంలో ఎరిక్ మరణించిన తర్వాత ఆయన భార్య జులియా మోరీ ఈ పోటీలకు సారథ్యం వహిస్తున్నారు. స్వీడన్‌కు చెందిన మోడల్... కికి హకాన్సన్ 1951లో తొలి ప్రపంచ సుందరిగా ఎంపిక అయింది. మొదట్లో ఈ పోటీల పట్ల అనేక విమర్శలు వెల్లువెత్తాయి. కానీ ఈ విమర్శలు ఈ అందాల పోటీల ఆదరణను ఏ మాత్రం తగ్గించలేకపోయాయి. 1990వ దశకంలో సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యంలో మన దేశంలో కూడా ఈ పోటీల పట్ల పెరిగింది. 2000 సంవత్సరం తర్వాత ఈ పోటీలను కేవలం శారీరక సౌందర్యానికి మాత్రమే పరిమితం చేయకుండా మహిళలకు సాధికారత కల్పించే ప్రయత్నంగా చూపించటం మొదలుపెట్టారు. ఒక వ్యక్తికి ఉన్న సామాజిక బాధ్యతను గుర్తుచేసే విధంగా... 'బ్యూటీ విత్ పర్పస్' అనే నినాదాన్ని బాగా ప్రచారంలోకి తీసుకువచ్చారు.




ఎలా ఎంపిక చేస్తారు?

ప్రతి ఏటా సుమారు 120 దేశాలలో 'మిస్ వరల్డ్' ప్రాథమిక అందాల పోటీలు జరుగుతాయి. ఈ పోటీలలో గెలుపొందిన వారికి ఫైనల్స్‌లో పాల్గొనే అవకాశం లభిస్తుంది. వీరందరూ సుమారు మూడు వారాలు జరిగే వేర్వేరు విభాగాల పోటీలలో పాల్గొనాల్సి ఉంటుంది. బీచ్ ఫ్యాషన్, బ్యూటీ విత్ పర్పస్, మల్టీ మీడియా, స్పోర్ట్స్, టాలెంట్, టాప్ మోడల్, కంటెస్టెంట్స్ ఛాయిస్ లాంటి అనేక విభాగాలు ఉంటాయి. ఈ విభాగాలలో విజేతలుగా నిలిచిన వారిని.. వేర్వేరు ఇంటర్వ్యూలలో గెలిచిన వారిని మిస్ వరల్డ్ ఫైనల్స్ పోటీలకు పంపుతారు. వీరి సంఖ్య ఆ ఏడాది పాల్గొనే వారి సంఖ్య ఆధారంగా నిర్ణయిస్తారు. ఈ తుది పోటీలలో న్యాయ నిర్ణేతలు తుది విజేతలను ఎంపిక చేస్తారు. తుది విజేతకు మిస్ వరల్డ్ టైటిల్.. సుమారు 10 కోట్ల రూపాయల బహుమతి, వజ్రాల కిరీటంతో పాటు అనేక రకాల బహుమతులు దక్కుతాయి. ఈ బహుమతుల విలువ ప్రతి ఏడాది మారుతూ ఉంటుంది. ప్రపంచ సుందరిగా గెలిచినవారు... ఆ ఏడాది పొడవునా ప్రపంచ సుందరి సంస్థకు ప్రాతినిధ్యం వహిస్తూ.. ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో పర్యటిస్తారు. వీరిని అనేక బహుళ జాతి కంపెనీలు.. ఐక్యరాజ్య సమితి వంటి సంస్థలు తమ బ్రాండ్ అంబాసిడర్‌లుగా నియమించుకుంటాయి. ప్రపంచ సుందరి పోటీలలో గెలిచిన భామకు ఏడాది పాటు మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించే సంస్థ అనేక సౌకర్యాలు కల్పిస్తుంది. వారికి ఉచిత దుస్తులు, విమాన సౌకర్యం, హెూటల్స్ సౌకర్యం, ఆభరణాల సౌకర్యం, మేకప్ సౌకర్యం, స్టైలింగ్ సౌకర్యం అందిస్తుంది.



## వీటిని కలుపుకొని తాగితే...

గోరువెచ్చని పాలలో చిటికెడు పసుపు కలుపుకొని తాగితే జీర్ణ సమస్యలు రావు. కీళ్ల నొప్పులు, వాపులు కూడా తొందరగా తగ్గుతాయి.

గ్లాసు పాలలో ఒక చెంచా తేనె కలిపి తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. తేనెలోని యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలు జీవక్రియలను వేగవంతం చేస్తాయి.ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో చిటికెడు యాలకుల పొడి కలుపుకుని తాగితే పేగుల్లో అనారోగ్య సమస్యలు రావు. మలబద్ధకం తీరుతుంది.

చిన్న అల్లం ముక్కను తీసుకుని కచ్చాపచ్చాగా దంచి గ్లాసు పాలలో వేసి మరిగించాలి. ఈ పాలను రాత్రి పడుకునే ముందు తాగితే జలుబు, దగ్గు, ఇతర శ్వాసకోశ సమస్యలు, కీళ్లవాతం లాంటి సమస్యలు దరిచేరవు.

ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో రెండు కుంకుమ పువ్వు రేకులు వేసి అయిదు నిమిషాలు నాననివ్వాలి. పాలు బంగారు వర్ణంలోకి మారినతరవాత తాగితే మానసిక ప్రశాంతత లభిస్తుంది. చర్మం మెరుపును సంతరించుకుంటుంది.గ్లాసు పాలలో పావు చెంచా మిరియాల పొడి వేసుకుని తాగితే గొంతు మంట, దగ్గు తగ్గుతాయి.

ఒక అంగుళం పొడవున్న దాల్చిన చెక్క ముక్కను కచ్చాపచ్చాగా దంచి ఒక గ్లాసు పాలలో వేసి రెండు నిమిషాలు మరిగించి తాగితే అధిక బరువు తగ్గుతుంది. శరీరంలో పేరుకున్న కొవ్వు కరిగిపోతుంది.




## జీరో ఫర్ జీరో టారిఫ్ వ్యూహం మెరుగు

**న్యూఢిల్లీ-నవభూమి:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన పరస్పర సుంకాల సమస్యను పరిష్క రిం చుకునేందుకు భారత్‌కు గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ) ఓ సూచన చేసింది. పరస్పర సుంకాలు అమలులోకి రాకముందే యూఎస్‌కు భారత్ 'జీరో ఫర్ జీరో' టారిఫ్ వ్యూహాన్ని ప్రతిపాదిం చాలని సూచించింది. అమెరికాతో పూర్తి స్థాయి ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడం కంటే ఈ ప్రతిపాదనతో నష్టం తక్కువని జీటీఆర్ఐ అభిప్రాయపడింది. ఈ వ్యూహం లో భాగంగా, దేశీయ పరిశ్రమలు, వ్యవసాయ రంగానికి నష్టం జరగకుండా అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటున్న ఏయే ఉత్పత్తులపై సుంకాన్ని పూర్తిగా రద్దు చేయవచ్చని భారత్ గుర్తించాలి. అందుకు బదులుగా, అమెరికా కూడా అదే సంఖ్యలో భారత్ నుంచి దిగుమతి చేసుకుంటున్న ఉత్పత్తులపై సుంకాన్ని పూర్తిగా రద్దు చేయాల్సి ఉంటుంది. భారత్ ఈ జాబితా నుంచి వ్యవసాయ ఉత్పత్తులను చాలా వరకు మినహాయించవచ్చు. ఈ జాబితాను రూపొందించేందుకు జపాన్, కొరి యా, ఆసియాన్‌తో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను పరిశీలించాలని జీటీఆర్ఐ తన నోట్‌లో పేర్కొంది. ఏప్రిల్‌కు ముందే ఈ జాబితాపై అమెరికాతో చర్చించి, ఆమోదం పొందగలిగితే భారత్‌పై పరస్పర సుంకాల ప్రభా వం అతి స్వల్పంగా లేదా దాదాపుగా ఉండకపో వచ్చని జీటీఆర్ఐ వ్యవస్థాపకులు అజ య్ శ్రీవాస్తవ అన్నారు. జీరో ఫర్ జీరో టారిఫ్ వ్యూహం ద్వారా భారత్ 90 శాతం పారిశ్రామిక ఉత్పత్తులపై అధిక సుంకాల భారాన్ని తప్పించవచ్చన్నారు. జీరో ఫర్ జీరో టారిఫ్ వ్యూహం ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) నిబంధనలకు విరుద్ధమైనప్పటికీ, సంక్లిష్టమైన రాయి తీలు, వ్యవసాయ సబ్సిడీల్లో కోత, మేధో సంపత్తి హక్కులను బలహీనపరిచే, సమాచార ప్రవాహ ఆంక్ష లను ఎత్తివేయాల్సి వచ్చే పూర్తి స్థాయి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కంటే తక్కువ నష్టం కలిగించేదన్నారు.




## అలర్ట్.. ఆధార్‌లో మీ నంబర్, పేరు, అడ్రస్ ఎన్నిసార్లు మార్చుకోవచ్చో తెలుసా..




**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రస్తుతం భారతీయులకు ఆధార్ గుర్తింపు కార్డు తప్పనిసరిగా మారిపోయింది. అయితే దీనిని తీసుకుని పదేళ్లు దాటిన వారు సహా ఆధార్‌లో తప్పులు ఉన్న వారు కూడా సరిదిద్దుకోవాలని ఫ్రీ ఛాన్స్ ఇచ్చారు. గతంలో దీని గడువు డిసెంబర్ 14, 2024 వరకు ఉండగా, ఇటీవల జూన్ 14, 2025 వరకు పొడిగించారు. దీంతో మీ ఆధార్ వివరాలను ఉచితంగా అప్‌డేట్ చేసుకునేందుకు జూన్ వరకు సమయం ఉంది.కానీ అప్‌డేట్ చేసుకునే విషయంలో మాత్రం కొన్ని తప్పులు చేయొద్దని నిపుణులు సూచిస్తున్నారు. ఎందుకంటే ఆధార్ అడ్రస్, పేరు, ఫోన్ నంబర్ వంటి వివరాలను మార్పు చేసుకునే విషయంలో పరిమితి ఉందని చెబుతున్నారు. ఈ పరిమితి దాటితే మార్పు చేసుకునేందుకు మళ్లీ ఛాన్స్ ఉండదని అంటున్నారు.ఈ క్రమంలో మీరు ఆధార్‌లో పేరును రెండుసార్లు మాత్రమే మార్చుకోవచ్చు. ఇక పుట్టిన తేదీని అయితే, ఒకసారి మాత్రమే మార్చుకునే ఛాన్సుంది. మరోవైపు ఆధార్ కార్డులో చిరునామాను ఎన్నిసార్లైనా మార్చుకోవచ్చు. మీరు మీ ఆధార్ అప్‌డేట్ చేసుకునే విషయంలో వీటిని తప్పనిసరిగా గుర్తుంచుకోవాలి. లేదంటే తెలియకుండా మీరు డేట్ ఆఫ్ బర్త్ వంటి వివరాలను ఒకసారికి మించి మార్చుకుంటే ఇబ్బందులు పడే అవకాశం ఉంటుంది. ఈ మార్పులు కాకుండా ఏదైనా ప్రత్యేక పరిస్థితుల్లో మరిన్ని మార్పులు అవసరమైతే, మీరు %ఖ×ణూ×% ప్రాంతీయ కార్యాలయం నుంచి అనుమతి తీసుకోవాల్సి వస్తుంది. వారు అనుమతి ఇస్తే మార్పు చేసుకోవచ్చు.
ఫోన్ నంబర్...ఇక ఫోటో మార్పు విషయానికి వస్తే, ఆధార్ కార్డులో ఫోటో మార్చుకోవడానికి, ఎటువంటి పరిమితి లేదు. కానీ సాధారణంగా దీనిని అవసరాన్ని బట్టి మార్చుకోవచ్చు. అయితే ప్రతి మార్పునకు సరైన విధానాన్ని అనుసరించాలి. ఫోటోతో పాటు, మీరు మీ మొబైల్ నంబర్‌ను కూడా మీకు కావలసినన్ని సార్లు అప్‌డేట్ చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో మీరు బయోమెట్రిక్ వివరాలు (వేలిముద్రలు, ఐరిస్ స్కాన్), మొబైల్ నంబర్ అప్‌డేట్ కోసం మీ సమీపంలోని ఆధార్ సేవా కేంద్రాన్ని సందర్శించాలి. మిగతా వివరాలను మీరు ఇంటి వద్దనే ఉండి ఆన్‌లైన్ ద్వారా ఈజీగా మార్చుకునే ఛాన్సుంది.

## ఫిక్స్‌డ్ డిపాజిట్లకు బెస్ట్ బ్యాంకులు ఇవే.. ఖాతాదారులకు ఎంత వడ్డీ ఇస్తున్నాయంటే..?



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రజలకు ఎంతో నమ్మకమైన పెట్టుబడి పథకాల్లో ఫిక్స్ డ్ డిపాజిట్లదే (ఎఫ్ డీలు) అగ్రస్థానం. వివిధ బ్యాంకులు అందించే ఈ పథకాల్లో డబ్బులను ఇన్వెస్ట్ చేయడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. చాలామంది తమ పిల్లల చదువులు, వివాహం, ఇతర అవసరాలకు వీటిలో పెట్టుబడి పెడతారు. మార్కెట్ ఒడిదొడుకులతో సంబంధం లేకుండా నిర్ణీత కాలానికి అసలుతో సహా వడ్డీ పొందే అవకాశం ఉండడం దీనికి కారణం.
ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు ఎఫ్ డీ పథకాలపై ఆధారపడతారు. ఇటీవల రిజర్వ్ బ్యాంకు రెపోరేటును తగ్గించిన నేపథ్యంలో ఎఫ్ డీలపై ఇచ్చే రేట్లు కూడా తగ్గుముఖం పట్టనున్నాయి. అయితే కొన్ని బ్యాంకులు మాత్రం సీనియర్ సిటిజన్లకు 9.10 శాతం వడ్డీ రేటును కొనసాగిస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎఫ్ డీ వడ్డీరేట్లను సవరించిన బ్యాంకులు వివరాలు ఇవీ.సిటీ యూనియన్ బ్యాంకు
ఈ బ్యాంకులో మూడు కోట్ల రూపాయల లోపు ఫిక్స్ డ్ డిపాజిట్లపై వడ్డీరేటును సవరించారు. దాని ప్రకారం.. ఏడు రోజుల నుంచి పదేళ్ల కాలానికి 5 శాతం నుంచి 7.50 శాతం వడ్డీ అందిస్తున్నారు. సీనియర్ సిటిజన్లకు ఏడాదికి 5 శాతం నుంచి 8 శాతం మధ్య అమలు చేస్తున్నారు. 333 రోజుల కాలానికి సాధారణ ఖాతాదారులు 7.50 శాతం, సీనియర్ సిటిజన్లు 8 శాతం వడ్డీని పొందవచ్చు.

**డీసీబీ బ్యాంకు**

ప్రైవేటు బ్యాంకు అయిన డీసీబీ మూడు కోట్ల రూపాయల కంటే తక్కువ ఎఫ్ డీలకు వడ్డీరేట్లు తగ్గించింది. ఎంపిక చేసిన కాల పరిమితులకు మాత్రమే తగ్గింపును వర్తింపజేసింది. సవరించిన రేట్ల తర్వాత ఏడాదికి 3.75 శాతం నుంచి 8.05 శాతం వడ్డీని అమలు చేస్తోంది. అత్యధిక వడ్డీ రేటు 8.05 శాతాన్ని సాధారణ ఖాతాదారులకు 19 నెలల నుంచి 20 నెలల కాలవ్యవధిలో అందజేస్తుంది. అదే సమయంలో సీనియర్ సిటిజన్లు 8.55 శాతం పొందవచ్చు. ఫిబ్రవరి 14 నుంచి వీటిని అమలు చేస్తున్నారు.కర్ణాటక బ్యాంకులో మూడు కోట్ల రూపాయల కంటే తక్కువ డిపాజిట్లకు వడ్డీరేట్లను సవరించారు. ప్రస్తుతం సాధారణ ఖాతాదారులకు 7 రోజుల నుంచి పదేళ్ల డిపాజిట్లపై 3.50 శాతం నుంచి 7.50 శాతం వడ్డీని అందిస్తున్నారు. ఇదే సమయంలో సినియర్ సిటిజన్లకు 3.75 శాతం నుంచి 8 శాతం వర్తింపజేస్తున్నారు. ఈ బ్యాంకులో 401 రోజుల కాలవ్యవధి డిపాజిట్లకు ఈ రేటును ఇస్తున్నారు. కొత్త రేట్లు ఫిబ్రవరి 18 నుంచి అమల్లోకి వచ్చాయి.

**శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్**

ఫిక్స్ డ్ డిపాజిట్లపై వడ్డీరేటును ఈ బ్యాంకు తగ్గించింది. ఆ ప్రకారం సాధారణ పౌరులకు ఏడాదికి 3.50 శాతం 8.55 శాతం వరకూ, సీనియర్ సిటిజన్లకు 4 శాతం నుంచి 9.05 శాతం వరకూ వడ్డీని అందజేస్తోంది. 12 నెలల ఒక్క రోజు నుంచి 18 నెలల కంటే తక్కువ కాలవ్యవధి డిపాజిట్లపై సాధారణ ప్రజలు 8.50 శాతం అత్యధిక వడ్డీ పొందవచ్చు. అదే సమయంలో సీనియర్ సిటిజన్లకు 9.05 శాతం వడ్డీని అందిస్తున్నారు. సవరించిన వడ్డీరేట్లు ఫిబ్రవరి 18 నుంచి అమలు చేస్తున్నారు.

**ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్**

ఫిక్స్ డ్ డిపాజిట్లతో పాటు సేవింగ్స్ ఖాతా వడ్డీరేట్లను ఈ బ్యాంకు సవరించింది. సాధారణ పౌరులకు ఏడాదికి 3.75 శాతం నుంచి 8.25 శాతం వరకూ, సీనియర్ సిటిజన్లకు 4.25 శాతం నుంచి 8.75 శాతం వడ్డీని అందిస్తోంది. 18 నెలల కాలానికి సాధారణ ఖాతాదారులు (8.25 శాతం), సీనియర్ సిటిజన్లు (8.75 శాతం) అత్యధిక వడ్డీని పొందవచ్చు. పొదుపు ఖాతాలకు 3.25 శాతం నుంచి 7.50 శాతం వడ్డీని ఇస్తుంది. మూడు కోట్ల రూపాయల లోపు ఫిక్స్ డ్ డిపాజిట్లపై వీటిని అమలు చేస్తోంది.

# వ్యక్తిగత రుణమా? తాకట్టు రుణమా? ఏది బెటర్!




**న్యూఢిల్లీ-నవభూమి:** అప్పులేని వాడు ఉత్తముడంటారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో ఇది అందరికీ వర్తించదు. ఎప్పుడు ఏ అవసరం వస్తుందో తెలియదు. అలాంటప్పుడు అందరి దగ్గరా సరిపడా డబ్బులు ఉండకపోవచ్చు. అప్పుడు ఎంతో కొంత అప్పు చేయక తప్పదు. అయితే ఈ అప్పు వ్యక్తిగత రుణమా? లేక తాకట్టు రుణమా? అనేది పెద్ద ప్రశ్న.ఒక్కోసారి కొన్ని ఆర్థిక అవసరాలు ఆకస్మికంగా వచ్చిపడుతుంటాయి. అప్పుడు ఏ హామీ లేకుండా వ్యక్తిగత రుణం తీసుకోవాలా? లేక ఆస్తులు హామీగా పెట్టి తాకట్టు రుణం తీసుకోవాలా? అనే సందేహాలు వస్తుంటాయి. ఎందుకంటే ఈ రెండింటిలో దేనిలో ఉండే లాభనష్టాలు దానిలో ఉన్నాయి. ఈ రుణాల స్వరూప, స్వభావాలు తెలుసుకుంటే.. ఎప్పుడు ఏ రుణం తీసుకోవాలో తేలికగా నిర్ణయించుకోవచ్చు. ఇప్పుడు ఒక్కో రుణంలో ఉండే లాభనష్టాలు తెలుసుకుందాం.

**వ్యక్తిగత రుణాలు**

ఈ రుణాల కోసం ఎలాంటి ఆస్తులను హామీగా చూపించాల్సిన అవసరం లేదు. గతంలో తీసుకున్న రుణాల్ని చక్కగా చెల్లించిన చరిత్ర, మంచి పరపతి (సిబిల్) స్కోరు ఉంటే చాలు. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ రుణాలు ఇస్తాయి. అయినా రుణదాతలు ఈ రుణాలను కొద్దిగా రిస్కీ రుణాలుగా చూస్తారు. అందుకే మిగతా రుణాలతో పోలిస్తే ఈ రుణాలపై వడ్డీ రేట్లు కొద్దిగా ఎక్కువ.
ప్రధానాంశాలు: ఇవి పూర్తిగా హామీ లేని రుణాలు. ఈ రుణాల కోసం బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలకు ఎలాంటి ఆస్తులను హామీగా చూపాల్సిన అవసరంగానీ, తాకట్టు పెట్టాల్సిన అవసరం గానీ లేదు. కాబట్టి ఈ రుణాలు చెల్లించలేకపోయినా ఆస్తులు పోగొట్టుకుంటామనే భయం ఉండదు.
**త్వరగా ఆమోదం:** వ్యక్తిత రుణాల దరఖాస్తు ప్రక్రియ చాలా సులభం. కొన్ని బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలైతే మీ ఆధార్, పాన్ కార్డు ఇస్తే చాలు. వీలైనంత త్వరగా రుణాలు మంజూరు చేసి, ఖాతాదారుల ఖాతాల్లో జమ చేస్తున్నాయి.వెసులుబాటు: వ్యక్తిగత రుణాలను మన అవసరాలను బట్టి ఎలాగైనా ఉపయోగించుకోవచ్చు. ఫలానా అవసరం కోసం మాత్రమే మేము ఇచ్చిన ఈ రుణాలు వాడుకోవాలని బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఆంక్షలు పెట్టవు.

**గమనించాల్సిన విషయాలు..**

అధిక వడ్డీ రేటు: వ్యక్తిగత రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఎలాంటి షూరిటీ లు అడగవు. తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించిన చరిత్ర, మంచి పరపతి స్కోరు ఉంటే చాలు. అయినా ఈ రుణాలను నష్ట భయం (రిస్క్) ఉన్న రుణాలుగానే పరిగణిస్తారు. దీంతో మిగతా రుణాల తో పోలిస్తే ఈ రుణాలపై వడ్డీ రేటు కొద్దిగా ఎక్కువగానే ఉంటుంది. ప్రస్తుతం బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు వ్యక్తిగత రుణాలపై ఆయా వ్యక్తుల పరపతి చరిత్ర, పరపతి స్కోరు ఆధారంగా 11 నుంచి 17 శాతం వరకు వడ్డీ రేటు వసూలు చేస్తున్నాయి.
రుణ పరిమితి: సెక్యూర్డ్ లోన్లతో పోలిస్తే హామీ లేని రుణాలను బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు కొద్ది మొత్తంలోనే ఇస్తుంటాయి. అది కూడా ఆయా వ్యక్తు ల ఆదాయం, పరపతి సామర్థ్యాలపై ఆధారపడి ఉంటుంది.పరపతి స్కోరు: పరపతి స్కోరు, రుణాల తిరిగి చెల్లింపు చరిత్ర ఎంత బాగుంటే అంత సులభమైన షరతులతో వ్యక్తిగత రుణాలు లభిస్తాయి. ఈ రెంటి లో ఏ మాత్రం తేడా కనిపించినా 'సారీ, మీకు రుణం ఇవ్వడం మా వల్ల కాదు' అని ముఖానే చెప్పేస్తాయి. లేదంటే స్కోరు ఒక మాదిరిగా ఉన్నా అధిక వడ్డీ వసూలు చేస్తాయి.

**తాకట్టు రుణాలు**

ఏదో ఒక ఆస్తిని తాకట్టు లేదా హామీగా చూపితే గానీ ఈ రుణాలు పొందలేం. సాధారణంగా ఈ రుణాల కోసం ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేదా ఇతర స్థిరాస్తులను హామీగా చూపించాలి. కొత్త ఆస్తుల కొనుగోలు లేదా తాకట్టులో ఉన్న ఆస్తులను విడిపించుకునేందుకు ఈ తరహా రుణాలు ఉపయోగపడతాయి.
హామీతో కూడిన రుణాలు: ఈ రుణాల చెల్లింపునకు పూర్తి హామీ ఉంటుంది. చెల్లింపుల్లో ఏ మాత్రం విఫలమైనా బ్యాంకు లేదా ఎన్‌బీఎఫ్‌సీ హామీగా పెట్టిన ఆస్తులను వేలం వేసి తమకు రావాల్సిన ప్రతి పైసా రాబట్టుకుంటుంది. దీంతో మిగతా రుణాలతో పోలిస్తే ఈ రుణాలపై వడ్డీ రేటు తక్కువ.
ఎక్కువ రుణం: రుణ చెల్లింపునకు ఏదో ఒక ఆస్తిని హామీగా పెడుతున్నాం కాబట్టి, ఎక్కువ మొత్తంలోనే రుణం తీసుకోవచ్చు. హామీగా పెట్టే ఆస్తి విలువ ఎంత ఎక్కువ ఉంటే, బ్యాంకులు ఇచ్చే తాకట్టు రుణ మొత్తమూ అంత ఎక్కువగా ఉంటుంది.

## జియోలో 5 ఉత్తమ రీఛార్జ్ ప్లాన్లు.. 28 రోజుల నుండి 365 రోజుల వరకు చెల్లుబాటు!




**న్యూఢిల్లీ-నవభూమి:** టెలికాం రంగంలో అతిపెద్ద కంపెనీ రిలయన్స్ జియో. రిలయన్స్ జియోకు అత్యధిక సంఖ్యలో కస్టమర్లు ఉన్నారు. మీరు జియో సిమ్ ఉపయోగిస్తుంటే ఎన్నో రీఛార్జ్ ప్లాన్స్ ఉన్నాయి. అటువంటి పరిస్థితిలో కొన్నిసార్లు చౌకైన ప్రణాళికలను కనుగొనడం చాలా కష్టం అవుతుంది. జియో జాబితా నుండి 5 చౌకైన, సరసమైన ప్రణాళికల గురించి తెలుసుకుందాం..యో రూ. 3599 ప్లాన్: జియోలో వార్షిక ప్లాన్ తీసుకోవడానికి ఇష్టపడే చాలా మంది వినియోగదారులు ఉన్నారు. మీరు అలాంటి వినియోగదారు అయితే 2025 లో రూ. 3599 ప్లాన్ మీకు ఉత్తమ ఎంపిక కావచ్చు. ఈ జియో రీఛార్జ్ ప్లాన్‌తో మీరు 365 రోజుల పాటు రీఛార్జ్ చేసే టెన్షన్‌ను పూర్తిగా తొలగించుకోవచ్చు. ఈ ప్లాన్ లో మీకు రోజుకు 2.5%+దీ% డేటాతో పాటు అపరిమిత ఉచిత కాల్స్ లభిస్తాయి.
జియో రూ. 3599 ప్లాన్: జియోలో వార్షిక ప్లాన్ తీసుకోవడానికి ఇష్టపడే చాలా మంది వినియోగదారులు ఉన్నారు. మీరు అలాంటి వినియోగదారు అయితే 2025 లో రూ. 3599 ప్లాన్ మీకు ఉత్తమ ఎంపిక కావచ్చు. ఈ జియో రీఛార్జ్ ప్లాన్‌తో మీరు 365 రోజుల పాటు రీఛార్జ్ చేసే టెన్షన్‌ను పూర్తిగా తొలగించుకోవచ్చు. ఈ ప్లాన్ లో మీకు రోజుకు 2.5%GB% డేటాతో పాటు అపరిమిత ఉచిత కాల్స్ లభిస్తాయి.రూ.2025 రీఛార్జ్ ప్లాన్: జియో ఇటీవల తన కస్టమర్ల కోసం దీర్ఘకాలిక చెల్లుబాటుతో ఈ గొప్ప ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. 2025 రీఛార్జ్ చేయడం ద్వారా కొత్త సంవత్సరంలో పదే పదే రీఛార్జ్ చేసుకునే ఇబ్బందిని నివారించవచ్చు. ఈ రీఛార్జ్ ప్లాన్‌లో మీకు 200 రోజుల చెల్లుబాటు లభిస్తుంది. ఈ ప్లాన్ లో మీకు అపరిమిత ఉచిత కాలింగ్, రోజుకు 100 ఉచిత %SMS%లు లభిస్తాయి.
రూ.2025 రీఛార్జ్ ప్లాన్: జియో ఇటీవల తన కస్టమర్ల కోసం దీర్ఘకాలిక చెల్లుబాటుతో ఈ గొప్ప ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. 2025 రీఛార్జ్ చేయడం ద్వారా కొత్త సంవత్సరంలో పదే పదే రీఛార్జ్ చేసుకునే ఇబ్బందిని నివారించవచ్చు. ఈ రీఛార్జ్ ప్లాన్‌లో మీకు 200 రోజుల చెల్లుబాటు లభిస్తుంది. ఈ ప్లాన్ లో మీకు అపరిమిత ఉచిత కాలింగ్, రోజుకు 100 ఉచిత ు లభిస్తాయి. ఇది మీకు స్ట్రీమింగ్ కోసం సినిమా సబ్‌స్క్రిప్షన్‌ను కూడా ఇస్తుంది.జియో రూ.999 ప్లాన్: దీర్ఘకాలిక చెల్లుబాటు కోరుకునే వినియోగదారులు జియో రూ.999 ప్లాన్‌ను ఎంచుకోవచ్చు. 999 రీఛార్జ్ ప్లాన్‌ను ఎంచుకోవచ్చు. ఈ ప్లాన్ లో మీకు 98 రోజుల చెల్లుబాటు లభిస్తుంది. ఒకేసారి దాదాపు 100 రోజులు రీఛార్జ్ చేయడం వల్ల కలిగే ఇబ్బంది నుండి మీరు విముక్తి పొందుతారు. 98 రోజుల పాటు ఏ నెట్‌వర్క్‌కైనా అపరిమిత కాల్స్ చేసుకోవచ్చు. దీనిలో మీకు ప్రతిరోజూ 2%GB% డేటా లభిస్తుంది. దీనిలో మీరు ప్రతిరోజూ 100 ఉచిత %హామీ%లను కూడా పొందుతారు.జియో రూ.999 ప్లాన్: దీర్ఘకాలిక చెల్లుబాటు కోరుకునే వినియోగదారులు జియో రూ.999 ప్లాన్‌ను ఎంచుకోవచ్చు. 999 రీఛార్జ్ ప్లాన్‌ను ఎంచుకోవచ్చు. ఈ ప్లాన్ లో మీకు 98 రోజుల చెల్లుబాటు లభిస్తుంది. ఒకేసారి దాదాపు 100 రోజులు రీఛార్జ్ చేయడం వల్ల కలిగే ఇబ్బంది నుండి మీరు విముక్తి పొందుతారు. 98 రోజుల పాటు ఏ నెట్‌వర్క్‌కైనా అపరిమిత కాల్స్ చేసుకోవచ్చు. దీనిలో మీకు ప్రతిరోజూ 2%GB% డేటా లభిస్తుంది. దీనిలో మీరు ప్రతిరోజూ 100 ఉచిత లను కూడా పొందుతారు.
**జియో రూ.899 ప్లాన్:** ఈ ప్లాన్‌ను ఎక్కువగా ఇష్టపడుతుంటారు. ఇది ఆల్ రౌండర్ రీఛార్జ్ ప్లాన్. దీనిలో మీరు దీర్ఘకాల చెల్లుబాటు, డేటా, ఉచిత కాలింగ్, అనేక ఇతర ప్రయోజనాలను పొందుతారు. ఈ ప్లాన్ 90 రోజుల వరకు చెల్లుబాటుతో పాటు ఏ నెట్‌వర్క్‌కైనా అపరిమిత కాలింగ్‌ను అందిస్తుంది. ఈ ప్లాన్ రోజుకు 2%GB% డేటాను అందిస్తుంది. దీనితో పాటు, మొత్తం ప్యాక్‌లో అదనంగా 20%GB% డేటా అందించబడుతుంది. ఇందులో జియో సినిమా, జియో టీవీ, జియో క్లౌడ్ సబ్‌స్క్రిప్షన్ కూడా ఉంటుంది.

## అంతర్జాతీయ మార్కెట్ ఎఫెక్ట్.. బంగారం ధరలు ఎలా ఉన్నాయంటే..



**న్యూఢిల్లీ-నవభూమి:** బిజినెస్ డెస్క్: రెండ్రోజులుగా తగ్గుతూ వస్తున్న బంగారం ధరలు ఆదివారం స్థిరంగా కొనసాగుతున్నాయి. పసిడి ధరలను అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి, రాజకీయ, భౌగోళిక ఉద్రిక్తతలు వంటివి ప్రభావితం చేస్తుంటాయి. ఈ నేపథ్యంలో కొన్ని నెలలుగా గోల్డ్ ధరలు ఆకాశాన్ని అంటాయి. నూతనంగా ఎన్నికైన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన నిర్ణయాలతో బంగారానికి భారీగా డిమాండ్ ఏర్పడింది. ట్రంప్ నిర్ణయాలతో స్టాక్ మార్కెట్లు కుప్పకూలిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీంతో పసిడిని సురక్షితమైన పెట్టుబడిగా భావిస్తున్న మదుపరులు దాన్ని అధికంగా కొనుగోలు చేస్తున్నారు. అందుకే ఒక్కసారిగా డిమాండ్ ఏర్పడి బంగారం రేట్లు అమాంతం పెరిగిపోతున్నాయి.
కాగా, https://bullions.co.in ప్రకారం.. ఇవాళ (23-02-2025) ఉదయం 06:30 గంటల సమయానికి దేశ రాజధాని ఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.78,769 కాగా, 24 క్యారెట్ల తులం పసిడి ధర రూ.85,930గా ఉంది. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ.79,026 ఉండగా.. 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.86,210గా ఉంది. మరోవైపు వెండి ధరలూ నేడు స్థిరంగా కొనసాగుతున్నాయి. ఢిల్లీలో కిలో వెండి ధర రూ.96,280 గా ఉంది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో కేజీ వెండి ధర రూ.96,600 వద్ద కొనసాగుతోంది. అలాగే దేశ ఆర్థిక రాజధాని ముంబైలో కిలో వెండి రూ.96,450కు చేరింది.
ప్రధాన నగరాల్లో బంగారం (22, 24 క్యారెట్ల) ధరలు..
చెన్నై- రూ.79,136, రూ.86,330
బెంగళూరు- రూ.78,962, రూ.86,140
కోల్‌కతా- రూ.78,797, రూ.85,960
భోపాల్- రూ.78,989, రూ.86,170
భువనేశ్వర్- రూ.78,925, రూ.86,100
తిరువనంతపురం-రూ.79,145, రూ.86,340
ముంబై- రూ.78,907, రూ.86,080
పుణె- రూ.78,907, రూ.86,080
జైపూర్- రూ.78,888, రూ.86,060
పట్నా- రూ.78,861, రూ.86,030

## చిరాకు పెట్టించే ప్రకటనలకు చెక్ పెట్టేద్దామా..యూట్యూబ్‌లో నయా ప్లాన్




**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రపంచ వ్యాప్తంగా ప్రజలందరికీ యూట్యూబ్ సుపరిచితమే. స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ ఈ సోషల్ మీడియా ప్లాట్ ఫాంను వినియోగించుకుంటారు. మన వీడియోలను దీనిలో పోస్టు చేసి ఇతరులతో పంచుకోవచ్చు. చదువు, వినోదం, వ్యాపారం, శుభకార్యాలు, పర్యటనలు, జనరల్ నాలెడ్జ్.. ఇలా ప్రతి అంశాన్ని పోస్టు చేసుకోవచ్చు. సాధారణంగా యూజర్లందరికీ యూట్యూబ్ సేవలు ఉచితంగా అందుతాయి. అయితే ప్రకటనలు లేకుండా కంటెంట్ చూడాలనుకుంటే మాత్రం కొంత సొమ్ము చెల్లించాలి. దానికోసం యూట్యూబ్ వివిధ ప్లాన్లను అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో గతంలో అమలు చేసిన ప్రీమియం లైట్ ప్లాన్ తిరిగి తీసుకు వస్తోంది.గూగుల్ సంస్థ తన యూట్యూబ్ యూజర్ల కోసం ప్రీమియం లైట్ ప్లాన్ ను తిరిగి తీసుకువస్తోంది. యూట్యూబ్ మ్యూజిక్ తో సహా ఇతర సేవలు అవసరం లేని వారికి ఇది చాలా ఉపయోగంగా ఉంటుంది. దీని ద్వారా వినియోగదారులు ఎటువంటి ప్రకటనలు లేకుండా పాస్ట్ కాస్టులు, బోధనా కంటెంట్ తో పాటు అనేక వీడియోలను వీక్షించే అవకాశం ఉంటుంది. అయితే ఈ ప్లాన్ లో మ్యూజిక్ వీడియోలకు అవకాశం ఉండదు. విశ్వసనీయ సమాచారం ప్రకారం అమెరికా, ఆస్ట్రేలియా, జర్మనీ, థాయిలాండ్ దేశాల్లో యూట్యూబ్ ప్రీమియం లైట్ ప్లాన్ ను ప్రారంభిస్తారు. కొంత కాలంగా ప్రకటన రహిత సభ్యత్వాలను యూట్యూబ్ గమనిస్తోందని, ధానికి అనుగుణంగా యూజర్లకు మెరుగైన సేవలు అందించేందుకు కొత్త ప్లాన్ తీసుకు వస్తున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం అమెరికాలో నెలకు 13.99 డాలర్ల యూట్యూబ్ ప్రీమియం ప్లాన్ అమలవుతుంది. దానికి ప్రత్యామ్నాయం కోరుకునే వారికి, మ్యూజిక్ కంటెంట్ ను చూడని వారిని కొత్త ప్లాన్ బాగా ఉపయోగపడుతుంది.యూట్యూబ్ గతంలోనూ తక్కువ ప్రీమియం ప్లాన్ ను అమలు చేసింది. 2021లో బెల్జియం, డెన్మార్క్, ఫిన్లాండ్, లక్సెంబర్గ్, నెదర్లాండ్స్, నార్వే, స్వీడన్ లతో పాటు ఎంపిక చేసిన యూరోపియన్ దేశాలలో ప్రీమియం లైట్ ప్లాన్ ను తీసుకువచ్చింది. దీని ద్వారా వినియోదారులకు ప్రకటనలు లేకుండా కంటెంట్ ను చూసే అవకాశం కలిగింది. అయితే ఆఫ్ లైన్ డౌన్ లోడ్ లు, ప్లే బ్యాక్, యూట్యూబ్ మ్యూజిక్ వంటి వాటికి అవకాశం లేకుండా పోయింది. దాదాపు రెండేళ్ల తర్వాత 2023 అక్టోబర్ లో ప్రీమియం లైట్ ప్లాన్ ను యూట్యూబ్ నిలిపివేసింది. భాగస్వాములు, వినియోగదారుల అభిప్రాయం మేరకు ఆ ప్లాన్ విధానాన్ని మరింత మెరుగుపర్చాలని నిర్ణయం తీసుకుంది. సబ్ స్క్రైబర్ల లైట్ ప్లాన్ ను రద్దు చేసే ముందు వారికి నెల రోజుల పాటు పూర్తి ఉచితంగా అందజేసింది.యూట్యూబ్ ప్రీమియం లైట్ ప్లాన్ ను మళ్లీ తీసుకువస్తున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో దాని విధానాలపై అందరికీ ఆసక్తి నెలకొంది. ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిన తర్వాత మన దేశానికి వస్తుందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఇండియాలో నెలకు రూ.149, మూడు నెలలకు రూ.459, ఏడాదికి రూ.1490 కు ప్రీమియం సబ్ స్క్రిప్షన్ అందజేస్తోంది. అలాగే ఐదుగురు అదనపు సభ్యులకు నెలకు రూ.299, అర్హత కలిగిన విద్యార్థులకు నెలకు రూ.89కి ప్లాన్లను అమలు చేస్తోంది.

## గ్రాన్యూల్స్ గూటికి స్విస్ కంపెనీ


GRANULES

**న్యూఢిల్లీ-నవభూమి:** స్విట్జర్లాండ్‌కు చెందిన సీడీఎంఓ (కాంట్రాక్ట్ రీసెర్చ్, డెవల్‌పమెంట్ అండ్ మాన్యుఫాక్చరింగ్) సేవల కంపెనీ 'సెన్ కెమికల్స్ ఏజీ'ని 2 కోట్ల స్విస్ ఫ్రాంక్‌లకు (సుమారు రూ.192 కోట్లు) కొనుగోలు చేసినట్లు హైదరాబాద్‌కు చెందిన ఔషధ సంస్థ గ్రాన్యూల్స్ ఇండియా శుక్రవారం ప్రకటించింది. తద్వారా గ్రాన్యూల్స్ కూడా సీడీఎంఓ విభాగంలోకి ప్రవేశించినట్లైంది. సెన్ కెమికల్స్ తన గ్లోబల్ కస్టమర్ల కోసం పెప్టైడ్స్, పెప్టైడ్స్ ఆధారిత అప్లికేషన్లను అభివృద్ధి చేయడంతో పాటు ఉత్పత్తి చేస్తుంది. ఈ ప్రథమార్థంలోనే డీల్ పూర్తి కావచ్చని గ్రాన్యూల్స్ వెల్లడించింది.

## మార్చి 2025లో బ్యాంకు సెలవులు.. ఈసారి ఎన్ని రోజులంటే..

**న్యూఢిల్లీ-నవభూమి:** మరికొన్ని రోజుల్లో ఫిబ్రవరి నెల పూర్తి కాబోతుంది. ఈ క్రమంలో వచ్చే మార్చిలో ఎన్ని రోజులు బ్యాంకులకు సెలవులు ఉన్నాయి. ఎన్ని రోజులు పనిచేయనున్నాయనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం. ఈ సెలవుల్లో రెండో, నాల్గో శనివారాలతోపాటు ఆదివారం, ఇతర పండుగలు కూడా ఉన్నాయి. అయితే ఈసారి మార్చి 2025లో 13 రోజులు సెలవులు వచ్చాయి. మిగతా రోజుల్లో బ్యాంకులు పనిచేయనున్నాయి. కానీ ఈ సెలవులు ఆయా రాష్ట్రాలను బట్టి మారుతుంటాయి.

## సంపన్నులు అత్యధికంగా ఉన్న దేశాలు ఇవే



**న్యూఢిల్లీ-నవభూమి:** వివిధ దేశాల్లోని సంపన్నులకు ఆర్థిక, రాజకీయ పరిస్థితులను ప్రభావితం చేసే శక్తి ఉంటుందనడంలో ఎటువంటి సందేహం లేదు. మరోవైపు పెట్టుబడి దారి అనుకూల వ్యవస్థ కారణంగా ప్రపంచంలో ఏటా సంపన్నుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఎలాన్ మస్క్, జెఫ్ బెజోస్ వంటి ఎందరో సంపన్నులు తమ సృజనాత్మకత, వ్యాపారదక్షత, వ్యూహాలతో అపార సంపదను సొంతం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఫోర్బ్స్ పత్రిక అపర సంపన్నులు ఉన్న దేశాల జాబితాను విడుదల చేసింది.అత్యధిక సంపన్నులు ఉన్న దేశంగా అమెరికా తొలి స్థానంలో ఉంది. అక్కడ బిలియనీర్ల సంఖ్య 813. వారి నికర సంపద విలువ 5.7 ట్రిలియన్ డాలర్లు. అమెరికాలో అత్యధిక ధనవంతుడిగా ఉన్న మస్క్ సంపద విలువ 195 బిలియన్ డాలర్లురెండో స్థానంలో ఉన్న చైనాలో అపర కుబేరుల సంఖ్య 406. వారి నికర సంపద విలువ 1.3 ట్రిలియన్ డాలర్లు. చైనాలో అత్యంత ధనవంతుడు ఝాంగ్ షాన్సన్ సంపద విలువ 62.3 బిలియన్ డాలర్లు ఈ జాబితాలో మూడో స్థానంలో ఉన్న భారత్‌లో బిలియనీర్ల సంఖ్య 200. గతేడాదితో పోలిస్తే కొత్తగా 31 మంది బిలియనీర్లుగా మారారు. భారతీయ బిలియనీర్ల నికర సంపద 954 బిలియన్ డాలర్లు. భారత్‌లో అత్యంత సంపన్నుడైన ముఖేశ్ అంబానీ సంపద విలువ 116 బిలియన్ డాలర్లుజర్మనీలో గతేడాది 126 మంది బిలియనీర్లు ఉండగా ఈసారి వీరి సంఖ్య 132కు చేరుకుంది. జర్మనీ బిలియనీర్ల నికర సంపద విలువ 585 బిలియన్ డాలర్లు. 39.2 బిలియన్ డాలర్ల సంపద కలిగిన క్లాస్ మైఖేల్ క్యూహెన్ జర్మనీలో అత్యంత సంపన్నుడిగా నిలిచాడు.రష్యన్ బిలియనీర్ల సంఖ్య 120కి పెరిగింది. గతేడాది 105 మంది బిలియనీర్లే ఉన్నారు. అక్కడి బిలియనీర్ల నికర సంపద 537 బిలియన్ డాలర్లు. వేజిట్ అలెక్‌పెరోవ్ అత్యంత సంపన్న రష్యన్.



## కేంద్ర మంత్రికి విమానంలో విరిగిన సీటు



**న్యూఢిల్లీ-నవభూమి:** విమానయాన సంస్థ ఎయిరిండియాపై కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ మండిపడ్డారు. తాను ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు భోపాల్ నుంచి ఢిల్లీకి ప్రయాణించిన సమయంలో తనకు విరిగిన, కిందకు దిగిపోయిన సీటు కేటాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది అనైతికమని, ప్రయాణికుల నుంచి పూర్తి చార్జీ వసూలు చేసే సంస్థ.. వారికి విరిగిపోయిన సీట్లు కేటాయించడం మోసగించడమేనంటూ తనకు ఎదురైన అనుభవాన్ని శనివారం ఎక్స్ వేదికగా పంచుకున్నారు. తన సీటే కాకుండా విమానంలోని మరికొన్ని సీట్లు కూడా ఇదేవిధంగా ఉన్నాయని శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. తోటి ప్రయాణికులు తమ సీటులో కూర్చోమని ఆఫర్ చేశారని, అయితే వారికి ఇబ్బంది కలిగించకూడదనే ఉద్దేశంతో తాను ఆ విరిగిన సీటులోనే ప్రయాణం చేశానని తెలిపారు. దీనిపై ఎయిరిండియా క్షమాపణలు చెప్పింది. ఈ వ్యవహారంపై నివేదిక ఇవ్వాలని డీజీసీఏ ఎయిరిండియా విమాన సంస్థను ఆదేశించింది.

## మరోసారి శ్రీలంక అత్యుత్సాహం.. 32 మంది భారతీయ మత్స్యకారులను అరెస్ట్..!



**న్యూఢిల్లీ-నవభూమి:** శ్రీలంక -భారతదేశం మధ్య సంబంధాలు ఇంకా సాధారణ స్థితికి రాలేదు. పొరుగు దేశ అధికారులు ఆదివారం(ఫిబ్రవరి 23) శ్రీలంక జలాల్లోకి ప్రవేశించారనే ఆరోపణలపై 32 మంది భారతీయ మత్స్యకారులను అరెస్టు చేశారు. వారి నుంచి ఐదు ఫిషింగ్ బోట్లను స్వాధీనం చేసుకున్నారు. దీంతో మత్స్యకారుల కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. ఈ విషయం గురించి సమాచారం ఇస్తూ, శ్రీలంక నావికాదళం ఒక ప్రకటన విడుదల చేసింది. మన్నార్‌కు ఉత్తరాన ఉన్న సముద్ర ప్రాంతంలో ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి ఈ వ్యక్తులను అరెస్టు చేసినట్లు తెలిపింది. "ఐదు భారతీయ ఫిషింగ్ బోట్లను స్వాధీనం చేసుకున్నారు. 32 మంది భారతీయ మత్స్యకారులను అరెస్టు చేశారు" అని ప్రకటనలో పేర్కొన్నారు. అరెస్టు చేసిన మత్స్యకారులను, వారి పడవలను తలైమన్నార్ పీర్‌కు తీసుకువచ్చామని, చట్టపరమైన చర్యల కోసం వారిని మన్నార్ ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగిస్తామని శ్రీలంక నేవీ తెలిపింది. ఈ ప్రకటన ప్రకారం, ఈ సంవత్సరం ఇప్పటివరకు నేవీ 131 మంది భారతీయ జాలర్లను అరెస్టు చేశారు. శ్రీలంక జలాల్లో అక్రమంగా చేపలు పట్టడంలో పాల్గొన్న 18 పడవలను స్వాధీనం చేసుకుంది. భారతదేశం శ్రీలంక మధ్య మత్స్యకారుల సమస్య వివాదాస్పద అంశంగా ఉంది. శ్రీలంక నావికాదళ సిబ్బంది పాక్ జలసంధి ప్రాంతంలో భారత జాలర్లపై కాల్పులు జరిపి, శ్రీలంక జలాల్లోకి అక్రమంగా ప్రవేశించారనే ఆరోపణలతో అనేక సార్లు వారి పడవలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంవత్సరం ప్రారంభం నుండి, శ్రీలంక నావికాదళం 131 మంది మత్స్యకారులను అరెస్టు చేసి, 20 ట్రాలర్లను స్వాధీనం చేసుకుంది. ఈసారి అరెస్టయిన 32 మంది మత్స్యకారులు తమిళనాడుకు చెందినవారుగా భావిస్తున్నారు. తమ సహచరులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర జాలర్లు ఆదివారం సమావేశం నిర్వహించారు.

## ప్రియుడితో మైనర్ బాలికల శృంగారం తప్పుకాదు!



**ముంబై-నవభూమి:** మైనర్ బాలికలు వాళ్ల ఇష్టప్రకారం శృంగారం చేస్తే అది తప్పు కాదంటూ ముంబై హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. ప్రియుడితో ఇష్టంగా రతిలో పాల్గొనడం తప్పు కాదని తేల్చిచెప్పింది. 2019లో ఓ వ్యక్తిపై పోక్సో చట్టం కింద నమోదైన కేసు విచారణలో భాగంగా న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. 24 ఏళ్ల యువకుడు మైనర్ బాలికపై లైంగిక దాడి చేసిన ఆరోపణలపై అరెస్ట్ అయ్యాడు. అతనికి ముంబై హైకోర్టు బెయిల్ మంజూరు చేయడం చర్చనీయాంశమైంది. బాధితురాలు మైనర్ అయినప్పటికీ పరస్పరం ఇష్టంతో శృంగారంలో పాల్గొన్నప్పుడు నిందితుడికి బెయిల్ ఇవ్వొచ్చని న్యాయమూర్తి జస్టిస్ మిళింద్ స్పష్టం చేశారు. 2019లో కేసు నమోదు అయినప్పుడు బాధిత బాలిక వయసు 14 ఏళ్లు, యువకుడికి 19 ఏళ్లు. ఇద్దరు ప్రేమించుకున్నారు, ఈ క్రమంలోనే ఆ బాలిక యువకుడితో మూడు రోజులు గడిపింది. ఈ క్రమంలో ఆమె పేరెంట్స్ యువకుడిపై లైంగిక దాడి కేసు పెట్టగా పోలీసులు అరెస్ట్ చేసి ఐదేళ్లు జైల్లో పెట్టారు. ఈ కేసు విచారణ శనివారం జరగగా.. బాలిక మైనర్ అయినప్పటికీ అన్నీ తెలిసే చేసినప్పుడు నేరంగా ఎలా పరిగణిస్తామంటూ హైకోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుతం హైకోర్టు చేసిన ఈ వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇలాంటి వ్యాఖ్యలు పిల్లలపై చెడు ప్రభావం చూపుతాయని కొంతమంది తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## వాహనం రిజిస్టరై 20 ఏళ్లు దాటితే..



**హైదరాబాద్-నవభూమి:** 20 ఏళ్ల వయసు దాటిన వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్(ఆర్‌సీ) రెన్యూవల్ చార్జీలను పెంచాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ఇటీవలే ముసాయిదాను విడుదల చేసింది. ముసాయిదాకు ఆమోదముద్ర పడితే.. ద్విచక్రవాహనాల రెన్యూవల్‌కు ఏడాదికి రూ.2వేలు, కార్లకు రూ.10 వేల మేర చార్జీల మోత మోగనుంది. అంటే.. వాహనం వయసు 20 ఏళ్లు దాటితే.. గతంలో మాదిరిగా ఐదేళ్లకు రెన్యూవల్ అవకాశం ఉండదు. ఏటా వాహనాన్ని రవాణాశాఖ కార్యాలయానికి తీసుకెళ్లి, ఫిట్‌నెస్ పరీక్షలో నెగ్గితేనే రెన్యూవల్ చేస్తారు. వీటితోపాటు.. ఆటోరిక్షాలు, ఇతర వాహనాల రెన్యూవల్ చార్జీలు కూడా దాదాపు రెండింతలు పెరగనున్నాయి. ప్రస్తుతం 15 ఏళ్లు దాటిన బైక్‌కు ఐదేళ్ల రెన్యూవల్‌కు రూ.2 వేలు, 20 ఏళ్లు దాటితే ఐదేళ్లకు రూ.5వేలుగా చార్జీలున్నాయి. 15 ఏళ్లు దాటిన కార్లకు ఐదేళ్ల రెన్యూవల్‌కు రూ.5 వేలు, 20 ఏళ్లు దాటితే రూ.10వేలుగా ఉంది.

## చైనాలో మరో మహమ్మారి.. గబ్బిలాల్లో కరోనా లాంటి వైరస్ గుర్తింపు




**చైనా-నవభూమి:** కొవిడ్ వైరస్‌కు పుట్టినిల్లుగా కొవిడ్-19కి కారణం అయిన %బూా=వా-జశీఎ%- భావించే చైనాలో మరో కొత్త వైరస్ వెలుగుచూసిందన్న వార్తలు.. యావత్ ప్రపంచాన్ని మరోసారి భయాందోళనలకు గురి చేస్తున్నాయి. హెచ్‌కెయూ5 కోవ్ 2 వైరస్‌ను గబ్బిలాల్లో గుర్తించినట్లు పరిశోధకులు వెల్లడించారు. కరోనా వైరస్‌కు కారణం అయిన సార్స్ కోవ్-2ను తాజా హెచ్‌కెయూ5 కోవ్ 2 వైరస్ పోలి ఉన్నట్లు తేల్చారు. ఈ హెచ్‌కెయూ5 కోవ్ 2 వైరస్.. జంతువుల నుంచి మానవులకు సంక్రమించే ముప్పు ఉన్నట్లు చెబుతుండటం తీవ్ర సంచలనంగా మారింది. చైనాలో వెలుగు చూసిన ఈ హెచ్‌కెయూ5 కోవ్ 2 వైరస్.. 2 వైరస్‌ను పోలి ఉన్నట్లు పరిశోధనల్లో గుర్తించారని హాంకాంగ్‌కు చెందిన సౌత్‌చైనా మార్నింగ్ పోస్ట్ పత్రిక తాజాగా ఒక కథనాన్ని ప్రచురించింది. కరోనా వైరస్‌ల గురించి గబ్బిలాలపై అనేక పరిశోధనలు చేసి "బ్యాట్ ఉమెన్" అనే పేరు గాంచిన ప్రముఖ చైనా వైరాలజిస్ట్ షీ ఝెంగ్‌లీ.. ఈ పరిశోధనా బృందానికి నేతృత్వం వహించారు. ఇందులో గాంఘ్జౌ లేబొరేటరీ, గాంఘ్జౌ అకాడమీ ఆఫ్ సైన్సెస్, వుహాన్ యూనివర్సిటీతో పాటు వుహాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి చెందిన శాస్త్రవేత్తలు సభ్యులుగా ఉన్నారు.

ఈ పరిశోధనకు సంబంధించిన నివేదికను సెల్ జర్నల్‌లో సమీక్షకు ఉంచినట్లు సౌత్‌చైనా మార్నింగ్ పోస్ట్ తన కథనంలో పేర్కొంది. ఈ హెచ్‌కెయూ5 కోవ్ 2 వైరస్ మెర్బెకోవైరస్‌తోపాటు ప్రాణాంతక మిడిల్ ఈస్ట్ రెస్పిరేటరీ సిండ్రోమ్ (మెర్స్-కోవ్) ఉప రకానికి చెందిందని షీ ఝెంగ్‌లీ పరిశోధకుల బృందం తేల్చింది. ఈ వైరస్ హెచ్‌కేయూ5 కొవిడ్ వైరస్ జాతికి చెందినదిగా పేర్కొన్నారు. అయితే ఈ వైరస్‌ను మొట్టమొదటగా హాంకాంగ్‌లోని జపనీస్ పిపిస్ట్రెల్ రకం గబ్బిలాల్లో గుర్తించినట్లు తెలిపారు. తాజా అధ్యయనం ప్రకారం.. హెచ్‌కేయూ5-కోవ్-2 వైరస్ నేరుగా లేదా మధ్యలో ఉన్న జీవుల ద్వారా మనుషులకు వ్యాప్తి చెందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని శాస్త్రవేత్తలు తీవ్ర హెచ్చరికలు చేస్తున్నారు. ఈ హెచ్‌కేయూ5-కోవ్-2 వైరస్ సామర్థ్యం కరోనా వైరస్‌తో పోలిస్తే తక్కువేనని శాస్త్రవేత్తలు చెప్పడం కాస్త రిలీఫ్‌గా మారింది.

## భర్తతో బిడ్డను కనేందుకు డబ్బు డిమాండ్ చేసిన భార్య




**న్యూఢిల్లీ-నవభూమి:** పెళ్లైన ప్రతీ అమ్మాయి తన భర్త, అత్తింటి నుంచి రూపాయి కూడా ఆశించకుండా.. జీవితాంతం ఉచితంగా పనులు చేస్తుంటుంది. డబ్బులు కూడా సంపాదించి ఇస్తూ వారిని ప్రేమగా చూసుకుంటుంది. అలాగే భర్తతో పిల్లల్ని కంటూ.. వారి వంశాన్ని వృద్ధి చేస్తుంది. ఇదంతా మనకు తెలిసిందే. మనం రోజూ చూసేదే కూడా. కానీ తాజాగా ఓ మహిళ.. కట్టుకున్న వాడితో బిడ్డను కనేందుకు భారీగా డబ్బు డిమాండ్ చేసింది. రూ.33 కోట్లిస్తేనే నీతోనే బిడ్డను కంటానని భర్తకు తేల్చి చెప్పింది. మరి అందుకు భర్త ఏం చేశాడో మనం ఇప్పుడు తెలుసుకుందాం. బ్రిటన్‌లో పుట్టి పెరిగిన మలైకా రాజాకు ముందు నుంచి విలాసవంతమైన జీవితం అంటే చాలా ఇష్టం. తాను వాడే వస్తువులు, మేకప్‌కు సంబంధించిన అన్నింటినీ వీడి యోలుగా తీస్తూ సోషల్ మీడియాలో కూడా పెట్టేది. ఇదంతా బాగానే ఉండగా.. ఈమె 2017లో దుబాయికి చెందిన ఓ కోటీశ్వరుడిని పెళ్లి చేసుకుంది. ఇక అప్పటి నుంచి మరింత విలాసవంతమైన జీవితాన్ని గడుపుతూ లైఫ్‌ను ఫుల్లుగా ఎంజాయ్ చేస్తోంది. ఇప్పటికే ఈ జంటకు ఓ పాప పుట్టగా.. భర్త మలైకా రాజాను మరో బిడ్డను ఇవ్వమని అడిగాడట. అయితే తనకు కూడా పిల్లల్ని కనడం ఇష్టమే అయినప్పటికీ.. 33 కోట్ల రూపాయలు ఇస్తేనే పిల్లలు కంటానని భర్తకు తెగేసి చెప్పింది. అయితే భర్త ముందు ఆశ్చర్యపోయి ఎందుకు అంత డబ్బు అని అడిగాడు. అందుకు మలైకా.. తనకు పుట్టబోయే బిడ్డకు ఆర్థిక భద్రత చాలా అవసరం అని అందుకే ఆ డబ్బు కావాలని అడుగుతున్నట్లు చెప్పింది. ఆమె సమాధానం నచ్చడంతో అతడు భార్య అడిగిన 33 కోట్లను ఒకేసారి చెల్లించాడు. ఈక్రమంలోనే మలైకా రాజా మరో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. పాప పుట్టిన తర్వాత భర్త ఇచ్చిన డబ్బులతో మలైకా రాజా అనేక వస్తువులు కొనుగోలు చేసింది. ముందుగా 15 కోట్లు పెట్టి ఓ విలాసవంతమైన భవనం కొనింది. అందులో తన పిల్లలను పెంచాలని నిర్ణయించింది. అలాగే గులాబీ రంగు వ్యాగన్ కారు, ఆపై 86 లక్షలతో 8 డిజైనర్ బ్యాగులు, 70 లక్షల రూపాయలతో బంగారం, బట్టలు కొనుగోలు చేసింది. అలాగే పుట్టబోయే పిల్లల సంరక్షణ కోసం మరో 70 లక్షలు పక్కకు పెట్టుకుంది. అయితే ఇదంతా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వెల్లడించింది. అంతేకాకుండా తాను డబ్బులో కోసమే పెళ్లి చేసుకున్నట్లు చెప్పింది. దీంతో ఆమె వీడియో నెట్టింట వైరల్ కాగా.. ఈ షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రస్తుతం ఈ వీడియోలు చూసిన వారంతా ఒక్కో విధంగా స్పందిస్తున్నారు. మంచి పని చేశారు.. పిల్లలకు ఆర్థిక భద్రత చాలా ముఖ్యమని కొంతమంది చెబుతుండగా.. భర్త సంపాదించిందంతా మీకు, మీ పిల్లలకేగా ఇలా ప్రత్యేకించి డిమాండ్ చేయడం ఎందుకుని మరికొంత మంది ప్రశ్నిస్తున్నారు.

## సీతాకోక చిలుకను చంపి శరీరంలోకి ఇంజెక్ట్ చేసుకున్న బాలుడు



**బ్రెజిల్-నవభూమి:** రోజురోజుకూ సోషల్ మీడియాలో దారుణమైన ఛాలెంజ్‌లు విసురుతున్నారు. ఎవరూ చేయలేని సాహసాలతో పాటు అనారోగ్యకరమైన ఆహారాలను తినమని చెప్తున్నారు. పలువురు వాటిని స్వీకరిస్తూ.. తీవ్ర అనారోగ్యం పాలవుదుతుండగా, మరికొందరు అయితే ఏకంగా ప్రాణాలే కోల్పోతున్నారు. తాజాగా ఓ 14 ఏళ్ల బాలుడు కూడా యూట్యూబ్‌లో ఓ ఛాలెంజ్ చూసి దాన్ని స్వీకరించాడు. ఈక్రమంలోనే ఓ సీతాకోక చిలుకను పట్టి దాన్ని చంపాడు. ఆపై దాని నలిపేసి నీళ్లలో కలిపి వాటిని తన శరీరంలోకి ఇంజెక్ట్ చేసుకున్నాడు. ఆపై ఏం జరిగిందో తెలియాలంటే మీరి కథ చదవాల్సిందే. బ్రెజిల్‌లోని విటోరియా డా కాన్క్విస్టాకు చెందిన 14 ఏళ్ల దేవి నూన్స్ మెరీరా.. తరచుగా సోషల్ మీడియాను ఫాలో అవుతాడు. ఈక్రమంలోనే యూట్యూబ్‌లో ఓ ఛాలెంజ్ గురించి చూశాడు. దాన్ని తాను కూడా అనుసరించాలనుకున్నాడు. ఈ క్రమంలోనే ఓ సీతాకోక చిలుకను పట్టుకుని దాన్ని చంపాడు. ఆపై దాన్ని నలిపేసి.. ఓ గ్లాసులో నీళ్లు తీసుకుని దాంట్లో వేశాడు. ఆపై వాటిని సిరంజిలోకి తీసుకుని శరీరంలోకి ఇంజెక్ట్ చేసుకున్నాడు. అయితే ఇలా చేసుకున్న తర్వాత కాసేపు ఆరోగ్యంగానే ఉన్న దేవి నూన్స్ మెరీరాకు కొన్ని గంటల తర్వాత వాంతులు అవ్వడం ప్రారంభం అయింది. చాలా సేపటి వరకు అతడు వాంతులు చేసుకుంటూనే ఉండగా.. భయపడ్డ తల్లిదండ్రులు వెంటనే అతడిని శాంటా మార్సెలినా ఆస్పత్రికి తరలించారు. ఈక్రమంలోనే వైద్యులు పరీక్షించి తీవ్రమైన నొప్పితో బాధ పడుతున్న బాలుడికి ఇన్ఫెక్షన్ సోకినట్లు గుర్తించారు. అసలీ ఇన్ఫెక్షన్ ఎలా వచ్చిందో తెలుసుకోవడానికి బాలుడు ఏమేం తిన్నాడో చెప్పాలని తల్లిదండ్రులను అడిగారు. వాళ్లు ఇంట్లో తిన్నవన్నీ చెప్పగా.. ఆపై బాలుడి వద్దకు వెళ్లి ప్రశ్నించారు. ఈక్రమంలోనే తాను ఓ ఇంజెక్షన్ చేసుకున్నట్లు వెల్లడించాడు. ముఖ్యంగా సీతాకోక చిలుక అవశేషాలను శరీరంలోకి ఇంజెక్ట్ చేసుకున్నట్లు చెప్పగా వైద్యులు.. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై కేసు నమోదు కాగా వైద్యులు మాత్రం బాలుడిని కాపాడేందుకు చేయాల్సిన పనులన్నీ చేశారు. వారం రోజుల పాటు 24 గంటలూ అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య చికిత్సలు అందించారు. కానీ దురదృష్టవశాత్తు బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. దీంతో కేసును మరింత సీరియస్‌గా తీసుకున్న పోలీసులు అతడు ఎవరిని చూసి ఇలాంటి ఛాలెంజ్ స్వీకరించాడో తెలుసుకనే పనిలో పడ్డారు. అతడి ఫోన్, ల్యాప్‌టాప్ వంటివి చెక్ చేసేందుకు ఇంటికి వెళ్లగా.. బాలుడి మంచం మీద సిరంజి దొరికింది. అందులో ఇంకా సీతాకోక చిలుక అవశేషాలు ఉండడాన్ని కూడా గుర్తించారు. మరోవైపు బిడ్డ మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. ఎవరో చేసిన పిచ్చి ఛాలెంజ్ వల్ల తమ కుమారుడు ప్రాణాలు కోల్పోయాడంటూ కన్నీళ్లు పెడుతున్నారు. అలాగే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ పోలీసులను కోరుతున్నారు.

## ఔషధాలు తీసుకునే వారికి అలర్ట్.. 84 బ్యాచ్‌ల మందులు విఫలం



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రస్తుతం మార్కెట్‌లో లభించే పలు రకాల మందులు అనేక మంది ప్రాణాలతో ఆడుకుంటున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే ఇటీవల ప్రభుత్వ విచారణలో 84 బ్యాచ్‌ల మందులు విఫలమయ్యాయి. వీటిలో ఎసిడిటీ, కొలెస్ట్రాల్, డయాబెటిస్, ఇన్ఫెక్షన్ వంటి వ్యాధులకు సంబంధించిన మందులు కూడా ఉన్నాయి. ప్రతిరోజూ మిలియన్ల మంది ప్రజలు ఈ మందులను ఉపయోగిస్తుండటం విశేషం. కానీ అవి రోగాన్ని నయం చేసే బదులు, మీ ఆరోగ్యాన్ని మరింత పాడు చేస్తాయని అంటున్నారు.

**పలు రకాల మందులు..**

దేశంలోని ఔషధాల నాణ్యతను పర్యవేక్షించే సంస్థ (సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్) ప్రతి నెలా మార్కెట్ నుంచి పలు రకాల మందుల నమూనాలను సేకరించి వాటిని పరీక్షిస్తుంది. ఆ క్రమంలో ఔషధాలు సూచించిన ప్రమాణాలకు అనుగుణంగా లేకపోతే, అది "నాణ్యత లేని నాణ్యత" గా ప్రకటిస్తుంది. ఈ క్రమంలోనే డిసెంబర్ 2024 నివేదిక ప్రకారం 84 బ్యాచ్‌ల మందులు లోపభూయిష్టంగా ఉన్నట్లు గుర్తించారు. ఇందులో అనేక సాధారణ వ్యాధులకు ఇచ్చిన మందులు కూడా ఉన్నాయి.

**చెడు మందులను ఎలా గుర్తిస్తారు?**

ప్రభుత్వం సేకరించిన మందుల నమూనాలను మొదట ల్యాబ్‌లో పరీక్షిస్తారు. ఆ తర్వాత ఔషధం నాణ్యత పరీక్షలో విఫలమైతే, అది %చీూు%గా ప్రకటించబడుతుంది. చాలా సార్లు మందులు సరైన పరిమాణంలో అవసరమైన మూలకాలను కలిగి ఉండవు. కొన్నిసార్లు వాటిలో విషపూరిత రసాయనాలు కూడా వెలుగులోకి వస్తాయి. ఇవి మన ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదాన్ని కలిగించవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మరింత కఠినంగా నిబంధనలు

ఇప్పుడు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల ప్రకారం కొత్త నిబంధనలను రూపొందించింది. ప్రతి ఇన్‌స్పెక్టర్ ప్రతి నెలా కనీసం 10 నమూనాలను సేకరించాల్సి ఉంటుంది. వీటిలో 9 మందులు, 1 వైద్య పరికరం లేదా కాస్మెటిక్ ఉత్పత్తి. ఈ చర్యల ద్వారా నాసిరకం మందులను త్వరగా గుర్తించవచ్చు. ఇది ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు మరింత మంచి నిర్ణయమని చెప్పవచ్చు.

**మనం ఏం చేయాలి?..** ఇలాంటి క్రమంలో మీరు మీ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఎల్లప్పుడూ గుర్తింపు పొందిన కంపెనీ నుంచి మాత్రమే మందులను తీసుకోవాలి. ఔషధాలు తీసుకునే సమయంలో గడువు తేదీని తప్పనిసరిగా చెక్ చేయాలి. దీంతోపాటు వైద్యుల సలహా లేకుండా ఎలాంటి మందులు తీసుకోవద్దు. ఔషధం తీసుకున్న తర్వాత మీకు ఏదైనా సమస్య అనిపిస్తే, వెంటనే వైద్యులను సంప్రదించాలి.

## నిరుద్యోగులకు భలే ఛాన్స్.. ఎలాంటి రాత పరీక్షలేకుండానే బ్యాంకు కొలువులు!




**న్యూఢిల్లీ-నవభూమి:** బ్యాంక్ ఆఫ్ బరోడా దేశ వ్యాప్తంగా ఉన్న పలు బ్రాంచుల్లో రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ కింద మొత్తం 518 ఉద్యోగాలు భర్తీ చేస్తారు. సీనియర్ మేనేజర్, మేనేజర్-డెవలపర్ ఫుల్‌స్టాక్, ఆఫీస్-డెవలపర్, సీనియర్ మేనేజర్, ఆఫీసర్-క్లౌడ్ ఇంజినీర్, ఆఫీసర్-ఏఐ ఇంజినీర్, మేనేజర్-ఏఐ ఇంజినీర్, సీనియర్ మేనేజర్ ఏఐ ఇంజినీర్, ఆఫీసర్ ఏపీఐ డెవలపర్, మనేజర్ ఏపీఐ డెవలపర్, మేనేజర్- నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, సీనియర్ మేనేజర్ డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్ మొదలైన పోస్టులు భర్తీ చేయనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్ విధానంలో మార్చి 11, 2025వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పోస్టును బట్టి సంబంధిత విభాగంలో డిగ్రీ, బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్, ఎంసీఏ, సీఏ, సీఎఫ్ఏ, ఎంబీఏలో ఉత్తీర్ణత కలిగి ఉండాలి. అలాగే సంబంధిత విభాగంలో నోటిఫికేషన్‌లో సూచించిన విధంగా పని అనుభవం కూడా ఉండాలి. పోస్ట్ గ్రేడ్-ఎంఎంజీ/ఎస్-3 పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు వయసు 27 నుంచి 37 ఏళ్లలోపు ఉండాలి. అలాగే ఎంఎంజీ/ఎస్-2 పోస్టులకు 24 నుంచి 34 ఏళ్లు, జేఎంజీ/ఎస్-1 పోస్టులకు 22 నుంచి 32 ఏళ్లు, ఎస్ఎంజీ/ఎస్-4 పోస్టులకు కు 33 నుంచి 43 ఏళ్ల వరకు గరిష్ఠ వయోపరిమితి ఉండాలి. దరఖాస్తు సమయంలో రిజిస్ట్రేషన్ ఫీజు కింద జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.600, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులు రూ. 100 చొప్పున చెల్లించవల్సి ఉంటుంది. ఎలాంటి రాత పరీక్ష లేకుండానే కేవలం ఇంటర్వ్యూ ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది. ఎంపికైన వారికి నెలకు పోస్ట్ గ్రేడ్- జేఎంజీ/ఎస్-1 పోస్టులకు రూ.48,480, ఎంఎంజీ/ఎస్-2 పోస్టులకు రూ.64,820, ఎంఎంజీ/ఎస్-3 పోస్టులకు రూ.85,920, ఎస్ఎంజీ/ఎస్-4 పోస్టులకు రూ.1,02,300 చొప్పున జీతంగా చెల్లిస్తారు. ఇతర వివరాలు ఈ కింది అధికారిక నోటిఫికేషన్‌లో చెక్ చేసుకోవచ్చు.

## ప్రయాగ్‌రాజ్ వెళ్లలేని వారికి బంపర్ ఆఫర్ అంటూ..



**న్యూఢిల్లీ-నవభూమి:** ఇప్పటి వరకు కుంభమేళాలో వ్యాపారం చేసుకుని కోట్లు సంపాదించిన వారున్నారు. కొందరు బొట్టు పెట్టి, మరికొందరు పూసలమ్మి ఇలా రోజుకొకరు నెట్టింట వైరలవుతున్నారు. నేనేం తక్కువా అనుకున్నాడేమో.. వారిని ఆదర్శంగా తీసుకుని ఓ యువకుడు తన స్టార్టప్ బిజినెస్ ను ప్రయాగ్ రాజ్ లో ప్రారంభించాడు. తన బిజినెస్ ఐడియాను చెబుతూ.. కుంభమేళాకు రాలేని వారికి బంపర్ ఆఫర్ అందించాడు. మహా కుంభమేళాకు హాజరు కాలేని వారు 'డిజిటల్ ఫోటో స్నాన్' సేవను ఎంచుకోవచ్చునని ఓ వీడియో రూపంలో తెలియజేశాడు. భక్తులు తమ ఫోటోలను వాట్సాప్ ద్వారా తనకు పంపవచ్చుని, వాటిని ప్రింట్ చేసి వారి తరపున సంగం పవిత్ర జలాల్లో ముంచుతానని గోయల్ తెలిపాడు. అతని స్టార్టప్ పేరును ప్రయాగ్ ఎంటర్‌ప్రైజెస్ గా తెలిపాడు. ఈ వర్చువల్ తీర్థయాత్ర అనుభవాన్ని రూ. 1,100 చెల్లించినవారికి అందిస్తామని.. 24 గంటల్లోపు ఆచారాన్ని పూర్తి చేస్తానని హామీ కూడా ఇస్తున్నాడు. ఈ వీడియో నెట్టింట వైరల్ గా మారింది. దీనిపై నెటిజన్లు పంచ్ డైలాగులతో విరుచుకుపడుతున్నారు.

## ప్రధాని ముఖ్య కార్యదర్శిగా శక్తికాంత దాస్

**న్యూఢిల్లీ-నవభూమి:** రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రధాని మోదీ ముఖ్య కార్యదర్శిగా నియమితులయ్యారు. తమిళనాడు క్యాడర్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అయిన శక్తికాంత దాస్ 2018 డిసెంబరు నుంచి ఆరేళ్ల పాటు ఆర్బీఐ గవర్నర్‌గా పనిచేశారు. తన 42 ఏళ్ల సర్వీసులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు.

కరోనా సమయంలో దేశ ఆర్థికాభివృద్ధి కొనసాగేందుకు ఆర్బీఐ గవర్నర్‌గా పలు చర్యలు చేపట్టారు. ఇప్పటికే రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పీకే మిశ్రా (గుజరాత్ క్యాడర్) ప్రధాని ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్నారు. శక్తికాంత దాస్ రెండో ముఖ్య కార్యదర్శిగా కొనసాగుతారని క్యాబినెట్ నియామకాల కమిటీ శనివారం ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. కాగా, నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం పదవీ కాలాన్ని మరో ఏడాది పొడిగించారు.

# నవభూమి

www.navabhoomi.in
www.epaper.navabhoomi.in

8 | హైదరాబాద్ | సోమవారం | 24 ఫిబ్రవరి 2025


## పుష్పరాజ్‌పై టీచర్ ఫైర్.. కారణం షాకింగ్



సినిమాలు సమాజాన్ని ప్రభావితం చేస్తాయనడంలో సందేహం లేదు. అయితే చెడగొడతాయనడం అన్యాయం. సినిమాలు సమాజాన్ని, పిల్లల్ని నాశనం చేస్తున్నాయని ఆరోపిస్తూ యూసఫ్ గూడ (హైదరాబాద్) ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆరోపించిన తీరు ప్రస్తుతం సినీవర్గాల్లో చర్చగా మారింది. పుష్ప 2 తన పాఠశాల విద్యార్థులలో సగం మందిని చెడిపోయిన ఆకతాయిలుగా మార్చిందని ఆమె వాదించారు. ఇటీవల విద్యా కమిషన్‌తో జరిగిన సమావేశంలో హైదరాబాద్ నగరంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు చర్చల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సినిమాల వల్ల పిల్లలు చెడిపోతున్నారనే ఆరోపణ అందరినీ ఆశ్చర్యపరిచింది. నిజానికి సినిమాలు చూసి చెడిపోయారని ఆరోపించడం సరైనదేనా? అనే అభిప్రాయం పరిశ్రమ వర్గాల్లో వ్యక్తమైంది. సినిమాలు నాశనం చేస్తున్నాయని ఆరోపించిన ఆ ప్రధానోపాధ్యాయురాలు ఇదే సమావేశంలో పిల్లలపై సమాజం ప్రభావం గురించి కూడా చర్చించారు. పిల్లలు వీధిలో ఉపయోగించే బూతు భాషను స్కూల్ లోను ఉపయోగిస్తున్నారని అన్నారు. చెత్త హెయిర్ స్టైల్ తో వస్తుంటే, దానిని మార్చుకోవాలని చెప్పినా వినడం లేదని ఆరోపించారు. తల్లిదండ్రులు కూడా దీనిని పట్టించుకోవడం లేదని, పిల్లలపై పేరెంట్ కట్టడి లేదని కూడా వ్యాఖ్యానించారు. ఇలాంటి పిల్లలను మార్చడం తమ వల్ల కాదని కూడా చేతులెత్తేసారు. నిజమే పిల్లలపై సినిమాలు ప్రభావం చూపుతున్న మాట వాస్తవమే అయినా, ప్రధానోపాధ్యాయురాలు చెప్పినట్టు పేరెంట్ కంట్రోల్ లేకపోవడం, తమ చుట్టూ ఉన్న అవ్యవస్థ (సమాజం) ప్రభావం పిల్లలపై అధికంగా ఉంటుంది.







## దుబాయ్‌లో పెళ్లికి ఫ్యామిలీతో ఎన్టీఆర్.. ఇంతకీ ఎవరి పెళ్లి?

ప్రస్తుతం దుబాయ్ లో జరుగుతున్న ఓ ప్రైవేట్ వెడ్డింగ్ కోసం టాలీవుడ్ లోని స్టార్లంతా అక్కడికి చేరుకుంటున్నారు. కేవలం సినీ సెలబ్రిటీలు మాత్రమే కాకుండా తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ నాయకులు, బిజినెస్ మ్యాన్స్ కూడా ఈ పెళ్లి కోసం దుబాయ్ కు చేరుకుంటున్నారు. అయితే అంతమంది ప్రముఖులు వెళ్లేంతగా దుబాయ్ లో జరుగుతున్నది ఎవరి పెళ్లి అనుకోవచ్చు. అసలు విషయానికొస్తే, టాలీవుడ్ లో పలు సినిమాలను నిర్మించిన గ్రూప్ ఛైర్మన్, మహేష్ రెడ్డి కొడుకు పెళ్లి దుబాయ్ లో జరుగుతుంది. ఈ పెళ్లి కోసమే ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖులు దుబాయ్‌కు చెక్కేస్తున్నారు. మహేష్ రెడ్డి భక్తి చిత్రాలైన షిర్డీ సాయి, ఓం నమో వెంకటేశాయ సినిమాలను నిర్మించాడు.- వారం రోజులపాటు జిగేల్ రాణితోనే ఆట దుబాయ్ లో అంగరంగ వైభవంగా, ఎంతో గ్రాండ్ గా ఈ పెళ్లి జరగనున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే పలువురు సెలబ్రిటీలు ఈ పెళ్లి కోసం దుబాయ్ వెళ్లగా, మరికొంత మంది సినీ, రాజకీయ ప్రముఖులు కూడా హాజరవనున్నారని సమాచారం. ఈ పెళ్లి కోసమే టాలీవుడ్ స్టార్ హీరో ఎన్టీఆర్, తన భార్య ప్రణతితో కలిసి దుబాయ్ వెళ్లగా, సూపర్ స్టార్ మహేష్ బాబు భార్య నమ్రత కూడా ఈ పెళ్లి కోసం దుబాయ్ వెళ్లారు. ఇందులో భాగంగానే నమ్రత, ఎన్టీఆర్, ప్రణతి కలిసి ఓ గ్యాంగ్ తో దిగిన ఫోటో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతుంది. ఈ ఫోటోలో ఎన్టీఆర్ చాలా స్లిమ్ లుక్ లో కనిపిస్తున్నాడు. ప్రస్తుతం వార్2 ను ముగించే పనిలో ఉన్న తారక్, తన తర్వాతి సినిమాను నీల్ తో ఆల్రెడీ స్టార్ట్ చేశాడు. ఇప్పటికే షూటింగ్ మొదలైపోయింది. నెక్స్ట్ షెడ్యూల్ నుంచి తారక్ కూడా ఈ సినిమా షూటింగ్‌లో జాయిన్ కానున్నాడు. మరో వైపు మహేష్ బాబు, రాజ మౌళి సినిమాతో బిజీగా ఉండటంతో పాటూ మహేష్ పాస్‌పోర్ట్ ను రాజమౌళి సీజ్ చేయడం వల్ల ఈ పెళ్లికి హాజరవడం లేదని అర్థమవుతుంది.

కేరళ కుట్టి మాళవిక మోహనన్ గురించి అందరికీ తెలిసిందే. కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్ పేట మూవీతో సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన ముద్దుగుమ్మ.. రెండో సినిమా దళపతి విజయ్‌తో చేసే ఛాన్స్ కొట్టేసింది. లోకేష్ కనగరాజ్ తీసిన మాస్టర్ మూవీతో చారు పాత్రలో నటించి అందరినీ ఓ రేంజ్ లో మెప్పించింది. ఆ తర్వాత బాలీవుడ్‌లోకి వెళ్లిన మాళవిక.. యుద్ధ సహా విభిన్న సినిమాల్లో యాక్ట్ చేసి ఆకట్టుకుందనే చెప్పాలి. రీసెంట్‌గా పా రంజిత్ దర్శకత్వం వహించిన తంగలాన్ మూవీతో కోలీవుడ్ లోకి రీ ఎంట్రీ ఇచ్చిన మాళవిక.. ఆదివాసీ మహిళ ఆరతి రోల్ లో నటించి ఆకట్టుకుంది. సింపుల్ గా చెప్పాలంటే అదరగొట్టేసింది. ఇప్పుడు చేతి నిండా సినిమాలతో బిజీగా ఉంది మాళవిక. కోలీవుడ్ లో కార్తీ సర్దార్ లో నటిస్తోంది. మిత్రన్ దర్శకత్వం వహిస్తున్న ఆ మూవీలో కీలక పాత్రలో కనిపించనుంది. మాలీవుడ్ లో మోహన్ లాల్ మూవీలో నటించనుంది. ఇప్పుడు తెలుగులో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ రాజా సాబ్ లో యాక్ట్ చేస్తోంది. కామెడీ అండ్ హారర్ జోనర్ లో మారుతి దర్శకత్వం వహిస్తున్న రాజా సాబ్ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. శరవేగంగా మూవీ షూటింగ్ జరుగుతుండగా.. 2025లోనే రిలీజ్ కానుంది. అయితే సినిమాలో మాళవిక మోహనన్.. ప్రభాస్ సరసన హీరోయిన్‌గా నటిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. అయితే మాళవిక రాజా సాబ్ చేయడానికి గల కారణాన్ని రీసెంట్ గా వివరించింది. హారర్ కామెడీ ఎంటర్టైనర్‌గా రూపొందుతున్న

### రాజా సాబ్.. మాళవిక అందుకే చేస్తుందట!

రాజా సాబ్ స్పెషల్ మూవీ అని చెప్పిన ఆమె.. సినిమా అంతా తన రోల్ ఉంటుందని చెప్పింది. నార్మల్ గా స్టార్ హీరోల సినిమాల్లో హీరోయిన్ స్క్రీన్ టైమ్ తక్కువగా ఉంటుందని అనింది. కానీ రాజా సాబ్ లో మాత్రం తన రోల్ ప్రారంభం నుంచి చివరి వరకు ఉంటుందని.. అందుకే చేస్తున్నట్లు పేర్కొంది మాళవిక. అదే సమయంలో సినిమాపై మంచి హోప్స్ కూడా పెట్టుకున్నట్టు తెలుస్తోంది. సూపర్ హిట్ ను అందుకునేందుకు సిద్ధంగా ఉందట. మరి పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ఆ సినిమా.. ఎప్పుడు రిలీజ్ అవుతుందో.. ఎలాంటి హిట్ అవుతుందో.. మాళవిక ఎలా మెప్పిస్తుందో వేచి చూడాలి.





## అంజలి న్యూ లుక్: గ్లామరస్ కిల్లర్

ఈ ఫోటోలకు "క్యాచ్ ది వైబ్" అంటూ క్యాప్షన్ ఇచ్చిన అంజలి, సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. టాలీవుడ్ అందాల తార అంజలి మరోసారి తన గ్లామర్ లుక్ తో నెట్టింట హీటెక్కించింది. సినిమాల్లో సహజమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ తెలుగమ్మాయి, తాజాగా తన స్టన్నింగ్ ఫోటోషూట్ తో ఫ్యాషన్ ప్రపంచాన్ని షేక్ చేస్తోంది. బ్లాక్ అవుట్‌ఫిట్‌లో అంజలి చూపించిన గ్లామరస్ లుక్ అభిమానుల హృదయాలను దోచుకుంటోంది. ఈ లేటెస్ట్ ఫోటోషూట్‌లో అంజలి నీలిరంగపు డిజైనర్ బ్రా అలాగే డీప్ స్లిట్ గల డ్రెస్‌లో కనిపిస్తూ తన అందాన్ని మరింత హైలైట్ చేసింది. స్టైలిష్ వేర్‌లో కనిపించిన ఆమె, మాస్ క్లాస్ ప్రేక్షకులను ఒకేసారి ఆకర్షించగలిగే విధంగా తన హావభావాలను ప్రదర్శించింది. ఆమె కళ్ళలో కనిపించే భావాలు, సింపుల్ మెకప్ కర్లీ హెయిర్ స్టైల్ ఆమె లుక్‌కు మరింత గ్లామర్‌ని జోడించాయి. ఈ ఫోటోలకు "క్యాచ్ ది వైబ్" అంటూ క్యాప్షన్ ఇచ్చిన అంజలి, సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ప్రముఖ స్టైలిస్ట్ మనోగ్న గోల్లపూడి ఈ లుక్‌కు స్టైలింగ్ చేయగా, ఆహిలా ఖాన్ డిజైన్ చేసిన అవుట్‌ఫిట్‌లో ఆమె మరింత అందంగా కనిపించింది. జ్యువెల్స్ ఎంపిక, లైట్ మేకప్ ఆమెను ఒక అందమైన డివా లా మార్చేశాయి. అంజలి నటనా పరంగా సినిమాలు తగ్గించినా, సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు తన అందం, స్టైల్ తో ఫ్యాన్స్‌ను కనువిందు చేస్తోంది. ఇటీవల 'గేమ్ చేంజర్' సినిమాతో ఫ్యాన్స్‌ను అలరించిన ఆమె, వెబ్ సిరీస్‌లలోనూ తళుక్కు మంటోంది. ఈ తాజా ఫోటోషూట్, ఆమెను మరోసారి ట్రెండింగ్‌లోకి తెచ్చింది. ఈ లుక్స్‌తో అంజలి, ఫ్యాషన్ ప్రపంచంలో తనదైన ముద్ర వేయడమే కాదు, ఆమెకు ఇంకా ఎన్నో బిగ్ ఆఫర్లు వచ్చేలా చేస్తోంది. మరి, ఈ గ్లామర్ డోస్ తర్వాత అంజలి బిగ్ స్క్రీన్‌పై మళ్లీ స్టన్నింగ్ ఎంట్రీ ఇస్తుందా? అనేది ఆసక్తిగా మారింది.

## బాలీవుడ్‌లో బ్యాలెన్స్ ఉంది బన్నీ ఒక్కడేనా?



టాలీవుడ్ నుంచి పాన్ ఇండియా హీరోల్లో ఇప్పటికే బాలీవుడ్ లో కొంత మంది హీరోలు లాంచ్ అయిన సంగతి తెలిసిందే. పాన్ ఇండియా మోజు కంటే ముందే మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కొన్నేళ్ల క్రితమే జంజీర్ రీమేక్ తో లాంచ్ అయ్యాడు. ఆ సినిమా తెలుగులో తుఫాన్‌గా రిలీజ్ అయింది. కానీ ఫ్లాప్ అయింది. ఇక డార్లింగ్ ప్రభాస్ సాహో సినిమాతో హిందీ లో లాంచ్ అయ్యాడు. తెలుగులో పాటు హిందీలోనూ తెరకెక్కిన చిత్రమిది. ఆ తర్వాత 'అదిపురుష్' సినిమాతో మరోసారి బాలీవుడ్ చిత్రం చేసాడు. ఈ రెండు సినిమాలు కూడా ప్రభాస్ కి అక్కడ పెద్దగా కలిసి రాలేదు. ఆదిపురుష్ అయితే విమర్శలే తెచ్చి పెట్టింది. ఇక యంగ్ టైగర్ ఎన్టీఆర్ వార్ 2తో బాలీవుడ్ లో లాంచ్ అవుతున్నాడు. ఇందులో హృతిక్ రోషన్ తో కలిసి నటిస్తున్నాడు. సినిమాపై భారీ అంచనా లున్నాయి. ఇదే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ఫలితం ఎలా ఉంటుంది? అన్నది చూడాలి. మరి ఈ లిస్ట్ లో బాలీవుడ్ లో లాంచ్ అవ్వని పాన్ ఇండియా స్టార్ ఎవరు? అంటే ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కనిపిస్తున్నాడు. పుష్పాంచైజీతో పాన్ ఇండియాలో బన్నీ ఓ బ్రాండ్ అయ్యాడు. కానీ ఇంకా హిందీ సినిమా చేయలేదు. అవకాశాలు వస్తున్నాయి గానీ తెలుగు సినిమాలకు ఇచ్చిన ప్రాధాన్యత హిందీ సినిమాలకు ఇవ్వడం లేదు. ఈ క్రమంలోనే లాంచ్ అవ్వలేదు. మరి మరో రెండు మూడు తెలుగు సినిమాల తర్వాతైనా బాలీవుడ్ గురించి ఆలోచిస్తాడేమో చూడాలి. ఇంకా యంగ్ హీరోలు నిఖిల్, తేజ సజ్జా కూడా పాన్ ఇండియాలో పేరు తెచ్చుకున్నారు. కానీ హిందీ సినిమా ఆలోచనలు చేయలేదు. తెలుగు నుంచే పాన్ ఇండియాలో కంటున్యూ అవుతున్నారు.

## దుబాయ్ స్టేడియంలో చిరంజీవి.. భారత్-పాక్ మ్యాచ్ చూస్తూ ఎంజాయ్ చేస్తున్న మెగాస్టార్!



**న్యూఢిల్లీ-నవభూమి:** క్రికెట్ ప్రేమికులు ఎంతో ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న భారత్-పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్ ప్రారంభమైంది. ఈ మ్యాచ్‌ను సామాన్య క్రికెట్ ప్రేమికులే కాదు.. సెలబ్రిటీల సైతం ఎంతో ఆసక్తిగా వీక్షిస్తున్నారు. కొందరు నేరుగా స్టేడియంకు వెళ్లి వీక్షిస్తుండగా, మరికొందరు టీవీల ద్వారా చూస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి దుబాయ్ స్టేడియంలో ప్రత్యక్షమయ్యారు. చిరంజీవి పెవిలియన్‌లో కూర్చుని ఆసక్తిగా మ్యాచ్ వీక్షిస్తూ టీవీ స్క్రీన్‌పై పలుసార్లు కనిపించారు. మరోవైపు మాజీ కెప్టెన్ ఎంస్ ధోనీ, నటుడు సన్నీ డియోల్ కలిసి టీవీలో మ్యాచ్ చూస్తున్న దృశ్యాలు కూడా వైరల్ అవుతున్నాయి. కాగా, టాస్ గెలిచిన పాకిస్తాన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. స్లో పిచ్‌పై పాకిస్తాన్ బ్యాటర్లు చాలా నెమ్మదిగా ఆడుతున్నారు. కాస్త దూకుడు పెంచి బౌండరీలు కొడుతున్న పాక్ ఓపెనర్ బాబర్ అజామ్ (23)ను హార్దిక్ పాండ్యా పెవిలియన్‌కు చేర్చాడు. మరో ఓపెనర్ ఇమామ్ ఉల్ హక్ (25 బంతుల్లో 10) రనౌట్ అయ్యాడు. అక్షర్ పటేల్ విసిరిన త్రోకు రనౌట్ అయ్యాడు. ప్రస్తుతం 25 ఓవర్లలో పాకిస్తాన్ 2 వికెట్లు కోల్పోయి 99 పరుగులు చేసింది.

ప్రస్తుతం మహ్మద్ రిజ్వాన్ (53 బంతుల్లో 24), షౌద్ షకీల్ (47 బంతుల్లో 29) క్రీజులో ఉన్నారు. స్పిన్నర్లు బౌలింగ్ చేస్తున్నారు. ఈ మ్యాచ్‌లో కూడా ఓటమి పాలైతే ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి పాకిస్తాన్ దాదాపు నిష్క్రమించినట్టే. అందుకే ఈ మ్యాచ్‌ను పాకిస్తాన్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. కాగా, టీమిండియా గత మ్యాచ్‌లో బరిలోకి దిగిన టీమ్‌తోనే మార్పులేమీ లేకుండా బరిలోకి దిగింది.

## పాకిస్తాన్ ఫస్ట్ ఇన్నింగ్స్ స్కోర్‌పై మార్కెట్ అంచనా ఇదే..



**న్యూఢిల్లీ-నవభూమి:** ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా భారత్-పాకిస్తాన్ మ్యాచ్ దుబాయి వేదికగా ప్రారంభమైంది. టాస్ గెలిచిన పాకిస్తాన్ మొదట బ్యాటింగ్ చేస్తోంది. ఈ మ్యాచ్‌ను క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా చూస్తున్నారు. ప్రస్తుతం మొదటి పవర్ ప్లే పూర్తికాగా పది ఓవర్లకు పాకిస్తాన్ రెండు వికెట్ల నష్టానికి.... పరుగులు చేసింది. తొమ్మిదవ ఓవర్ వేసిన హార్ధిక్ పాండ్యా 8.2 ఓవర్ల వద్ద పాకిస్తాన్ డేంజరస్ బ్యాట్స్‌మెన్ బాబర్ అజామ్‌ను పెవిలియన్ పంపాడు. దీంతో భారత్ అభిమానుల్లో ఆనందం నెలకొంది. 8 ఓవర్ల వరకు వికెట్ పడకపోవడంతో భారత్ అభిమానులు ఒకింత నిరాశ చెందారు. 9వ ఓవర్ వేసిన హార్ధిక్ వికెట్ తీయడంతో పాకిస్తాన్ అభిమానులు నిరాశ చెందగా.. భారత్ అభిమానులు మాత్రం పండగ చేసుకున్నారు. పదో ఓవర్ వేసిన కుల్దీప్ యాదవ్ మరో వికెట్ తీసుకోవడంతో భారత్ శిబిరంలో ఆనందం నెలకొంది. ఓపెన్లరు ఇద్దరూ ఫస్ట్ పవర్ ప్లేలో పెవిలియన్ చేరారు. పది ఓవర్ల తర్వాత రిజ్వాన్, షకీల్ బ్యాటింగ్ చేస్తున్నారు.

## రెండు వికెట్లు కోల్పోయిన పాకిస్తాన్.. నెమ్మదిగా ఆడుతున్న పాక్ బ్యాటర్లు!



**న్యూఢిల్లీ-నవ భూమి:** క్రికెట్ ప్రేమికులు ఎంతో ఆసక్తికరంగా ఎదురు చూస్తున్న భారత్-పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచిన పాకిస్తాన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. స్లో పిచ్‌పై పాకిస్తాన్ బ్యాటర్లు చాలా నెమ్మదిగా ఆడుతున్నారు. కాస్త దూకుడు పెంచి బౌండరీలు కొడుతున్న పాక్ ఓపెనర్ బాబర్ అజామ్ (23)ను హార్దిక్ పాండ్యా పెవిలియన్‌కు చేర్చాడు. మరో ఓపెనర్ ఇమామ్ ఉల్ హక్ (25 బంతుల్లో 10) రనౌట్ అయ్యాడు. అక్షర్ పటేల్ విసిరిన త్రోకు రనౌట్ అయ్యాడు. ప్రస్తుతం 10 ఓవర్లలో పాకిస్తాన్ 2 వికెట్లు కోల్పోయి 52 పరుగులు చేసింది బౌలింగ్ ప్రారంభించిన పేసర్ మహ్మద్ షమీ కాస్త ఇబ్బంది పడినట్టు కనిపించాడు. స్వల్ప గాయం కారణంగా కాసేపు మైదానాన్ని వీడి బయటకు వెళ్లాడు. ప్రస్తుతం మహ్మద్ రిజ్వాన్, షౌద్ షకీల్ క్రీజులో ఉన్నారు. స్పిన్నర్లు బౌలింగ్ చేస్తున్నారు. ఆదివారం భారత్‌తో జరిగే మ్యాచ్‌లో కూడా ఓటమి పాలైతే ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి పాకిస్తాన్ దాదాపు నిష్క్రమించినట్టే. అందుకే ఈ మ్యాచ్‌ను పాకిస్తాన్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. కాగా, టీమిండియా గత మ్యాచ్‌లో బరిలోకి దిగిన టీమ్‌తోనే మార్పులేమీ లేకుండా బరిలోకి దిగింది. పాకిస్తాన్ మాత్రం గత మ్యాచ్‌తో పోల్చుకుంటే ఓ మార్పుతో బరిలోకి దిగింది.


Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**